
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

చదరపు అడుగుకు 30 వేల ఖర్చు 12

రుషికొండపై నిర్మాణాలకు అతి భారీ వ్యయం
స్టార్ హోటల్ పేరుతో నిర్మాణం ప్రారంభం
పర్యాటకులకు ఒక్క రూమ్ లేకుండానే భవనాలు
స్టార్ హోటళ్లలో రూ.కోటితో హంగుల గది
రూ.450 కోట్లకు రావలసిన రూమ్‌లు 450
కానీ.. రుషికొండలో కట్టినవి 12 బెడ్ రూమ్‌లే



బుధవారం | 19-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 64 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిధి: ద్వాదశి ఉ. 7.28 తదుపరి త్రయోదశి; నక్షత్రం: విశాఖ సా. 5.23 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.9.30-11.09; దుర్ముహూర్తం: ఉ.11.50-12.42; అమృతఘడియలు: ఉ.8.03-9.44; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.47 | హైదరాబాద్ సిటీ
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తప్పు జరిగితే ఒప్పుకోండి

0.001% నిర్లక్ష్యం ఉన్నా కఠిన చర్యలు అవసరం
మోసగాడు వైద్యుడైతే సమాజానికే హానికరం
నీట్ కేసులో ఎన్‌టీఏ, కేంద్రంపై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నీట్ నిర్వహణలో 0.001% నిర్లక్ష్యం ఉన్నా.. కఠినచర్యలు అవసరమని, తప్పు జరిగితే ఒప్పుకొని చక్కదిద్దాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అప్పుడే నీట్‌పై ప్రజల్లో మళ్లీ విశ్వాసం నెలకొంటుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు పడే శ్రమను పరిగణనలోకి తీసుకుని నిర్లక్ష్యానికి తావు లేకుండా నిర్వహించాలని కేంద్రానికి, ఎన్‌టీఏకి సూచించింది. నీట్ అక్రమాలపై దాఖలైన తాజా రిట్ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్వీ భట్టితో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం

మిగతా 2వ పేజీలో...



ఎన్‌టీఏలో సంస్కరణలు! 2

పరీక్షల వివాదాల నేపథ్యంలో నిర్ణయం.. సూచనలకు ఉన్నత స్థాయి కమిటీ
కోర్టు తీర్పు ఆధారంగా నీట్ పరిష్కారం.. కేంద్ర ఉన్నతాధికారి వెల్లడి
24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు గందరగోళం
నీట్‌లో అవినీతికి అరెస్టులే రుజువు.. అయినా మోదీ మౌనం: రాహుల్

'నీట్'ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి
విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్ 3
'స్టూడెంట్ మార్చ్' పేరిట హైదరాబాద్‌లో ర్యాలీ



హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ నిరసన

రోడ్డు ప్రమాద బాధితులకు
లక్ష చికిత్స ఫ్రీ

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం

- వైద్యఆరోగ్యశాఖలో సంస్కరణలకు ప్రభుత్వం కసరత్తు
- ప్రైవేటు ఆస్పత్రులు, మందుల నాణ్యత, హోటళ్లు రెస్టారెంట్లపై టాస్క్‌ఫోర్సులు
- 15 రోజుల్లో తనిఖీలు మొదలు.. త్వరలో బదిలీలు, 3 డైరెక్టర్ పోస్టుల మంజూరు
- ఆచార్యులు, అధ్యాపకుల మూల వేతనం పెంపు.. సిబ్బందికి ఠంచనుగా వేతనం
- ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు.. వైద్యఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ

రోడ్డు ప్రమాద ఘటనల్లో బాధితులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.లక్ష వరకు ఉచితంగా వైద్యం అందించే పథకాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై తీవ్రంగా కసరత్తు చేస్తోంది. రహదారుల వెంట జరిగే ప్రమాదాల్లో క్షతగ్రాతులకు ఎంత త్వరగా వైద్యం అందిస్తే.. అంతగా వారి ప్రాణాలు నిలిచి ఉండే అవకాశాలు ఉంటాయి. అందుకే ఆ సమయాన్ని గోల్డెన్ అవర్స్ అని అంటారు. ఈ కీలక సమయంలో వైద్యం అందక ఎంతోమంది మరణిస్తుంటారు. దీనిని నివారించే లక్ష్యంతో, రూ.లక్ష ఉచిత వైద్యం పథకాన్ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది.



హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో కీలక సంస్కరణలకు నాంది పలకనున్నామని.. దాంట్లో భాగంగా, మూడు ప్రధాన విభాగాలపై మూడు టాస్క్‌ఫోర్స్‌లు వేయనున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలియజేశారు. మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. యాక్సిడెంట్ కేసుల్లో రూ.లక్ష ఉచిత వైద్యంపై కసరత్తు జరుగుతోందని, ఈ పథకం నిబంధనల ప్రకారం క్షతగ్రాతులను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్తే.. వారికి రూ.లక్ష వరకు ఉచితంగా వైద్యం అందించాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం విధివిధానాలు ఖరారు కావాల్సి ఉందని చెప్పారు. కాగా, కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల నియంత్రణకు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టును అమలు చేయనున్నామని, దీనికోసం ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు వచ్చే 15 రోజుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు మొదలవుతాయని చెప్పారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న నకిలీ ఔషధాల తయారీదార్ల ఆట కట్టించటానికి.. ఔషధాల నాణ్యత, విక్రయాలు తదితర అంశాలపై మరో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయదారుల సంఖ్య భారీగా పెరిగిందని, అయితే, ఆహార నాణ్యతపై భయాందోళనలు వ్యక్తం అవుతున్న దృష్ట్యా

మిగతా 13వ పేజీలో...

రోజుకు 191 కోట్లు!

అప్పుల అసలు, వడ్డీ కింద సర్కారు చెల్లిస్తున్న సొమ్ము ఇదీ..
ఈ నెల 17 వరకు తీసుకున్నది రూ.25,118 కోట్లు
అసలు, వడ్డీల కింద కట్టింది రూ.38,040 కోట్లు
గత ప్రభుత్వ రుణభారం ఈ సర్కార్‌పై



హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకునే అప్పుల కంటే.. పాత రుణాలకు చెల్లించాల్సిన అసలు, వడ్డీ సొమ్మే భారంగా పరిణమిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల తాలూకు అసలు, వడ్డీలను చెల్లించడానికి కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు పడుతోంది. ఆ రుణాలకు అసలు, వడ్డీ కింద రోజుకు రూ.191 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఇతర సంక్షేమ పథకాలకు నిధులు సర్దుబాటు చేయాలంటే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించక తప్పడం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికే రాష్ట్ర అప్పులు భారీగా పేరుకుపోయాయి. ఈ విషయాన్ని

మిగతా 13వ పేజీలో...



హైదరాబాద్ మల్లేపల్లిలోని ఐటీఐలో యంత్రాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

ఐటీఐ ఇక ఏటీసీ

అధునాతన సాంకేతిక కేంద్రాలుగా మార్పు

రూ.2,324 కోట్ల వ్యయంతో 65 శిక్షణ కేంద్రాలు అప్‌గ్రేడ్
టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో పదేళ్ల కాలానికి ఒప్పందం
ఐటీఐల్లో 50 ఏళ్లనాటి నైపుణ్యాలు.. వాటితో ఫలితం లేదు
విద్యార్థులు ఏటీసీల్లో చేరాలి.. ప్రతినెలా పర్యవేక్షిస్తా: రేవంత్
మల్లేపల్లి ఐటీఐలో ఏటీసీలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన
ఏటా 6 దీర్ఘకాలిక కోర్సుల్లో 15,860 మందికి..
23 స్వల్పకాలిక కోర్సుల్లో 31,200 మందికి శిక్షణ
పూర్తయిన అనంతరం టీటీఎల్‌లో ఉద్యోగావకాశాలు

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు (ఐటీఐ) నిరుపయోగంగా మారాయని.. 40, 50 ఏళ్ల నాటి నైపుణ్యాలనే అక్కడ ఇప్పటికీ నేర్పిస్తున్నారని, వాటితో విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా యువతను తీర్చిదిద్దేందుకు ఐటీఐలను 'అధునాతన సాంకేతిక కేంద్రాలు' (ఏటీసీ)గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. రూ.2324 కోట్లు వెచ్చించి టాటా సంస్థ

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టండి
పారిశ్రామిక అనుకూలతలను వినియోగించుకోండి
లాక్‌హీడ్ మార్టిన్ ఏరోనాటిక్స్ ఇండియా డైరెక్టర్‌తో సీఎం

21న మంత్రివర్గ భేటీ 13
'రుణ మాఫీ' విధివిధానాలపై చర్చ
అసెంబ్లీ సమావేశాల తేదీ ఖరారు

భద్రాద్రి గుదిబండ

పవర్ ప్లాంట్‌ను కాలం చెల్లిన టెక్నాలజీతో కట్టారు
రానున్న పాతికేళ్లలో ప్రజలపై 9 వేల కోట్ల భారం
యాదాద్రితో ఏటా రూ.1,600 కోట్ల రవాణా ఖర్చు
ఛత్తీస్‌గఢ్ విద్యుత్తుతో మొత్తం 3,385 కోట్ల నష్టం
జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు కె.రఘు నివేదన
కేసీఆర్ నిర్ణయాలతో రూ.81 వేల కోట్ల అప్పులు
క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలి: కోదండరాం



హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన టెక్నాలజీతో కట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్‌తో రానున్న 25 ఏళ్ల కాలంలో రూ.9 వేల కోట్ల దాకా భారం ప్రజలపై పడుతుందని తెలంగాణ విద్యుత్ రంగ నిపుణుడు కంచర్ల రఘు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రాలతో పోలిస్తే ప్లాంటు స్వీయ కరెంటు వినియోగం, హీట్‌రేట్, నిర్వహణ ఖర్చులు కలుపుకొని భద్రాద్రిలో ఏటా రూ.350 కోట్ల దాకా అదనపు భారం పడుతుందని చెప్పారు. ఇప్పటికే ఆయన విద్యుత్‌పై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు ఈ అంశంపై ఫిర్యాదు చేయగా, వాటిపై స్పష్టత కోసం కమిషన్ ఆయనకు కబురు పంపించింది. దాంతో మంగళవారం ఆయన బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో భేటీ అయ్యారు. విద్యుత్ రంగంలో

మిగతా 14వ పేజీలో...

వర్షాలు లేకపోవడంతో ఖమ్మం జిల్లా కొణిజర్లలో పత్తి మొక్కలకు స్ప్రింకర్లతో నీరు



వానమ్మా.. రావమ్మా!

వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపులు

రాష్ట్రంలో బలహీనంగా నైరుతి రుతుపవనాలు.. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితేనే వానలు

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 'ఇంకేముందీ.. ఈసారి నైరుతి రుతుపవనాలు మే 31 నాటికే కేరళ చేరుతాయి.. లానినా ప్రభావంతో వానలు ఎక్కువగా పడతాయి' ..అని ఊరించారు! కానీ.. సకాలంలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు బలంగా విస్తరించకుండా బలహీన పడడంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి! గడిచిన రెండు, మూడు వారాల్లో అడపాదడపా కురిసిన వానలతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతన్నలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు!! ఎండకు ఉక్కపోత కూడా తోడు కావడం తొలకరి పనులకు అవరోధంగా మారింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి ముసురు పడితే తప్ప పంటల సాగు ముందుకుపడే పరిస్థితిలేదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ప్రస్తుతానికి లోటు వర్షపాతమే నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెంలో 34 శాతం, భూపాలపల్లిలో 24%, జగిత్యాలలో 30%, కామారెడ్డి, కరీంనగర్‌లో 14% చొప్పున, ఖమ్మంలో 13%, ఆసిఫాబాద్‌లో 27%, మంచిర్యాలలో 76%, ములుగులో 34, నిజామాబాద్‌లో 30%, పెద్దపల్లిలో 51%, వరంగల్‌లో 20% లోటు వర్షపాతం నమోదైంది. దక్షిణ తెలంగాణలోని జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట జిల్లాల్లో

మిగతా 14వ పేజీలో...

నకిలీ బంగారంతో మాయ!

కస్టమ్స్ స్వాధీనం చేసుకున్న సరుకు తక్కువ ధరకేనంటూ మోసం
బుట్టలో వేసుకునేలా డెన్‌లో చుట్టూ నకిలీ కరెన్సీ కట్టలు, సరుకు
ఆ నోట్లిచ్చి కొనేవారు డమ్మీలే.. ఇదంతా నమ్మి అమాయకులు బలి
తర్వాత ముఠా వ్యక్తే పోలీసు దుస్తుల్లో వచ్చి దారికాచి తనిఖీ
నకిలీ బంగారం స్వాధీనం.. పోలీసులేనని బాధితుల మౌనం
ఓ ముఠా దందా.. నలుగురి అరెస్టు.. రూ. 51 లక్షల నగదు, 5 కిలోల నకిలీ బంగారం, 6.86 కోట్ల నకిలీ కరెన్సీ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ బంగారం బిస్కెట్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బంగారాన్ని తక్కువ ధరకే ఇస్తాం అంటే ఎవరు నమ్ముతారు? ఆ ముఠా మాత్రం ఇట్టే నమ్మిస్తుంది. తమ దగ్గర కస్టమ్స్ అధికారులు సీజ్ చేసిన బంగారం ఉందని.. అతి తక్కువ ధరకే ఇస్తామని మాయ చేస్తుంది. తొలుత తులాల్లో అసలు బంగారాన్ని తక్కువ ధరకే ఇచ్చి బుట్టలో వేసుకొని ఆ తర్వాత కిలోల్లో నకిలీ బంగారాన్ని అంటగట్టి రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటుంది! పైగా ఈ దగా అంతా పోలీసుల దాకా వెళ్లకుండా ఉండేందుకు 'పెద్ద డ్రామా'

మిగతా 13వ పేజీలో...

ఏపీ ఏజీగా దమ్మాలపాటి!

గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపిన సీఎస్
ఆయన ఆమోదించగానే ఉత్తర్వులు జారీ
2014-16 మధ్య ఏజీగా దమ్మాలపాటి
అనంతరం అడ్వొకేట్ జనరల్‌గా నియామకం



దమ్మాలపాటి శ్రీనివాస్ 12

ఇక అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి!

- ఏపీలో జగనన్న విదేశీ విద్యా దీవెన పేరు మార్పు
- చంద్రన్న పెళ్లి కానుకగా.. వైఎస్ఆర్ కల్యాణమస్తు
- జగనన్న విద్యా దీవెన.. 'పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్'
- వైఎస్సార్ విద్యోన్నతి పథకం.. ఎన్టీఆర్ విద్యోన్నతిగా
- ప్రక్షాళన మొదలుపెట్టిన చంద్రబాబు ప్రభుత్వం 12



పాన్ పరేషాన్

భారీ స్కామ్‌లా పాన్ కార్డుల దుర్వినియోగం
మరణించిన వారి పేరిట లావాదేవీలు
వృద్ధులు, రైతులు, కార్డు వాడని వారే టార్గెట్
ఐటీ నోటీసులతో బాధితుల లబోదిబో 2
దేశవ్యాప్తంగా పలుచోట్ల కేసులు నమోదు

తప్పు తాగి 17 మందిని తొక్కించేశాడు

- నాగపూర్‌లో కారుతో ఇంజనీరింగ్ విద్యార్థి నిర్వాకం
- రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు గిరిజనుల దుర్మరణం

నాగపూర్, జూన్ 18: తప్ప తాగి కారు నడుపుతూ.. రోడ్డు మీద వెళ్తున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను బలిగొన్న మైనర్ అరాచకం తరహాలోనే మరో ఘటన చోటుచేసుకుంది. నాటి ఉదంతం మహారాష్ట్రలోని పుణెలో జరగ్గా తాజా ప్రమాదం నాగపూర్‌లో చోటుచేసుకుంది. స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా భూషణ్ లనేవర్ అనే ఫైర్ ఇంజనీర్ ఆదివారం అర్ధ రాత్రి ఐదుగురితో కలిసి దాబాలో మందు పార్టీ చేసుకున్నాడు. తర్వాత వీరంతా కారులో బయటకు వచ్చారు. భూషణ్ వేగంగా నడుపుతూ దిఘోరీ టోల్‌ప్లాజా సమీపంలోని పాదబాటపై నిద్రిస్తున్న రాజస్థాన్ కూలీలపైకి పోనిచ్చాడు. తప్పించుకునే ప్రయత్నంలో కారును వెనక్కు, ముందుకు నడిపించాడు. దీంతో బగాడియా తెగకు చెందిన గిరిజన మహిళ కాంతీబాయి (42), మరో వ్యక్తి సీతారాం (30) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 15 మంది కూలీలు గాయపడ్డారు. వీరిలో తీవ్ర గాయాలైన ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. కారులో వాన్ష్ జాదె, సన్మయ్ పత్రీకర్, అథర్వ వనాయత్, అథర్వ మోగ్రే, హృషికేశ్ చౌబే ఉన్నారని, వీరంతా ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులని పోలీసులు తెలిపారు. జాదె పుట్టిన రోజు సందర్భంగా పార్టీ చేసుకుని జాయ్ రైడ్‌కు బయల్దేరారని చెప్పారు. అందరినీ అరెస్టు చేసి ఐపీసీ సెక్షన్ 304, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బుధవారం దాకా కోర్టు వీరిని పోలీస్ కస్టడీకి అప్పగించింది. నిందితుల రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు.

కార్యకర్తతో కాళ్లు కడిగించుకున్న కాంగ్రెస్ నేత



ముంబై, జూన్ 18: మహారాష్ట్ర పి.సి.సి. అధ్యక్షుడు నానా పటోలే వివాదంలో చిక్కుకున్నారు. సోమవారం ఆయన సంత్ గజానన్ మహారాజ్ పల్లకి దర్శనానికి అకోలా జిల్లాకు వెళ్లారు. వర్షం కారణంగా అక్కడ బురద ఉండడంతో అందులోనే నడిచి వెళ్లారు. తిరిగి వెళ్లే సమయంలో కారు వద్ద ఓ కాంగ్రెస్ కార్యకర్త ఆయన కాళ్లను కడిగారు. ఈ వీడియో వైరల్ అయింది. దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందిస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రజలు, కార్యకర్తలను బానిసల్లా చూస్తున్నారని విమర్శించారు. ఇందుకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. నానా పటోలే వివరణ ఇస్తూ సమీపంలో కొళాయి లేనందునే కార్యకర్త చెంబుతో నీళ్లు తీసుకొచ్చాడని చెప్పారు. ఆయన నీళ్లు పోస్తే తాను బురద కడుగుకొన్నానని తెలిపారు.

41 విమానాశ్రయాలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ, జూన్ 18: దేశంలోని 41 ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ రావడం కలకలం రేపింది. న్యూఢిల్లీ, చెన్నై, పాట్నా, కోయంబత్తూరు, జైపూర్ తదితర విమానాశ్రయాలకు మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ-మెయిల్స్ ద్వారా సమాచారం రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. బాంబు స్క్వాడ్ బృందాలు ఆయా ఎయిర్‌పోర్టులను అణువణువూ తనిఖీ చేశాయి. చెన్నై ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో అధికారులు సోదాలు చేశారు. దీంతో పలు విమానాశ్రయాల్లో విమానాలు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. అయితే, సోదాల్లో ఎక్కడా అనుమానాస్పద వస్తువులు లభించలేదు. కాగా, ముంబైలోని దాదాపు యాభై ఆస్పత్రులకు కూడా మంగళవారం బాంబు బెదిరింపులు వచ్చాయి.

పురుషత్వ పరీక్షలతో సిగ్గుగా ఉంది: ప్రజ్వల్

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికే రెండు కేసుల్లో పురుషత్వ పరీక్షలు నిర్వహించారు. మరోసారి అటువంటి పరీక్షలే చేయిస్తామని అంటున్నారు. చాలా సిగ్గుగా ఉంది' అని లైంగిక దాడుల కేసులో నిందితుడు, జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ తన సమస్యను న్యాయాధికారి దృష్టికి మంగళవారం తీసుకెళ్లారు. దీంతో అవసరమైన వైద్య పరీక్షలు మాత్రమే చేయించాలని పోలీసులను న్యాయాధికారి ఆదేశించారు. కాగా.. ప్రజ్వల్ రేవణ్ణపై మూడు కేసులు ఉన్నాయి. రెండింటికి సంబంధించి సిట్ విచారణలు ముగిశాయి. వాటికి అనుగుణంగా పురుషత్వ పరీక్షలు జరిపించారు. మూడోసారి సిట్ ప్రజ్వల్‌ను కస్టడీకి తీసుకుంది. మళ్లీ మెడికల్ టెస్టుకు సిద్ధం కావడంతో ప్రజ్వల్ న్యాయాధికారి ఎదుట తన సమస్యను చెప్పుకొన్నారు. 14 రోజుల కస్టడీ ముగియడంతో ప్రజ్వల్‌ను సిట్ అధికారులు మంగళవారం కోర్టు ఎదుట హాజరు పరిచారు. దీంతో మరో 14 రోజులు జ్యుడీషియల్ కస్టడీకి ఇస్తూ 42వ ఏసీఎంఎం ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయాధికారి కేఎన్ శివకుమార్ ఆదేశాలు జారీ చేశారు.

దర్శన్ ఫాం హౌస్‌లో మేనేజర్ ఆత్మహత్య

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రేణుకాస్వామి హత్య కేసు నిందితుడు, నటుడు దర్శన్ మరో వివాదంలో చిక్కుకున్నారు. బెంగళూరులోని దర్శన్ ఫాం హౌస్‌లో ఆయన మేనేజర్ శ్రీధర్ (35) ఆత్మహత్య చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు నెలలుగా అతను కనిపించడం లేదని ప్రచారం జరిగింది. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 17న పురుగుల మందు తాగి శ్రీధర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని భావిస్తున్నారు.

రైలు ప్రమాదంలో 10కి పెరిగిన మృతులు

న్యూఢిల్లీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి పెరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆరేళ్ల పాప మంగళవారం చనిపోయింది. మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైల్వే వ్యవస్థను విధ్వంసం చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లో రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అశ్వినీ వైష్ణవ్ మీడియా దృష్టిని ఆకర్షించేందుకే ప్రమాద స్థలానికి బైక్ మీద వెళ్లారంటూ ఖర్గే విమర్శలు గుప్పించారు. "అశ్వినీ వైష్ణవ్ రైల్వే మినిస్టరా.. లేకపోతే రీల్స్ మినిస్టరా" అంటూ ఎద్దేవా చేశారు. తాజా ఘటనకు బాధ్యులెవరో ప్రధాని మోదీనే చెప్పాలని నిలదీశారు.

అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారికి ఊరట

వాషింగ్టన్, జూన్ 18: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న విదేశీయులకు బైడెన్ సర్కారు శుభవార్త చెప్పింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ వలస నిబంధనల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా పౌరసత్వం లేని, ఎలాంటి పత్రాలు లేకుండా ఉన్న జీవిత భాగస్వాములు, పిల్లలకు ఆ దేశ పౌరసత్వం కల్పించేందుకు మార్గం సుగమం చేసింది. ఈ నిర్ణయంతో దాదాపు 5 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరిలో భారతీయ అమెరికన్ల సంఖ్య గణనీయంగా ఉండడం గమనార్హం. కొత్త విధానంతో అమెరికా పౌరసత్వం లేని జీవిత భాగస్వాములు, పిల్లలు శాశ్వత నివాస(పీఆర్) హోదా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని శ్వేతసౌధం తెలిపింది. కొత్త విధానం ప్రకారం జూన్ 17, 2024 నాటికి అమెరికాలో పదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలంగా నివసిస్తున్నవారు, చట్టబద్ధంగా అమెరికా పౌరులను పెళ్లాడిన వారు పీఆర్ దరఖాస్తుకు అర్హులు.

బిహార్‌లో ప్రారంభానికి ముందే కూలిన వంతెన

పట్నా, జూన్ 18: బిహార్‌లో ఓ భారీ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలింది. బాక్రా నది మీద నిర్మాణంలో ఉన్న వంతెనలో ఓ భాగం మంగళవారం కూలిపోయింది. ఆరారియా జిల్లాలోని కుర్సకంట-సిక్తి ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రూ.12 కోట్ల నిధులు వెచ్చించి ఈ వంతెనను నిర్మిస్తున్నారు. నిర్మాణం దాదాపుగా పూర్తయిన దశలో వంతెన కూలిపోవడంతో ఈ నిధులన్నీ బూడిదలో పోసినట్లయింది.



తప్పు జరిగితే ఒప్పుకోండి

(మొదటి పేజీ తరువాయి)



విచారణకు స్వీకరించింది. అయితే.. నీట్‌పై గతంలో దాఖలైన పిటిషన్లతో కలిపి దీన్ని కూడా జూలై 8నే విచారిస్తామని వెల్లడించింది. "వ్యవస్థను మోసం చేయడం ద్వారా ఒక వ్యక్తి డాక్టర్ అయితే ఎలా ఉంటుందో ఊహించండి. ఆ వ్యక్తి సమాజానికి మరింత హానికరం. పరీక్ష నిర్వహించే బాధ్యత కలిగిన ఏజెన్సీ నమ్మకంగా, న్యాయంగా వ్యవహరించాలి" అని జస్టిస్ భట్టి వ్యాఖ్యానించారు. నీట్ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులు పడే కష్టం అందరికీ తెలిసిందేనని ఆయన గుర్తుచేశారు. "పరీక్షలు నిర్వహించే వ్యవస్థకు ప్రతినిధిగా మీరు దృఢమైన వైఖరి తీసుకోవాలి. ఏదైనా తప్పు జరిగి ఉంటే.. 'అవును, ఈ తప్పు జరిగింది. దీనిపై మేం ఈ చర్య తీసుకోబోతున్నాం' అని చెప్పాలి. కనీసం అప్పుడైనా మీ పనితీరుపై విశ్వాసం కలుగుతుంది. ఎంతో పోటీ నెలకొని ఉన్న ఈ పరీక్షల కోసం విద్యార్థులు ఎంత శ్రమ పడతారో మనందరికీ తెలుసు" అని ఎన్‌టీఏ తరఫు న్యాయవాదిని ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. నుంచి దీనిపై సకాలంలో చర్యలు ఆశిస్తున్నామని పేర్కొంటూ.. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లో స్పందన తెలపాల్సిందిగా ఏన్‌టీఏకి, కేంద్రానికి ఆదేశాలు జారీచేసింది.

లీకేజీలకు అడ్డాలుగా బీజేపీ పాలిత రాష్ట్రాలు

నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో 24 లక్షల మంది నీట్ విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారినప్పటికీ ప్రధాని మోదీ ఎప్పటిలాగే మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బిహార్, హరియాణా, గుజరాత్‌లో జరిగిన అరెస్టులు.. నీట్ పరీక్షలో వ్యవస్థీకృత అవినీతి జరిగిందనే విషయాన్ని రుజువు చేస్తున్నాయని 'ఎక్స్' వేదికగా ఆయన ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు పేపర్ లీకేజీలకు కేంద్ర బిందువుగా మారాయని మండిపడ్డారు. పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా కఠిన విధానాలను రూపొందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి తమ పార్టీ కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. బాధ్యతాయుత ప్రతిపక్షంగా వీధుల నుంచి పార్లమెంటు వరకూ యువత గళాన్ని వినిపిస్తామన్నారు. పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన చట్టాలను రూపొందించి యువత భవిష్యత్తుకు భరోసా ఇస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చామని రాహుల్ గుర్తుచేశారు. నీట్ అక్రమాలు, పేపర్ లీకేజీ వ్యవహారం దేశంలో ప్రవేశ పరీక్షల వ్యవస్థనే దెబ్బతీశాయని కేరళ సీఎం విజయన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అవకతవకలపై కేంద్రంగానీ, ఎన్‌టీఏగానీ సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేకపోయాయన్నారు.



నీట్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆప్ నేతలు సంజయ్ సింగ్, గోపాల్ రాయ్ తదితరుల నిరసన ప్రదర్శన

ఎన్‌టీఏలో సంస్కరణలు!

సూచనలకు ఉన్నత స్థాయి కమిటీ

కేంద్ర ఉన్నతాధికారి ఒకరు వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 18: నీట్ పరీక్ష వివాదాల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లో కీలక సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎన్‌టీఏ కార్యకలాపాలు, పరీక్షల నిర్వహణలో విస్తృత మార్పులను పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్పులను సూచించేందుకు ఉన్నతస్థాయి కమిటీని వేసే అవకాశం ఉంది. ఈ నెల 4న వెలువడిన నీట్ ఫలితాలు దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నాయి. కోర్టుల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. విద్యార్థులు మూడు అంశాలను ప్రధానంగా లేవనెత్తుతున్నారు. 1) కొంతమంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడం, 2) కొన్నిచోట్ల పరీక్ష పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు, 3) కొన్ని పరీక్ష కేంద్రాల్లో నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు. మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరపాలని, పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఎక్కువ మంది కోరుతున్నారు. నీట్ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువైతే బాధ్యులకు అత్యంత కఠినమైన శిక్ష పడేట్లు చూస్తామని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గత ఆదివారం హామీ ఇచ్చారు. ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ, "ప్రస్తుతం వ్యవహారం కోర్టుల్లో ఉంది. విద్యాశాఖ, ఎన్‌టీఏ సమస్య వివరాలను పరిశీలిస్తున్నాయి. దర్యాప్తు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రస్తుత సమస్య పరిష్కారం అవుతుంది. అది పూర్తవగానే నీట్ పరీక్షలకు సంబంధించి కీలక సంస్కరణలు జరుగుతాయి" అన్నారు. ఇందుకోసం విద్యాశాఖ కమిటీని వేయనుందని చెప్పారు. 2023 నవంబరులో ఎన్‌టీఏలో వివిధ పరీక్షలు రాయడానికి 1.23 కోట్ల మంది నమోదు చేసుకున్నారు. చైనాలోని గావ్‌కావ్ పరీక్ష తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద పోటీ పరీక్ష వ్యవస్థ ఎన్‌టీఏ. గత ఏడాది నవంబరులో నీట్ యూజీ పరీక్ష రాయడానికి 24 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ఎన్‌టీఏ కింద జేఈఈ(14.7 లక్షల మంది), క్యూట్ యూజీ(13.4 లక్షల మంది) నమోదు చేసుకున్నారు. ఇవి కాకుండా అనేక ఇతర పోటీ పరీక్షలు ఎన్‌టీఏ కిందకు వస్తాయి.

రూ. 20వేల కోట్లు

పీఎం కిసాన్ నిధుల విడుదల

వారణాసి, జూన్ 18: రైతులకు వ్యవసాయంలో పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' 17వ విడత నిధులను ప్రధాని మోదీ మంగళవారం విడుదల చేశారు. యూపీలోని తన సొంత నియోజకవర్గమైన వారణాసిలో నిర్వహించిన 'పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన ఈ నిధులను విడుదల చేశారు. దీంతో సుమారు 9.26 కోట్ల రైతుల ఖాతాల్లో రూ. 2వేల చొప్పున రూ.20వేల కోట్లు జమకానున్నాయి. మోదీ ఈ నెల 10వ తేదీన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పీఎం కిసాన్ 17వ వాయిదా చెల్లింపు దస్త్రంపైనే తొలి సంతకం చేశారు. కాగా, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారణాసిలో పర్యటించడం మోదీకి ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంగా మాత తనను దత్తత తీసుకుందని, తాను వారణాసి వాసుల్లో ఒకడినయ్యానని అన్నారు. కాశీ విశ్వనాథుని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, ప్రతి నెల ఆఖరి ఆదివారం రేడియోలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' జూన్ 30 నుంచి తిరిగి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఎన్నికల కారణంగా నిలిచిపోయిన మన్ కీ బాత్ ఈ నెల నుంచి పునఃప్రారంభమవుతుందని, విలువైన సలహాలు, సూచనలు అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు, జూన్ 21న కశ్మీర్‌లోని షేర్-ఈ-కశ్మీర్ అంతర్జాతీయ సమావేశ కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాలను నిర్వహించనున్నారు.

మోదీ రెండు చోట్ల పోటీ చెయ్యలేదా?

వయనాడ్ ఉపఎన్నికపై బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ కౌంటర్

తిరువనంతపురం, జూన్ 18: వయనాడ్ లోక్‌సభ స్థానం ఉపఎన్నికలో ప్రియాంక గాంధీ పోటీ చేయనుండడం తీవ్ర రాజకీయ దుమారం రేపింది. వయనాడ్ ప్రజలను మోసగించిన కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలకు ఇదే నిదర్శనమంటూ బీజేపీ తీవ్ర విమర్శలు చేస్తోంటే.. 2014లో నరేంద్ర మోదీ ఏం చేశారో మరచిపోయారా? అంటూ కాంగ్రెస్ కౌంటరిచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో రాయబరేలీ, వయనాడ్ స్థానాల్లో పోటీ చేసి గెలిచిన రాహుల్ గాంధీ వయనాడ్ స్థానాన్ని వదులుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం వయనాడ్ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ పోటీ చేస్తారని కాంగ్రెస్ ప్రకటించింది. దీనిపై బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ.. వయనాడ్ ప్రజలను మోసగించిన కాంగ్రెస్ పార్టీ సిగ్గులేకుండా వారసత్వ రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఇక, వయనాడ్ స్థానాన్ని ప్రియాంకకు కేటాయించిన కాంగ్రెస్ పార్టీ పాలక్కడ్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రాను బరిలోకి దించాలని కేరళ బీజేపీ అధ్యక్షుడు కే సురేంద్రన్, సీనియర్ నేత వీ మురళీధరన్ ఎద్దేవా చేశారు. ఉపఎన్నికలో ప్రియాంక గాంధీని ఓడించడం ద్వారా వయనాడ్ ప్రజలు కాంగ్రెస్, రాహుల్ గాంధీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మరోపక్క, బీజేపీ నేతలు వయనాడ్ అంశంలో రాహుల్ గాంధీని విమర్శించే ముందు 2014లో నరేంద్ర మోదీ ఏం చేశారో మరచిపోవద్దని కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, వీడీ సతీశన్ బదులిచ్చారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో వడోదర, వారణసీ రెండు స్థానాల్లో గెలిచిన మోదీ వడోదర స్థానాన్ని వదులుకున్నారని గుర్తు చేశారు. కాగా, మహిళా ఎంపీల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో వయనాడ్ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నానని సీపీఐ సీనియర్ నాయకురాలు అన్నె రాజా పేర్కొన్నారు. లోకసభ ఎన్నికలో వయనాడ్ నుంచి పోటీ చేసిన అన్నె రాజా.. రాహుల్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఉపఎన్నికలో తన అభ్యర్థిత్వంపై తమ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. వయనాడ్ ఉపఎన్నిక బరిలో సీపీఐ అభ్యర్థి ఉంటారని ఆ పార్టీ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం అన్నారు.

వయనాడ్‌కు రాహుల్ రాజీనామా

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయగా స్పీకర్ ఆమోదించారు. ఉత్తర ప్రదేశ్‌లోని రాయబరేలీ లోక్‌సభ సభ్యునిగా రాహుల్ కొనసాగనున్నారు. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఎప్పుడైనా కూలొచ్చు!

- చాలా బలహీనంగా ఎన్డీఏ సర్కారు
- కూటమి నుంచి ఒక్క పార్టీ బయటకు వచ్చినా గందరగోళం మొదలవుతుంది
- మాతో ఎన్డీఏ నేతల సంప్రదింపులు
- బ్రిటన్ పత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్'కు రాహుల్‌గాంధీ ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ, జూన్ 18: కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చాలా బలహీనంగా ఉందని, చిన్నపాటి సమస్య తలెత్తినా పడిపోతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పారు. కూటమి నుంచి ఏ ఒక్క పార్టీ బయటకొచ్చినా గందరగోళం మొదలవుతుందన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందని, కొన్ని పార్టీల నేతలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. అయితే, వారు ఎవరనేది ఆయన వెల్లడించలేదు. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ పత్రిక 'ఫైనాన్షియల్ టైమ్స్'కు రాహుల్‌గాంధీ ఇంటర్వ్యూ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత్‌లో చోటుచేసుకున్న మార్పుల గురించి ఆయన ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ అనే భావన, మోదీ ఇమేజ్ పూర్తిగా ధ్వంసమయ్యాయని.. భారత రాజకీయాల్లో భూకంపం సంభవించిందని రాహుల్ వ్యాఖ్యానించారు. 2014, 2019ల్లో నరేంద్రమోదీ పట్టిందల్లా బంగారమయ్యిందని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని.. కాబట్టే, అధికార కూటమికి ఇబ్బందులు తప్పవని చెప్పారు. 'ద్వేషాన్ని, ఆగ్రహాన్ని వ్యాప్తి చేసి దాన్నించి లాభపడదామనుకునే (బీజేపీ) భావజాలాన్ని ఈ ఎన్నికల్లో భారతీయ ఓటర్లు తిరస్కరించారు. బీజేపీ తీవ్రంగా దెబ్బతిన్నది. మూసుకుపోయిన భారతీయ రాజకీయ వ్యవస్థను ఓటర్లు తెరిచారు' అని పేర్కొన్నారు.

తీవ్ర ఇబ్బందుల మధ్య పోరాడాం!

మోదీ హయాంలో ప్రతిపక్షాలు తీవ్ర సమస్యలను ఎదుర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'న్యాయవ్యవస్థ, మీడియా, ప్రభుత్వ యంత్రాంగం, అధికారిక సంస్థలు.. అన్నీ మాకు తలుపులు మూసేశాయి. దీంతో మాకు ప్రజల వద్దకు వెళ్లటం మినహా మరో దారి లేకుండా పోయింది' అని చెప్పారు. దీంట్లో భాగంగానే తాను స్వయంగా భారత్ జోడోయాత్ర, భారత్ జోడో న్యాయ్‌యాత్రలను చేపట్టానన్నారు. 'మా చేతులు వెనక్కి కట్టేశారు. అయినా మేం పోరాడాం' అని రాహుల్ పేర్కొన్నారు. అయోధ్య గురించి మాట్లాడుతూ పదేళ్లు గడిపిన పార్టీని (బీజేపీని) అయోధ్యలోనే ఓటర్లు తుడిచిపెట్టారని గుర్తు చేశారు. బీజేపీకి పునాదిలా తయారైన.. మత విద్వేషాన్ని నిర్మించటం అనే మూలసిద్ధాంతం ఈ ఎన్నికల్లో కుప్పకూలిందన్నారు. ఎన్నికలు నిష్పక్షపాత పరిస్థితుల్లో జరిగి ఉంటే ఇండియా కూటమి లోక్‌సభలో మెజారిటీ సాధించి ఉండేదని, దాంట్లో ఎలాంటి సందేహం లేదని చెప్పారు. కీలకమైన ఎన్నికల వేళ ఇండియా కూటమికి చెందిన ఇద్దరు నేతలను (అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరేన్) జైలుకు పంపటం, తమ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయటం వంటి అంశాలను రాహుల్ ప్రస్తావించారు.

'పాన్' పరేషాన్!

భారీ స్కామ్‌లా పాన్ కార్డుల దుర్వినియోగం

- వృద్ధులు, రైతులు, కార్డు వాడని వారే టార్గెట్
- ఐటీ నోటీసులు.. తల పట్టుకుంటున్న బాధితులు



న్యూఢిల్లీ, జూన్ 18: మరణించిన వారు, నిరక్షరాస్యులు, వృద్ధులు, రైతులు, తరచూ పాన్ కార్డు వినియోగించని వ్యక్తుల పాన్ నంబర్లు దుర్వినియోగానికి గురవుతున్నాయని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' తాజాగా ఒక కథనంలో వెల్లడించింది. ఐటీ శాఖ వారికి నోటీసులు పంపిన తర్వాతే ఇలాంటివి వెలుగులోకి వస్తున్నాయని తెలిపింది. దీనికి సంబంధించి ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక కేసులు నమోదయ్యాయని అందులో పేర్కొంది. ముంబైకి చెందిన ఒక వృద్ధురాలు.. తన పాన్‌కార్డును దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో ఆదాయ పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటీఏటీ)లో కేసు ఎదుర్కోవాల్సి వచ్చింది. 2010-11లో ఆమె రూ.1.3 కోట్ల విలువైన ఆస్తిని తన ఆదాయంగా భావించి విక్రయించినట్టు ఐటీ అధికారులు ఐటీఏటీకి నివేదించారు. గతంలో ఎన్నిసార్లు నోటీసులు పంపినా ఆమె స్పందించలేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన విచారణ సందర్భంగా.. ఆ వృద్ధురాలికి అవగాహన లేకపోవడం, కేన్సర్ రోగి కావడంతో గతంలో ఐటీశాఖ నోటీసులకు స్పందించలేదని ఆమె తరఫున సీనియర్ న్యాయవాది ట్రిబ్యునల్‌కు తెలిపారు. ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలో ఆమె పాన్ కార్డును ఎవరో దుర్వినియోగం చేశారని వాదనలు వినిపించారు. ఇదొక్కటే కాదు.. దేశవ్యాప్తంగా ఈ తరహా కేసులు చాలా వెలుగుచూస్తున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన ఉషా సోనీ అనే వ్యక్తికి ఆమె మరణించిన పదేళ్ల తర్వాత రూ.7.5 కోట్లకు సంబంధించిన ఐటీ నోటీసులు అందాయి. అదేవిధంగా రాజస్థాన్‌కు చెందిన నందన్ లాల్ అనే చిరు వ్యాపారికి రూ.12.2 కోట్లకు ఐటీ నోటీసులు రావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'పాన్ విషయంలో అత్యంత గోప్యత పాటించాల్సి ఉన్నా ప్రజలు వివిధ అవసరాల కోసం ఆ వివరాలను యథేచ్ఛగా పంచుకుంటున్నారు' అని చార్టర్డ్ అకౌంటెంట్ చేతన్ వజానీ అన్నారు. సీబీడీటీ కూడా దీనిపై స్పందించింది. వ్యక్తులు తమ పాన్ వివరాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరి కాని చోట, పబ్లిక్ డొమైన్‌లలో పంచుకోకూడదని సూచించింది. ఎవరికైనా తమ పాన్ కార్డు దుర్వినియోగమైనట్టు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. కాగా, వివిధ ఏజెన్సీలు దాఖలు చేసిన సమాచారంపై పూర్తిగా ఆధారపడుతున్న ఐటీ శాఖ.. పన్ను చెల్లింపుదారులపై చర్యలు తీసుకోవడం తీవ్రమైన అంశమని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసినప్పుడల్లా ఆ సమాచారం ఐటీ శాఖకు వెళ్లేలా ఏర్పాటు ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

లోకం తీరు



ఆదాయ పన్ను మినహాయింపు రూ. 5లక్షలకు పెంపు!

నూతన పన్ను విధానంలో ఉన్నవారికే

బడ్జెట్‌పై కొనసాగుతున్న కసరత్తు

న్యూఢిల్లీ, జూన్ 18: కేంద్ర ప్రభుత్వం వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న 2024-25 బడ్జెట్‌లోనూ వేతన జీవులకు ఊరట లభించే అవకాశం లేదా? పాత పన్ను విధానంలో ఉన్నవారిని పక్కనపెట్టి నూతన పన్ను విధానం(న్యూ ట్యాక్స్ రెజీమ్)లో ఉన్న వారికే ప్రభుత్వం రాయితీలు ఇవ్వనుందా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. ఐటీ మినహాయింపు పరిమితిని ప్రభుత్వం రూ.3లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. అయితే, ఈ పెంపు కేవలం నూతన ఆదాయపు పన్ను విధానం(న్యూ ట్యాక్స్ రెజీమ్)లో ఉన్నవారికి మాత్రమే వర్తింపు చేయనున్నారని పేర్కొన్నారు. మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచి జీడీపీ వృద్ధికి తోడ్పడేందుకు, నూతన ఆదాయపు పన్ను విధానం వైపు ప్రజలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఈ ఆలోచన చేస్తోందని వివరించారు. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి కొద్ది రోజుల ముందు ప్రభుత్వం ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కాగా, నూతన పన్ను విధానంలో రూ.15 లక్షలకు పైబడి వార్షిక ఆదాయం కలిగిన వారి నుంచి అత్యధికంగా 30% ఆదాయపు పన్ను వసూలు చేస్తున్నారు. దీన్ని 25 శాతానికి తగ్గించాలనే విజ్ఞప్తులను ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవడం లేదని మరో అధికారి వెల్లడించారు. అలాగే, పాత విధానంలో రూ.10 లక్షలకు పైబడి వార్షిక ఆదాయం కలిగిన వారి నుంచి ప్రస్తుతం 30% ఆదాయపు పన్ను వసూలు చేస్తున్నారు. ఈ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలనే వినతులను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిపారు.

పెళ్లి కోసం నిందితుడికి బెయిల్!

- గతేడాది మైనర్‌పై లైంగిక దాడి.. శిశువుకు జన్మనిచ్చిన బాధితురాలు
- ఇద్దరి వివాహానికి అంగీకరించిన పెద్దలు.. బెయిల్ ఇచ్చిన హైకోర్టు

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువకుడు లైంగిక దాడి చేయడంతో ఓ బాలిక గర్భం దాల్చింది. శిశువుకు జన్మనిచ్చింది. చిన్నారి భవిష్యత్ కోసం వారిద్దరూ పెళ్లి చేసుకోవాలని భావించారు. ఈ మేరకు హైకోర్టును ఆశ్రయించగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితుడికి 16 రోజుల బెయిల్ మంజూరు చేస్తూ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. 2023లో మైనర్‌పై లైంగిక దాడి జరగ్గా ఆమెకు శిశువు జన్మించింది. శిశువుతోపాటు బాధితురాలికి రక్షణ కల్పించేందుకు హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. జూలై 3వ తేదీ వరకు నిందితుడికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది ఈలోగా వివాహ రిజిస్ట్రేషన్ పత్రాన్ని కోర్టుకు సమర్పించాలని, వారానికోసారి సమీప పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని ధర్మాసనం ఆదేశించింది. 23 ఏళ్ల యువకుడు, బాలిక ప్రేమించుకున్నారు. 2023లో ఆమెను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అతడ్ని అరెస్టు చేశారు. ఇటీవల కేసు కొట్టేయాలని నిందితుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. బాలిక తరఫు న్యాయవాది కోర్టుకు హాజరై నిందితుడు, బాలిక పరస్పరం ప్రేమించుకున్నారని, వారి మధ్య తల్లిదండ్రులు జోక్యం చేసుకున్నారని తెలిపారు. ఆమె శిశువుకు జన్మనిచ్చిందని, బాధితురాలికి 18 ఏళ్లు నిండినందున వారిద్దరూ వివాహం చేసుకోదలిచారని వివరించారు. ప్రస్తుతం ఇరువురి తల్లిదండ్రులూ వివాహానికి అంగికరించారని కోర్టుకు తెలిపారు. చిన్నారితో పాటు బాధిత యువతికి న్యాయం చేయడంలో భాగంగా రాజీ ద్వారా కేసు రద్దు చేయాలని కోరారు. మరోవైపు ధర్మాసనం చిన్నారికి డీఎన్‌ఏ పరీక్షలు జరిపించగా, వారిద్దరూ తల్లిదండ్రులు అని నిర్ధారణ అయింది. భవిష్యత్తులో ఆ చిన్నారి ఎటువంటి అవమానాలు ఎదుర్కోకుండా ఉండాలనే పెళ్లికి బెయిల్ మంజూరు చేస్తున్నామని న్యాయమూర్తి తెలిపారు. దీంతో పెళ్లికి రెండు కుటుంబాలు సిద్ధమయ్యాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన పోలీస్ అధికారులు అక్రమంగా పొందిన పదోన్నతులను రద్దు చేయాలని డీజీపీ రవిగుప్తాను న్యాయవాదులు కోరారు. ఈ మేరకు సీనియర్ న్యాయవాది మోహన్‌తో పాటు మరికొందరు డీజీపీ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. రాధాకిషన్ రావు, భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావు అక్రమ ఆస్తులపై విచారణ జరిపించి, వాటిని స్వాధీనం చేసుకోవాలని డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో న్యాయవాదులు పేర్కొన్నారు. - హైదరాబాద్

'నీట్'ను మళ్లీ నిర్వహించాలి

హైదరాబాద్ సిటీ/బేగంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)లో అవకతవకలపై విద్యార్థి, యువజన సంఘాలు గళమెత్తాయి. నీట్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని నినదించాయి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 'స్టూడెంట్ మార్చ్' పేరిట హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించాయి. దాదాపు పది వేల మందికి పైగా ర్యాలీలో పాల్గొనడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ర్యాలీ ముందుకు సాగింది. నారాయణగూడ నుంచి ప్రారంభమైన ర్యాలీ లిబర్టీ మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ నీట్ నిర్వహణలో మోదీ ప్రభుత్వం విఫలమైందని, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోందని విమర్శించారు. ఎన్నికల ఫలితాలకు పది రోజుల ముందే నీట్ ఫలితాలను ప్రకటించాల్సి ఉండగా ఒక రోజు ముందు విడుదల చేయడం వెనుక భారీ కుట్ర ఉందన్నారు. ఫలితాలను ఆలస్యం చేసి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. నీట్‌ను రద్దు చేసి, మళ్లీ నిర్వహించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. అవకతవకలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి స్పందించాలని, వారు విద్యార్థుల పక్షాన నిలబడకుంటే రాష్ట్రంలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) నీట్‌ను దుర్మార్గంగా నిర్వహించిందని విమర్శించారు. ఒకటో ర్యాంకు 67 మందికి ఏ విధంగా వస్తుందని ప్రశ్నించారు. నీట్ రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయడమే కాకుండా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు విమర్శించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు ప్రధాని మోదీ బాధ్యత వహించాలని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నీట్ నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ నాయకుడు ఆజాద్ కోరారు. ప్రతిభావంతమైన విద్యార్థులకు అన్యాయం చేశారని, పేపర్ లీక్‌పై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయించాలని వీజేఎస్ నాయకుడు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, వీజేఎస్, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వైజేఎస్ సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు.



నీట్ రద్దుచేయాలని ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

రాజ్‌భవన్ ముట్టడికి బీఆర్ఎస్‌వీ యత్నం

నీట్‌ను రద్దు చేయాలంటూ మంగళవారం బీఆర్ఎస్‌వీ రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. విద్యార్థులు పెద్దఎత్తున రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నీట్‌లో అవకతవకలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

ఈడీ ఎందుకు కేసు పెట్టలేదు?: మాజీ ఎంపీ వినోద్

రూ.కోట్లు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్న నీట్ ప్రశ్నపత్రం లీక్ కేసులో ఈడీ ఎందుకు కేసు నమోదు చేయడం లేదని మాజీ ఎంపీ వినోద్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. బిహార్, గుజరాత్ నుంచి నీట్ పేపర్ లీక్ అయినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. నీట్ వల్ల తెలంగాణ విద్యార్థులకు లాభమా, నష్టమా అనే అంశంపై ప్రభుత్వం నిపుణుల కమిటీ వేయాలని సూచించారు. రాష్ట్రాలవారీగా నీట్ నిర్వహించాలని తమిళనాడులో విద్యార్థులు ధర్నాలు చేస్తున్నారని, తెలంగాణలోనూ అలాగే ముందుకెళదామన్నారు.

కేంద్రమంత్రి హోదాలో తొలిసారి రాష్ట్రానికి సంజయ్

- నేటి నుంచి మూడు రోజుల పర్యటన

హైదరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అయ్యాక బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తొలిసారిగా రాష్ట్రంలో పర్యటించనున్నారు. మూడు రోజుల పర్యటన సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సంజయ్ మంగళవారం రాత్రి హైదరాబాద్ చేరుకుని బుధవారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ వెళతారు. మధ్యాహ్నం 12 గంటలకు మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శిస్తారు. అనంతరం కొండగట్టు వెళతారు. తర్వాత ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటారు. సాయంత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామిని అనంతరం సిరిసిల్లలోని మార్కండేయ దేవాలయాన్ని దర్శించుకుంటారు. రాత్రికి కరీంనగర్‌లో బస చేస్తారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి తన ఎంపీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. అనంతరం బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి భారీ ర్యాలీగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళతారు.




బీరు బాటిల్‌తో విధులకు..

- మానుకోట రవాణాశాఖ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నిర్వాకం

మహబూబాబాద్ టౌన్, జూన్ 18: బీరు బాటిల్‌ను పక్కన పెట్టుకుని ప్రభుత్వ కార్యాలయంలో ఓ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్న ఓ ఫొటో మూడు రోజులుగా మహబూబాబాద్ జిల్లాలో వైరల్ అవుతోంది. ఇంతకీ ఎవరా ఉద్యోగి..? ఏమిటా కార్యాలయం అని ఆరాతీస్తే..! అది మహబూబాబాద్ జిల్లా రవాణాశాఖ కార్యాలయమని, ఆ ఫొటోలో ఉన్నది అక్కడ ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసే డేటాబేస్ అసిస్టెంట్ (డీబీఏ) సురేశ్ అని, అతను ఖమ్మం జిల్లా వాసి అని తేలింది. దీంతో సదరు ఉద్యోగిని రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయానికి సరెండర్ చేస్తూ జిల్లా రవాణాశాఖ అధికారి ఎండీ గౌస్‌పాష మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. అయితే మూడురోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయాన్ని విలేకరులు రవాణాశాఖ అధికారి వద్ద ప్రస్తావించడంతో ఆయన వివరాలు వెల్లడించారు. మూడు రోజుల క్రితం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేశ్ చేసిన నిర్వాకం తన దృష్టికి వచ్చిందని, వెంటనే చర్యలు తీసుకున్నామని, సదరు ఉద్యోగిని రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేశామని వివరించారు.


బీరు బాటిల్ పక్కన పెట్టుకుని డ్యూటీ చేస్తున్న సురేశ్



ఉద్యోగాల భర్తీ హరీశ్‌కు ఇష్టం లేదా?: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం.. బీఆర్ఎస్ పార్టీకి, హరీశ్‌రావుకూ ఇష్టం లేదా అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిలదీశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క గ్రూప్-1 పరీక్ష కూడా నిర్వహించకుండా యువత జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. నోటిఫికేషన్లో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు ఉంటాయని, ఇష్టానుసారం మార్చడానికి వీలు ఉండదని హితవు పలికారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నిర్ణయంతో విద్యుత్తు శాఖపైన రూ.40 వేల కోట్ల ఆర్థిక భారం పడిందని ఆరోపించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భారం అవుతుందని తాము ఆనాడే చెప్పినా కేసీఆర్ ప్రభుత్వం వినలేదన్నారు. విచారణ కమిషన్‌లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తే చట్ట ప్రకారం ఆరు నెలల పాటు జైలు శిక్ష ఉంటుందని, ఈ మేరకు గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి అన్నారు. ఈ తీర్పు కేసీఆర్‌కు వర్తించదా అని ఆయన ప్రశ్నించారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లలో జరిగిన అవకతవకలు ప్రజలకు తెలియాలని సీఎం రేవంత్ రెడ్డి విచారణ కమిషన్‌ను నియమించారన్నారు. టీపీసీసీ లీగల్ సెల్ నేత దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ టెండర్లు లేకుండా రూ. వేల కోట్ల ప్రజాధనాన్ని.. కంపెనీలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

ఈసీ పనితీరుపై జేపీసీ వేయాలి: అద్దంకి

భారత్‌లో ఎన్నికల నిర్వహణపైన టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దగ్గరగా ఉన్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తన విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్ర ఎన్నికల కమిషన్ పనితీరుపై జేపీసీగానీ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలో ఉన్నత స్థాయి విచారణనుగానీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

పోర్లు దండాలు పెట్టినా.. హరీశ్‌కు బీఆర్ఎస్ పగ్గాలివ్వరు

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పోర్లు దండాలు పెట్టినా.. హరీశ్‌రావుకు బీఆర్ఎస్ పగ్గాలను ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఇవ్వబోరని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ త్వరలోనే బీజేపీలో విలీనం కానుందని చెప్పారు. అసెంబ్లీ మీడియా హాల్లో మంగళవారం మీడియా సమావేశంలో అయిలయ్య మాట్లాడుతూ హరీశ్ రావు తన చిల్లర మాటలు మానుకోకపోతే ప్రజలు ఉరికించి కొడతారన్నారు. లోక్‌సభ ఎన్నికలు అయిపోగానే కేసీఆర్, కేటీఆర్‌లు మాయం అయ్యారని విమర్శించారు. గత ప్రభుత్వ పాలన కంటే కాంగ్రెస్ పాలనే బాగుందంటూ ప్రజలు చెబుతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ రఘునందన్, హరీశ్ రావుల మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగిందని, అందుకే వారిద్దరూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం బలపడుతున్నాయన్న భయంతోనే బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటయ్యాయన్నారు. నీట్ లీకేజీ విషయంలో గుజరాత్ కేంద్రంగా బీజేపీ పెద్దల హస్తం ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించడం ద్వారానే మెరిట్ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. వయనాడ్ నుంచి లోక్‌సభ ఉప ఎన్నికలో పోటీకి సిద్ధమవుతున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రియాంక గాంధీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ అన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో ఘోరం

ఇది రాజకీయానికి సమయం కాదు అని రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్ ఎంతో గొప్పగా వ్యాఖ్యానిస్తున్నారు కానీ, పశ్చిమబెంగాల్‌లో జరిగిన రైలుప్రమాదం విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా రైల్వేవ్యవస్థ సమూల ప్రక్షాళన అవసరాన్ని గుర్తుచేస్తోంది. సరిగ్గా ఏడాదిక్రితం ఒడిశాలోని బాలాసోర్‌లో మూడురైళ్ళు ఢీకొని దాదాపు మూడువందలమంది మరణించారు. ఇప్పుడు కంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను గూడ్స్ రైలు వెనకనుంచి ఢీకొంది. ప్రమాదం తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదంటే, గూడ్స్‌రైలు బోగీలు అనేకం ధ్వంసమైనాయి, కొన్ని బోగీలు ఏకంగా గాలిలోకి లేచివున్న దృశ్యాలు కూడా చూశాం. ఈ గూడ్స్‌రైలు స్థానంలో మరో ఎక్స్‌ప్రెస్ రైలు ఉండివుంటే ఊహకు అందనంత విధ్వంసం జరిగివుండేది. సరిగ్గా ఏడాదిలో బాలాసోర్ స్థాయి ఘోరం మరొకటి మనం చూడాల్సివచ్చేది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చాలా రంగాల్లో అద్భుతాలు సాధిస్తున్నాం కానీ, రైల్వేని మాత్రం ఉద్ధరించలేకపోతున్నాం. నిజానికి, సాంకేతికత పెరుగుతున్నకొద్దీ ప్రమాదాలు తగ్గాలి. కానీ, ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయంటే, ఉద్యోగాలను కుదించే టెక్నాలజీయే తప్ప, ప్రాణాలు రక్షించే పరిజ్ఞానం మీద అది శ్రద్ధపెట్టడం లేదని అర్థం. దశాబ్దాలుగా అవే ప్రమాదాలు, విచారణ కమిషన్లు, మంత్రులూ అధికారుల సమర్థనలూ వింటున్నాం, చూస్తున్నాం. ఇక, ఈ దుర్ఘటన జరగడానికి సరిగ్గా మూడుగంటలముందు సిగ్నలింగ్ వ్యవస్థ పాడైందని, స్టేషన్‌మాస్టర్ ఈ రెండు రైళ్ళను ఒకదానివెనుక మరొకటి అనుమతించారని వార్తలు వచ్చాయి. ఈ ప్రత్యేకపరిస్థితిలో రెడ్‌సిగ్నల్ దాటినప్పటికీ వెనుక ఉన్న గూడ్స్‌రైల్ నెమ్మదిగా పోవాల్సివుండగా, డ్రైవర్ వేగాన్ని తగ్గించకపోవడం పెనుప్రమాదానికి దారితీసిందని అంటున్నారు. సిగ్నల్ ఎందుకు పనిచేయలేదు, అడపాదడపా అది విఫలం అవుతున్నదన్నమాట నిజమేనా, ఉన్నతాధికారులకు ఆ విషయం తెలుసునా ఇత్యాదివి విచారణలో బయటకు రావాల్సివుంది. అలాగే, ఈ ప్రమాదంలో మానవ తప్పిదాలు, నిర్లక్ష్యాలు, వైఫల్యాల శాతం ఎంతో కూడా నిగ్గుతేల్చాల్సివుంది.

బాలాసోర్ ఘటన మన పాలకుల, అధికారుల మనసులను బాధించినట్టు లేదు. ఆ తరువాత కూడా చాలా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గత ఏడాది విజయనగరం జిల్లాలో ఆగివున్న ప్యాసింజర్ రైలును మరో రైలు వెనుకనుంచి వచ్చి ఢీకొట్టడంతో పద్నాలుగుమంది ప్రాణాలు కోల్పోయారు. విశాఖ–రాయగడ ప్యాసింజర్ రైలు పైలట్, కో పైలట్ ఇద్దరూ క్రికెట్ మ్యాచ్ చూస్తూ రెడ్‌సిగ్నల్ పట్టించుకోక ఈ ప్రమాదానికి కారకులైనారని రైల్వేమంత్రి అప్పట్లో ప్రకటించారు. కానీ, ఆ తరువాత అది నిజం కాదనీ, దర్యాప్తులో తగిన ఆధారాలు దొరకలేదనీ తేల్చారు. మరి, ప్రమాదం ఎందుకు జరిగిందన్నది ఓ శేషప్రశ్న. లోకోపైలట్లు ఏమరుపాటుగా ఉండకుండా చూడటానికి వారికి పంపే సందేశాలను ఒకటికి రెండుసార్లు పునరుద్ఘాటించే పద్ధతి పాటిస్తున్నట్టుగా అధికారులు చెబుతున్నారు. అటువంటప్పుడు నిర్లక్ష్యం కారణంగా జరిగే ఇటువంటి ప్రమాదాల సంఖ్య బాగా తగ్గాలి.

ప్రమాదాలు జరిగినప్పుడల్లా కవచ్ ఎందుకులేదన్న ప్రశ్న వినబడుతూనే ఉంది. అన్నిరూట్లలోనూ అమలుచేయాలనీ, అన్ని రైళ్ళకూ ఆ రక్షణకవచాన్ని అమర్చాలనీ సంకల్పమైతే ఉన్నది కానీ, ఆ దశలవారీ విధానం ఎప్పటికీ పూర్తికావడం లేదు. తయారీసంస్థల సంఖ్య పరిమితంగా ఉన్నందున, ప్రధానమైన, ఖరీదైన, అధిక రద్దీ రూట్లలో దానిని నెలకొల్పడమే ఇంకా పూర్తికాలేదు. కానీ, వేగంగా పరిగెత్తే రైళ్ళ సంఖ్య మాత్రం మరోపక్క పెరిగిపోతోంది. బాలాసోర్ రైలు దుర్ఘటన తరువాత, ఈ ఏడాదికాలంలో కవచ్ వ్యవస్థ ఏర్పాటు ఒక్క కిలోమీటర్ కూడా జరగలేదని కాంగ్రెస్ అంటోంది. రైల్వేల్లో ఖాళీగా ఉన్న మూడులక్షల పోస్టులను భర్తీచేయకపోవడం, కేవలం నాలుగేళ్ళలో లక్షమంది రైలుప్రమాదాల్లో మరణించడం, 'రైల్ సురక్షాకోశ్' నిధులను 75శాతం మేరకు కుదించడం, రైళ్ళలో జనరల్ బోగీల సంఖ్యను తగ్గించి నిరుపేదలకు అన్యాయం చేయడం, రైల్వేబడ్జెట్‌ను జనరల్ బడ్జెట్‌లో కలిపివేసి జవాబుదారీతనం నుంచి ప్రభుత్వం తప్పించుకోవడం ఇత్యాది పలు అంశాలతో కాంగ్రెస్ వేసిన ప్రశ్నలు సముచితమైనవి. మరో రెండేళ్ళలో తమ బుల్లెట్ ట్రైన్ కల నెరవేరుతుందని సంతోషిస్తున్న పాలకులకు, ఈ దేశంలో సగటు రైలు ప్రయాణీకుడి ప్రాణం ప్రమాదంలో ఉన్నదని, వారిని భద్రంగా గమ్యస్థానాలకు చేర్చే అంశంమీద కాస్తంత దృష్టిపెట్టాలని మొన్నటి రైలు ప్రమాదం హెచ్చరిస్తోంది.

తెలంగాణ ఉద్యమం నుంచి బీజేపీని వేరు చేయలేరు!

అరవై సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగినది తెలంగాణ రాష్ట్ర సాధన మహోద్యమ చరిత్ర. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమానికి, వర్తమాన కాలంలో మన కళ్ల ముందు సాగిన మలి దశ రాష్ట్ర సాధన ఉద్యమానికి అనేక అంశాల్లో తేడాలు ఉన్నాయి. అప్పటి ఉద్యమం ఉద్యోగం, ఉపాధి, స్థానికత లాంటి సమస్యల కేంద్రంగా ఉద్యోగుల, విద్యార్థుల భాగస్వామ్యంతో జరిగింది. ఇటీవలి ఉద్యమం విశాల ప్రజానీకం ప్రత్యక్ష ప్రమేయంతో అనేక సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అంశాల చుట్టూ అల్లుకొని కొనసాగింది. ఈ ప్రజా ఉద్యమంలో భారతీయ జనతా పార్టీ ఎంతో కీలకమైన పాత్ర పోషించింది.

1992లోనే రెండు జీవనదుల మధ్య ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ సస్యశ్యామల యాత్ర జరిగింది. 1997లో కాకినాడలో రెండు రాష్ట్రాల కోసం బీజేపీ తీర్మానించింది. ఇలా ఒకరకంగా మలిదశ ఉద్యమాన్ని బీజేపీ శ్రేణులే ప్రారంభించాయి.

అంబేడ్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా బీజేపీ పరిపాలన సౌలభ్యం కోసం, అభివృద్ధి కోసం చిన్న రాష్ట్రాలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగానే ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో మూడు కొత్త రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ ఏర్పాటయ్యాయి. మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల అసెంబ్లీల్లో చేసిన తీర్మానాలతో ఎలాంటి ప్రతిఘటనలు లేకుండా సామరస్యపూర్వకంగా బీజేపీ ఈ రాష్ట్రాలను ఏర్పాటు చేయగలిగింది. తెలంగాణ విషయానికి వస్తే కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి దాటవేసే నిర్ణయాలు, రాజకీయ స్వలాభాల వైపే మొగ్గు చూపింది తప్ప, ఏనాడూ ప్రజల ఆత్మగౌరవ పోరాటానికి మద్దతివ్వలేదు. ఫలితంగానే మలిదశ ఉద్యమంలో 1200 మంది యువకులు బలిదానం చేసుకున్నారు.

మలిదశ ఉద్యమంలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ పార్టీ నాయకత్వంపై కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు నిందలు వేస్తూ వచ్చింది. 2006 ఏప్రిల్‌లో ఆనాడు లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న ఎల్.కె. అద్వానీకి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఇష్టం లేదంటూ కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసింది. ఈ విషయమై 2006 ఏప్రిల్ 27న స్వయంగా ఎల్.కె. అద్వానీ ఆనాటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి లేఖ రాశారు. మీరు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక రాష్ట్ర బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 2002 జనవరి 5న సోనియాగాంధీకి రాసిన ఉత్తర సారాంశాన్ని మార్చివేసి అద్వానీని, బీజేపీని బద్నాం చేసే ప్రయత్నం చేశారు. తెలంగాణ బేషరతుగా ఇవ్వాలని అద్వానీ డిమాండ్ చేస్తే సెకండ్ ఎస్సార్సీ అంటూ మాట మార్చింది కాంగ్రెస్ పార్టీ. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది కాబట్టి ఎన్డీయే మద్దతు లేకుండానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసే అవకాశముందని అద్వానీ చెప్పారు. మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన క్రమంలో ఆనాటి జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ తెలంగాణకు సై అంటూ బహిరంగ ప్రకటన చేశారు. ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్న సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీతో పాటు అనేక మంది సీనియర్ నాయకులు మద్దతుగా నిలిచారు. తెలంగాణలో జేఏసీ ఏర్పడినప్పుడు కూడా బీజేపీ పార్టీ అందులో భాగమైంది. ప్రతి జేఏసీ పిలుపులో కీలకపాత్ర పోషించింది.



మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన క్రమంలో ఆనాటి జాతీయ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ తెలంగాణకు సై అంటూ బహిరంగ ప్రకటన చేశారు. ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్న సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీతో పాటు అనేక మంది సీనియర్ నాయకులు మద్దతుగా నిలిచారు. తెలంగాణలో జేఏసీ ఏర్పడినప్పుడు కూడా బీజేపీ పార్టీ అందులో భాగమైంది.

ఢిల్లీ కేంద్రంగా సెప్టెంబరు 2012లో మూడురోజుల పోరు దీక్ష, అదేవిధంగా పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాలను బీజేపీ భుజాన వేసుకుంది. కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఇవి జరిగాయి. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ ఉద్యమకారులను ఢిల్లీ పోలీసులచే గుర్రాలతో తొక్కించి, వాటర్ గన్స్‌తో దాడి చేయించింది. ఆ సందర్భంలో వందలాదిమంది కార్యకర్తలకు గాయాలయ్యాయి. బాధితులందరినీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన సభలో సుష్మాస్వరాజ్ పరామర్శించి కన్నీటిపర్యంతమయ్యారు. పార్లమెంటులో తెలంగాణలో ఏం జరుగుతుందో తెలుసా అని కాంగ్రెస్‌ను నిలదీశారు. ముఖ్యంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. నల్లు ఇంద్రసేనారెడ్డి సహా డాక్టర్ కె. లక్ష్మణ్, నేటి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సైతం తీవ్రంగా గాయపడ్డారు. వందలాదిమందిని అరెస్టు చేశారు. గాయపడిన కార్యకర్తలందరినీ ఇప్పటి కోశాధికారి శాంత కుమార్ హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. తెలంగాణ ఉద్యమ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్‌గా ఈ ఘటనలకు నేను ప్రత్యక్ష సాక్షిని.

ఆనాటి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండారు దత్తాత్రేయ తెలంగాణ సంకల్ప యాత్ర పేరిట ఉత్తర తెలంగాణలో చేసిన యాత్రకు సబ్బండవర్గాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అదేవిధంగా నల్లు ఇంద్రసేనారెడ్డి, బంగారు లక్ష్మణ్ ప్రజల ముందుకు వెళ్లగా, సిహెచ్.విద్యాసాగర్ రావు, జి.కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్‌లు ప్రత్యేక కమిటీల ద్వారా ఉద్యమాన్నిమరింత బలోపేతం చేశారు. జేఏసీలో భాగస్వామై వంటావార్పులు, రైల్ రోకోలు, రాస్తారోకోలు, సాగరహారం, మిలియన్ మార్చ్‌లతో పాటు ఆయా జిల్లాల్లో పెద్దఎత్తున సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరిచారు. తెలంగాణ సాధన కోసం బీజేపీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ రాజీనామా చేయగా, ఇతర పార్టీ ఎమ్మెల్యేలు సైతం రాజీనామాలు చేసిన సందర్భంలో, వారిపై బీజేపీ అభ్యర్థులను నిలబెట్టకుండా వారి గెలుపు కోసం కృషి చేసింది పార్టీ. ఇలా ఎన్నో చర్యల ద్వారా తెలంగాణ రాష్ట్రానికి అనుకూలమని బీజేపీ ప్రజానీకానికి స్పష్టం చేసింది.

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పార్లమెంటులో బిల్లు పెడితే అనుకూలంగా ఓటు వేస్తామని ప్రతిపక్షనేత సుష్మా స్వరాజ్ చెప్పి మాట నిలుపుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా ఓటు వేసి బీజేపీ చిత్తశుద్ధితో వ్యవహరించింది. సుదీర్ఘ కాలంగా ప్రజల్లో ఉన్న ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష బీజేపీ మద్దతుతోనే సాకారమైంది.

■ ఎస్. కుమార్
బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్ రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

'ఐఏఎస్'లో సమూల మార్పులు అవసరమా?

రైతు నాయకుడైన చరణ్ సింగ్ 1967లో ముఖ్యమంత్రి కాగానే తన చీఫ్ సెక్రటరీ బిబి సింగ్‌ను పిలిచి 'నాకు మెరికల్లాంటి నలుగురు యువ ఐఏఎస్ అధికారులు కావాలి. వారు మన రాష్ట్రానికి చెందినవారై ఉండకూడదు. దక్షిణాది వారైనా, పంజాబీవారైనా సరే..' అన్నారు. మన దేశం ఆహార ధాన్యాల సంక్షోభంలో ఉన్న కాలమది. అమెరికా నుంచి ఓడ రాకపోతే భారత దేశ ప్రజలు ఆకలితో మాడిపోతారని అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్ సైతం వ్యాఖ్యానించిన రోజులవి. ఉత్తర ప్రదేశ్‌లో ఆహార సంక్షోభాన్ని నివారించాలంటే నల్లబజారులో ఆహార ధాన్యం విక్రయించకుండా చర్యలు తీసుకోకతప్పదని చరణ్ సింగ్ భావించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నలుగురు అధికారులను తన వద్దకు పిలిపించుకుని వారికి నాలుగు కొత్త జీపులతో పాటు రూ. 150 ప్రత్యేక వేతనంగా ఇస్తానని తెలిపారు. 'మీరు రాష్ట్రమంతటా తిరగండి. ఎక్కడ అక్రమాలు జరిగినా నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోండి.. మీ వెనుక నేనున్నాను' అని చెప్పారు. ఆ నలుగురు ఐఏఎస్ అధికారులు నెల రోజులు రాష్ట్రమంతటా తిరిగారు. అక్రమ నిల్వలు చేసిన వ్యాపారుల పైన, తిండి గింజలను సరిగ్గా పంపిణీ చేయని వారి పైన పోలీసుల సహకారంతో దాడులు చేశారు. మార్కెట్‌పై అక్రమార్కుల పట్టును బద్ధలుకొట్టారు. మరో వైపు పంపిణీ యంత్రాగం కూడా అప్రమత్తమై పేదలకు ఆహార ధాన్యాలను సక్రమంగా పంపిణీ చేయడంలో నిమగ్నమైంది. ఉత్తర ప్రదేశ్ కరువు, ఆకలి చావుల పాలిట పడకుండా చరణ్ సింగ్ కాపాడారు. తర్వాత దేశంలో వచ్చిన హరిత విప్లవం ఆహార రంగ పరిస్థితులను మార్చింది. 'మీరు ఇతర రాష్ట్రాల అధికారులను ఎందుకు నియమించారు?' అని చరణ్ సింగ్‌ను అడిగితే 'ఇక్కడి అధికారులైతే వారికెవరో బంధువులు ఉంటారు. వారిపై ఒత్తిళ్లు వస్తాయి. పైగా మన రాష్ట్రంలో అంతా కుల రాజకీయాలే. అందువల్ల ఏ పంజాబీ అధికారో, దక్షిణాది అధికారో అయితే ఏ ఒత్తిళ్లు లేకుండా పనిచేస్తారు' అని చెప్పారు.

నాయకుడు నిజాయితీగా ఉంటే అధికారులను సమర్థంగా పనిచేయించగలరు అన్నదానికి చరణ్ సింగ్ ఉదంతం ఒక ఉదాహరణ. అప్పుడంటే ఇతర రాష్ట్రాలవారితో పనిచేయించుకుంటే ఫలితాలు వస్తాయన్న నమ్మకం ఉండేది. ఇప్పుడు రాజకీయ నాయకుల నీచత్వం వల్ల, అసమర్థత, అజ్ఞానం వల్ల అన్ని ప్రాంతాల అధికారులు ఎక్కడ పనిచేసినా ఆ నేతల మకిలిని తమకు కూడా అంటించుకుంటున్నారు. నిజానికి ఒక ప్రభుత్వం విఫలమైతే, అధికారులను నిందించి లాభం లేదు. రాజకీయ నాయకత్వం దౌర్భాగ్యం వల్ల ఐఏఎస్ అధికారులు కూడా దిగజారిపోతున్నారనడంలో సందేహం లేదు. 'ఐఏఎస్ అధికారుల ఎంపిక చాలా పకడ్బందీగా జరుగుతుంది. చాలా తెలివిగలవారిని సమర్థులను ఎంపిక చేస్తారు. అటువంటప్పుడు వారు ఎందుకు సమర్థంగా పనిచేయలేరు? రాజకీయ నాయకులు సక్రమంగా ఉంటే వారు కూడా సక్రమంగా పనిచేస్తారు' అని మాజీ ఐఏఎస్ అధికారి అల్ఫోన్స్ ఒక సందర్భంలో చెప్పారు.

కాని రాజకీయ నాయకులు అధికారులను తమ అవినీతి కూపంలోకి లాగడం, అక్రమార్జన ఎలా చేయవచ్చో అధికారులు కూడా నేతలకు నేర్పించడం ఒక విషవలయంగా మారింది. ఒక ఉత్తరాది ముఖ్యమంత్రికి ఆయన నమిలే పొగాకు (ఖైనీ)ను సీనియర్ అధికారులే అందించేవారు. ఆ ముఖ్యమంత్రి, తన స్వంత పనులను చేసి పెట్టని అధికారులను ఎడాపెడా బదిలీ చేసేవారు.

రాజకీయ నాయకులతో పాటు క్విడ్ ప్రో కేసుల్లో అనేక మంది ఐఏఎస్ అధికారులు కోర్టు చుట్టూ తిరిగిన ఉదంతాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో ఉన్నాయి. ఈ విషయం తెలిసినప్పటికీ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలువురు అధికారులు గత అయిదేళ్లలో ముఖ్యమంత్రి అండతోనే విశృంఖలంగా వ్యవహరించారు. ముఖ్యమంత్రి స్వయంగా ఒక అవినీతి అధికారిని తన వద్ద చేర్చుకోవడం కోసం ఢిల్లీలో హోంమంత్రి చుట్టూ తిరిగిన సందర్భాలున్నాయి. ఏపీలో కొందరు ఉన్నతాధికారులు అసైన్డ్ భూములు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల ఆక్రమణ, అవినీతి కార్యకలాపాలకు పాల్పడడం, అధికార పార్టీ రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించడం, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగపరచడం, విచ్చలవిడిగా అప్పులను ప్రోత్సహించడం, తప్పుడు పనులు చేసేందుకు ఒప్పుకోని తోటి అధికారులనే తీవ్రంగా వేధించడం వంటి అనేక దురాగతాలకు పాల్పడ్డారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న కొందరు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరించారు. వారు ఎందుకలా చేశారు? అధికారం తమకు శాశ్వతంగా ఉంటుందని భావించారా? లేక తమను బానిసలుగా చేసుకున్న రాజకీయ నేతలు శాశ్వతంగా రాజ్యమేలుతారని అనుకున్నారా? తర్వాత అధికారంలోకి వచ్చే నేతలు ఇలాంటి వారిని చీదరించుకోకుండా ఎలా ఉంటారు?





■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'తొలి రోజుల్లో ఐఏఎస్‌లు నిజాయితీపరులుగా ఉండేవారు. ఇవాళ వివిధ రంగాల్లో దేశం వైఫల్యాలకు కారణం వారే' అని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి దువ్వూరి సుబ్బారావు అన్నారు. 'సమర్థత, అంకితభావం, నిజాయితీకి ఐఏఎస్‌లు ఒకప్పుడు మారుపేరుగా నిలిచేవారు. కాని ఆ స్థానంలో ఇప్పుడు అసమర్థత, పరిపాలన పట్ల నిరాసక్తత, అవినీతి చోటుచేసుకున్నాయి' అని ఆయన వాపోయారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ఏం చేయాలన్న విషయంపై చర్చ జరగాల్సి ఉన్నది.

అధికారులతో సక్రమంగా పనిచేయించుకోవడం అనేది ఒక కళ. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడు రోజుల క్రితం తన ప్రిన్సిపల్ సెక్రటరీగా పికె మిశ్రాను, జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోవల్‌ను మళ్లీ నియమించారు. ఆయన ఒకసారి వ్యక్తుల సమర్థతను విశ్వసించారంటే వారిని వదిలే అవకాశం లేదు. 1968 బ్యాచ్‌కు చెందిన కేరళ అధికారి అయిన అజిత్ దోవల్ 2014 నుంచీ మోదీ సలహాదారుగానే కొనసాగుతున్నారు. ఇక పికె మిశ్రా గురించి చెప్పనక్కర్లేదు. 2001లో నరేంద్రమోదీ తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విశాఖపట్టణానికి చెందిన గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారి జి.సుబ్బారావు చీఫ్ సెక్రటరీగా ఉన్నారు. మోదీతో కలిసి పనిచేసేందుకు సుబ్బారావు నియమించిన ముగ్గురు అధికారుల్లో పికె మిశ్రా ఒకరు. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఆయన మోదీతోనే ఉన్నారు. గుజరాత్ రోజుల నుంచి మోదీతో సన్నిహితంగా ఉన్న అధికారులు హిరేన్ జోషి, ప్రతీక్ దోషి (నిర్మలా సీతారామన్ అల్లుడు), సంజయ్ భవ్సర్, ఎకె శర్మ వంటి అనేక అధికారులు మోదీతో చాలాకాలంగా కొనసాగుతున్నారు. నిజానికి మోదీ ముఖ్యమంత్రి కాక ముందు కనీసం సర్పంచ్ బాధ్యతలను సైతం నిర్వహించలేదు కాని ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే పాలన గురించి నేర్చుకునేందుకు తన చుట్టూ ఉన్న అధికారులనే ఉపయోగించుకున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకు ఐఏఎస్, జిల్లా అభివృద్ధి అధికారుల సదస్సును ప్రారంభించాలని సుబ్బారావు మోదీని ఆహ్వానించారు. 'మీరు దీపం వెలిగించి ఉపన్యసించి వెళ్లిపోతే చాలు..' అన్నారు. 'అక్కడేం జరుగుతుంది?' అని మోదీ అడిగారు. 'కలెక్టర్లు, డీడీఓల క్రింద ఉన్న అన్ని విభాగాలను సమీక్షిస్తాం' అని సుబ్బారావు చెప్పారు. నిజానికి ప్రతి ఏడాదీ ఈ సమావేశం ఒక తంతులా జరిగేది. మధ్యాహ్న భోజనం కాగానే అందరూ తమ తమ ప్రాంతాలకు వెళ్లిపోయేవారు. కాని ఈ సమావేశానికి హాజరైన మోదీ అక్కడ నుంచి కదల్లేదు. దీనితో వివిధ విభాగాల సెక్రటరీలు కూడా కదలకుండా అక్కడే కూర్చున్నారు. నోట్స్ తీసుకుంటూ ప్రశ్నలు అడుగుతూ మోదీ ప్రతి జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. సమావేశం రాత్రి 11 గంటల వరకూ సాగింది. ఇలా అధికారుల నుంచి పాలనా వ్యవహారాల విషయమై పాఠాలు నేర్చుకున్న మోదీ తర్వాతి కాలంలో క్రమక్రమంగా అధికారులపైనే పట్టు సాధించగలిగారు. గుజరాత్‌లోనూ, ఢిల్లీలోను మోదీ పాలనలో అవినీతి గురించి చర్చలేకపోవడానికి వారే కారణం. మోదీ విజయ రహస్యం వెనుక కూడా అధికారుల హస్తం లేదని చెప్పలేం.

గత 24 సంవత్సరాలుగా ఒడిషాలో తిరుగులేని అధికారాన్ని చలాయించిన నవీన్ పట్నాయక్ ఈ సారి ఓటమిపాలు కావడానికి ఒక ఐఏఎస్ అధికారే కారణమని బిజూ జనతాదళ్ నేతలు ఆరోపిస్తున్నారు. నవీన్ పట్నాయక్ తన బాధ్యతల నిర్వహణలో ఐఏఎస్ అధికారులపై ఎక్కువగా ఆధారపడేవారు. తొలుత ఆయన తన తండ్రి హయాంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న మహాపాత్ర అనే అధికారికి అన్ని బాధ్యతలు అప్పగించారు. మహాపాత్ర రాజకీయ అధికారాలు కూడా చలాయించారు. ఆయన తర్వాత బాధ్యతలు నిర్వర్తించిన పాండ్యన్ మరో అడుగు ముందుకు వేసి బిజూ జనతాదళ్ పార్టీని కూడా తన చెప్పుచేతుల్లోకి తీసుకున్నారు. పంజాబ్ కేడర్‌కు చెందిన పాండ్యన్ తన భార్య ఒడిషా అధికారిణి కావడంతో ఆ రాష్ట్రానికి మారారు. నవీన్ పట్నాయక్ పాండ్యన్‌ను పూర్తిగా విశ్వసించడంతో ఎన్నికల టిక్కెట్లు కూడా అయనే పంపిణీ చేయడం మొదలు పెట్టారు. నవీన్ అనారోగ్యాన్ని పాండ్యన్ తనకు అనుకూలంగా మార్చుకున్నారు. ఏ రాజకీయనాయకుడినీ నవీన్ పట్నాయక్‌ను కలుసుకోనిచ్చేవారు కాదు. 2023లో పాండ్యన్ తన పదవికి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి పూర్తి స్థాయి బీజేడీ నాయకుడుగా మారారు. 2024 ఎన్నికలకు ముందు బీజేపీ నేతలు బీజేడీతో పొత్తు కోసం పాండ్యన్‌తోనే చర్చలు జరిపారు. ఈ చర్చలు విఫలమయ్యాయి. వేరే రాష్ట్రానికి చెందిన పాండ్యన్‌కు పార్టీని, ప్రభుత్వాన్ని అప్పగించడం ద్వారా ఒడిషా ఆత్మగౌరవాన్ని పట్నాయక్ తాకట్టు పెట్టారని నరేంద్రమోదీ ఎన్నికల్లో ఉధృతంగా ప్రచారం చేశారు. ఒక చరిత్రగల నేతను కూడా ఐఏఎస్ అధికారులు ఎంత భ్రష్టుపట్టించగలరో అన్నదానికి ఒడిషాలో జరిగిన మార్పు ఒక నిదర్శనం. రాజకీయ నాయకులకు ఇది ఒక గుణపాఠం కూడా!

'తొలి రోజుల్లో ఐఏఎస్‌లు నిజాయితీపరులుగా ఉండేవారు. కాని ఇవాళ వివిధ రంగాల్లో దేశం వైఫల్యాలకు కారణం ఐఏఎస్ అధికారులే' అని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్, కేంద్ర ఆర్థికశాఖ మాజీ కార్యదర్శి దువ్వూరి సుబ్బారావు ప్రముఖ జర్నలిస్టు కరణ్ థాపర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'సమర్థత, అంకితభావం, నిజాయితీకి ఐఏఎస్‌లు ఒకప్పుడు మారుపేరుగా నిలిచేవారు. కాని ఆ స్థానంలో ఇప్పుడు అసమర్థత, పరిపాలన పట్ల నిరాసక్తత, అవినీతి చోటుచేసుకున్నాయి' అని ఆయన వాపోయారు. ఐఏఎస్ పూర్వవైభవాన్ని, ప్రామాణికతను పునరుద్ధరించగలమా లేక వర్తమాన అవసరాలకు తగ్గట్లుగా ఐఏఎస్ వ్యవస్థనే సమూలంగా మార్చవలసిన అవసరం ఉన్నదా అన్న విషయంపై చర్చ జరగాల్సి ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

లౌకిక, ప్రజాస్వామ్య భారత్ భవిష్యత్తు భద్రమేనా?

తీర్పు 2024 – 6

పద్దెనిమిదవ లోక్‌సభ ఎన్నికల ప్రజా తీర్పు లౌకిక, ప్రజాస్వామ్య భారత్‌ను కాపాడుతుందా? మన మహోజ్వల జాతీయోద్యమ నిర్మాతలు వ్యవస్థాపించిన లౌకిక, ప్రజాస్వామిక భారత గణతంత్ర రాజ్యానికి భద్ర భవిష్యత్తును కల్పిస్తుందా? ఇటీవలి అసాధారణ సార్వత్రక ఎన్నికల ఫలితాలపై మా ఆరు భాగాల విశ్లేషణను పై ప్రశ్నల పై విస్తృత వివేచనతో ముగిస్తున్నాం. ఒక విధంగా ఆ ప్రశ్నలకు సమాధానం అవుననే చెప్పాలి. ఈ సార్వత్రక ఎన్నికలు అధికార పక్షం సర్వోన్నత నాయకుడి పాలనపై ఒక రెఫరెండం (ప్రజాభిప్రాయ సేకరణ). గత పది సంవత్సరాలుగా తాను సాగించిన నిరంకుశ పాలనకు, రాబోయే ఐదేళ్లలో మన గణతంత్ర రాజ్యాన్ని కూల్చివేసేందుకు ఎటువంటి మినహాయింపులు లేని ప్రజామోదాన్ని మోదీ ప్రగాఢంగా అభిలషించారు. భారత ప్రజలు ఆయన భావి పథకాన్ని ఆమోదించేందుకు తిరస్కరించారు. హిందూ ఓటర్ల మద్దతును పొందేందుకు ప్రధాని మోదీ తెంపరితనంతో ముస్లిం వ్యతిరేక భావోద్వేగాలను తీవ్రంగా రెచ్చగొట్టారు. అయితే హిందూ మెజారిటేరియన్ రాజకీయాలు ప్రబలంగా ఉన్న హిందీ రాష్ట్రాలలో సైతం మోదీ మతతత్వ ప్రకటనలను ఓటర్లు ఉపేక్షించారు. తత్కారణంగానే ఈ సార్వత్రక ఎన్నికలలో ప్రజా తీర్పు నరేంద్ర మోదీకి వ్యక్తిగత ఓటమి అని చెప్పితీరాలి. అజేయుడుగా మోదీ అందుకుంటున్న కీర్తి హారతులు దాదాపుగా ఆరిపోయాయి.

ఈ ప్రజా తీర్పు పర్యవసానాలు స్పష్టమే. నిర్ణయాత్మకమైన నిరంకుశ పాలన నుంచి ఎలాంటి పౌర స్వేచ్ఛలకు తావులేని సంపూర్ణ నియంతృత్వ రాజకీయ వ్యవస్థగా భారత ప్రజాస్వామ్య తిరోగమనం నిలిపివేయబడింది. అధికారపక్షం లోపలా, వెలుపలా, పార్లమెంటులోనూ, బయటా ప్రజాస్వామిక అవకాశాలు మెరుగుపడ్డాయి. హిందూ మెజారిటేరియన్ రాజ్య వ్యవస్థకు అనుకూలంగా లౌకికవాద సమాజ నిర్మాణంపై రాజ్యాంగ దార్శనికతను ధ్వంసం చేస్తోన్న సంకుచిత భావజాల కార్యక్రమానికి విఘాత మేర్పడింది. ఏమైనా ఈ పర్యవసానాలు కీలకమైనవే కానీ, లౌకిక, ప్రజాస్వామిక భారత్‌కు భద్ర భవిష్యత్తును సమకూర్చేదిగా ఈ ప్రజా తీర్పును పరిగణించలేము. అవి ఎన్నికల తీర్పు పర్యవసానాలే కానీ ప్రజల ఉద్దేశాలుగా పరిగణించలేము. మా విశ్లేషణ చాల వరకు ఎన్నికల తుది ఫలితాలపై ఆధారపడి చేసిందే. ఓటర్ల మనసులోని మాటలను తెలుసుకునే వరకు ఈ నిర్ధారణలు ఎంత వరకు సబబైనవో చెప్పలేము. అదృష్టవశాత్తు లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ నిర్వహించిన పోస్ట్ పోల్ సర్వేలో వెల్లడయిన వివరాలు ఓటర్ల ఉద్దేశాలను తెలుసుకునేందుకు తోడ్పడేవిగా ఉన్నాయి. పోలింగ్ అనంతరం 20 వేల మందికి పైగా ఓటర్లను పలు అంశాలపై ప్రశ్నించి సేకరించిన వివరాలవి.

తొలుత మన ప్రజాస్వామ్యంపై ఓటర్ల అభిప్రాయాలను చూద్దాం. ఒక విషయం స్పష్టం: ఏడు దశాబ్దాల ప్రజాస్వామిక పాలన ప్రజలకు ప్రజాస్వామిక ఆలోచనా అలవాట్లను అలవర్చాయి, సందేహం లేదు. వాటిని మార్చడం అంత తేలిక కాదు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చేందుకు సమకూరే అవకాశాన్నే ప్రజాస్వామ్యంగా సగటు భారతీయుడు భావిస్తున్నాడని ఈ సర్వే వెల్లడించింది. సుదీర్ఘకాలం ఏకపార్టీ పాలన కంటే ప్రతి ఐదేళ్లకొకసారి ప్రభుత్వం మారిపోవడమే అభివృద్ధికి ఇతోధికంగా దోహదపడుతుందని ఈ సర్వేలో పాల్గొన్న ప్రతి ముగ్గురిలో ఇద్దరు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా అధికారంలోకి వచ్చిన పాలకులపై నిరోధాలు ఉండి తీరాలనే భావనను అత్యధికులు సమర్థించారు. ఇటువంటి నిరోధాలను ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలనను ప్రభావితం చేసే హక్కు, నాయకులు విధాన నిర్ణయాలు తీసుకునే క్రమంలో జోక్యం చేసుకునే హక్కు ప్రజలకు ఉండి తీరాలనే భావనను 77 శాతం మంది సమర్థించారు. ప్రభుత్వ నిర్ణయాలు సబబుగా లేని పక్షంలో వాటిపై అభ్యంతరం తెలిపే హక్కు ప్రజలకు ఉండి తీరాలని కూడా 77 శాతం మంది గట్టిగా అభిప్రాయపడ్డారు. ఇది మోదీ ప్రభుత్వాన్ని తీవ్రంగా ఆక్షేపించడమే కాదూ? ఇంతకంటే ముఖ్యమైన భావన రాజ్యాంగ బద్ధమైన నిరోధాలు, సమతౌల్యతలు. ఎన్నికైన ప్రభుత్వ అధికారాలను న్యాయస్థానాలు, రాజ్యాంగబద్ధ సంస్థలు అదుపు చేయాలని 68 శాతం మంది విశ్వసిస్తున్నారు.



సగటు భారతీయ ఓటరుకు ఉదారవాద ప్రజాస్వామ్యం గురించిన అవగాహన లేకపోవచ్చు గానీ పాలకులు జవాబుదారీ తనం లేకుండా వ్యవహరించడాన్ని, వారి నిర్హేతుక నిర్ణయాలను, అడ్డూ అదుపూ లేకుండా అధికారాల చెలాయింపును అంగీకరించడానికి అతడు సుముఖంగా లేడు.

'ఎన్నికల గురించి ఆలోచించనవసరం లేకుండా సమర్థ పాలనందించగల ఒక శక్తిమంతుడైన నాయకుడి అవసరం మనకు ఉంది' అనే నియంతృత్వ పాలన అనుకూల అభిప్రాయంతో ప్రతి నలుగురిలో ఒక్కరు మాత్రమే ఏకీభవించడం గమనార్హం. ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నవారు 2019లో కంటే 2024లో పది శాతం మంది తక్కువగా ఉన్నారు. అంతే కాదు, ఆ అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తున్నవారు 2019లో కంటే ప్రస్తుతం 2 శాతం అధికంగా ఉన్నారు. చెప్పవచ్చినదేమిటంటే మోదీ ప్రభుత్వం సంపూర్ణ నియంతృత్వ వ్యవస్థ వైపుగా ప్రయాణిస్తుండగా ప్రజలు అందుకు విరుద్ధ మార్గంలో ముందుకు సాగాలని గట్టిగా అభిలషిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియపై నమ్మకం కూడా దిగజారిపోయింది. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై విశ్వాసం 57 శాతం నుంచి 47 శతానికి తగ్గిపోయింది. అలాగే ఈవీఎమ్‌ల విషయంలో కూడా ఓటర్ల నమ్మకం 57 శాతం నుంచి 34 శాతానికి తగ్గిపోయింది. ఈ ప్రాథమిక ప్రజాస్వామిక ప్రమాణాల ఉల్లంఘనకు మోదీ ప్రభుత్వమే కారణమని ప్రజలు విశ్వసిస్తున్నారా లేదా అన్నది చెప్పలేము. అయితే సరిగ్గా ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడాన్ని ప్రజలు ఆమోదించడం లేదు. నిజానికి అవినీతి ఆరోపణలపై కాకుండా రాజకీయ కారణాలతోనే అరెస్ట్ చేయడం జరిగిందని పలువురు స్పష్టంగా చెప్పారు. మోదీ ప్రభుత్వాన్ని మీరెందుకు అయిష్టపడుతున్నారన్న ప్రశ్నకు 0.8 శాతం మంది 'నియంతృత్వ పాలన' అని సమాధానమిచ్చారు. మోదీ ప్రభుత్వానికి మరొక అవకాశం ఇచ్చేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారన్న ప్రశ్నకు 1.1 శాతం మంది 'అసహన వైఖరులు, పౌర స్వేచ్ఛలను పరిమితం చేయడం' అని సమధానమిచ్చారు.


లౌకికవాదం విషయంలో ఓటర్ల వైఖర్లకు సాక్ష్యాధారాలు మిశ్రమంగా ఉన్నాయి. ఇదేమీ ఆశ్చర్యకరం కాదు. ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా మెజారిటేరియన్ పాలనకు అనుకూలంగా బీజేపీ ఎలా మార్చివేసిందో ప్రొఫెసర్ సుహాస్ పల్షీకర్ పదే పదే నిర్ధారించారు. మోదీ ప్రభుత్వాన్ని గురించి తాము ఇష్టపడే అంశం అయోధ్యలో రామాలయాన్ని ప్రారంభించడమేనని 22 శాతం మంది పేర్కొన్నారు. అయితే ఆ ఆలయం కారణంగా మోదీ సర్కార్‌కు మరొక అవకాశాన్ని ఇవ్వాలని అభిప్రాయపడినవారు కేవలం 5 శాతం మంది మాత్రమే ఉన్నారు. ఏమైనా బీజేపీ శ్రేణులలో అనేక మందిని, ఆ పార్టీపక్షాన్నే ఉండిపోవడానికి రామాలయం అంశం ఇతోధికంగా పురిగొల్పింది. బీజేపీ వైపు ఓటర్లు మొగ్గడానికి మందిర్ అంశం పెద్దగా తోడ్పడలేదని ఆ సర్వే స్పష్టం చేసింది. సమ్మిళిత భారత్ భావనపై దాదాపుగా ఏకీభావం ఉందని ఎన్నికలకు ముందు లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ నిర్వహించిన సర్వేలో వెల్లడయింది. ఈ వైఖరి 'ఎన్నికల ప్రచారంలో మోదీ గొంతు చించుకున్న 'చొరబాటుదారులు' కథనానికి పూర్తిగా విరుద్ధమైనది. ఇండియా కేవలం హిందువులదే' అన్న ప్రకటనను అంగీకరించిన ప్రతి ఒక్క ఓటరుకు ప్రత్యామ్నాయంగా 'ఇండియా కేవలం హిందువులదేకాదు, అన్ని మతాల వారిది' అన్న భావనను సమర్థిస్తున్న ఓటర్లు ఏడుగురు ఉన్నారు. మెజారిటేరియనిజం నిర్దిష్ట వ్యక్తీకరణలను ప్రజలు తిరస్కరిస్తున్నట్టు పోస్ట్ పోల్ సర్వే వెల్లడించింది. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో అధిక సంఖ్యాక వర్గాల వారి అభిప్రాయానికి ప్రథమ, అగ్ర ప్రాధాన్య మివ్వాలన్న' వాదనను వ్యతిరేకిస్తున్నవారు 2019లో కంటే 2024లో అధికంగా ఉన్నారని స్పష్టమయింది. ఈ వాదనలతో ఏకీభవిస్తున్నవారి సంఖ్య 2004, 2009లో కంటే ఎక్కువగా ఉన్నది. మోదీ జాతీయ రాజకీయాలలోకి వచ్చిన 2014లో ఈ వాదనను అంగీకరించినవారు 40 శాతం మంది కాగా 2019లో వారు 29 శాతానికి, 2014లో 21 శాతానికి తగ్గిపోయారు. ఇదే సమయంలో మైనారిటీ వర్గాల వారి హక్కులకు మద్దతునిస్తున్న వారి సంఖ్య పెరగలేదు. ఈ అంశంపై ప్రధాని మోదీ ప్రచారం ఓటర్ల వైఖరిని ప్రభావితం చేసి ఉంటుంది. మైనారిటీల ప్రయోజనాలను పరిరక్షించడమనేది ప్రభుత్వ బాధ్యత అన్న అంశానికి మద్దతునిచ్చినవారు రెండు దశాబ్దాల క్రితం 67 శాతం మంది ఉన్నారు. వీరి సంఖ్య 2014 తరువాత క్రమంగా తగ్గిపోసాగింది. ఇప్పుడు అది 38 శాతంగా ఉన్నది. అదే విధంగా మైనారిటీ వర్గాల వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలన్న వాదనతో పూర్తిగా ఏకీభవిస్తున్నవారు 2019లో 34 శాతం నుంచి 2024లో 27 శాతానికి తగ్గిపోయారు. అయితే ఇదే సమయంలో ఆ అభిప్రాయంతో ఏకభవించని వారి సంఖ్య కూడా అదే నిష్పత్తిలో తగ్గిపోయింది. మెజారిటేరియన్ వాదంకు సంబంధించిన రాజకీయ దృక్కోణాలలో సంయమనం ఉన్నప్పటికీ మైనారిటీలను సాంస్కృతికంగా కలుపుకుపోవాలన్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 'మైనారిటీ వర్గాల వారు అధిక సంఖ్యాక వర్గాల వారి ఆచారాలను అనుసరించాలన్న' వాదనతో ఏకీభవిస్తున్న ఓటర్లు 2019నాటి కంటే ఇప్పుడు 7 శాతం అధికంగా ఉన్నారు. మొత్తం మీద లౌకికవాద సమాజాన్ని నిర్మించుకోవాలన్న రాజ్యాంగ ఆదర్శానికి మద్దతు స్పష్టంగా, బలంగా లేదు అయితే మెజారిటేరియన్‌వాద తుఫానులో భారతీయ ఓటర్లు కొట్టుకుపోలేదు. వారు తమ లౌకికవాద విశ్వాసాలతో గట్టిగా నిలబడ్డారు. లౌకిక, ప్రజాస్వామిక భారత్ భద్ర భవిష్యత్తుకు భరోసానివ్వనప్పటికీ భారత రిపబ్లిక్ మహోన్నత స్ఫూర్తిని పునరుజ్జీవింపచేసేందుకు దోహదం చేసే రాజకీయాలకు అవసరమైన ఆధారాన్ని ఇటీవలి సంచలనాత్మక ప్రజా తీర్పు సమకూరుస్తోంది.



■ యోగేంద్ర యాదవ్

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

(ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ప్రముఖ విశ్లేషకుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్రయాదవ్ అందించిన ఆరు వ్యాసాల పరంపరలో ఇది చివరిది)



మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.7 కనిష్ఠం 24.2

అనుమానం పెనుభూతమై..
యువతిపై ప్రియుడి దాడి

8


విదేశాల్లో ఉద్యోగాలంటూ వల
రూ.60లక్షలతో గాయబ్



ఆఫీస్ టైం అవుతోంది.. ఆశా వర్కర్ల సమస్యలపై కోఠి డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని బీజేపీ నేతలు, కార్యకర్తలు ముట్టడించారు. ప్రధాన ద్వారం వద్ద నిరసనలు చేపట్టారు. దీంతో సిబ్బంది లోనికి వెళ్లే దారి లేక ఇంకోవైపు ఉన్న గేటును దూకి విధులకు హాజరయ్యారు.

ఏటీసీల నిర్మాణానికి భూమి పూజ

మల్లేపల్లిలో నిర్వహించిన సీఎం రేవంత్



విద్యార్థులకు అభివాదం చేస్తున్న రేవంత్ రెడ్డి, సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న విద్యార్థులు

మంగళ్‌హాట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఐటీఐ విద్యార్థులకు అత్యాధునిక పద్ధతుల్లో శిక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏటీసీ(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్)లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో మంత్రి శ్రీధర్ బాబు, పలువురు ఎమ్మెల్సీలు, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. 50 ఏళ్ల నాటి విద్యాబోధనల వల్ల నైపుణ్యం పెరగడం లేదని, అందుకే 65 ఐటీఐలను అధునాతనంగా తీర్చిదిద్దేందుకు, ఏటీసీలుగా మార్చేందుకు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. ఆరు రకాల దీర్ఘకాల కోర్సులతో పాటు 23 రకాల షార్ట్‌టర్మ్ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతల ఫిరోజ్‌ఖాన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌లతో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఎంఐఎం ఆందోళన

సీఎం రేవంత్ రెడ్డి మల్లేపల్లి ఐటీఐకి వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల్లో స్థానిక ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఫొటో లేదని పలువురు కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ప్రొటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్లపై వరద నీరు నిలవకుండా..
భూగర్భ సంపులు

గ్రేటర్‌లోని 12 ప్రాంతాల్లో నిర్మాణం

- మెరుగైన వరద నీటి నిర్వహణకు దోహదం
- రూ.8.07 కోట్ల అంచనా వ్యయం
- సర్కిళ్ల వారీగా టెండర్ ప్రకటించిన జీహెచ్ఎంసీ

సంపులు ఇక్కడ.. ప్రాంతం	సంపు సామర్థ్యం (లీటర్లలో)	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)
పీవీఎన్ఆర్ పిల్లర్-264	1.5 లక్షలు	128.00
కరోల్ బాగ్-ఏ	2 లక్షలు	47.00
నేతాజీనగర్	2 లక్షలు	64.75
రంగమహల్ జంక్షన్	1.5 లక్షలు	78.00
ఇమేజ్ ఆస్పత్రి, సోమాజిగూడ	1.5 లక్షలు	25.50
జోయ్ అలుకాస్ యూ టర్న్ సోమాజిగూడ	2 లక్షలు	25.50
రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద	25 వేలు	52.00
ద్వారక హోటల్, లక్డీకాపూల్	10 వేలు	33.00
ఓల్డ్ కేసీపీ	3 లక్షలు	85.00
ఆర్‌టీఏ ఆఫీస్ ఖైరతాబాద్	3 లక్షలు	85.00
లేక్ వ్యూ గెస్ట్ హౌస్	4 లక్షలు	138.00
ట్రాఫిక్ చెక్‌పోస్ట్ ఎదురుగా, అయ్యప్ప సొసైటీ	2.5 లక్షలు	47.00

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే గోదారుల్లా మారుతోన్న రహదారులపై మెరుగైన వరద నీటి నిర్వహణకు జీహెచ్ఎంసీ భిన్న మార్గాలను అన్వేషిస్తోంది. వరద నీరు నిలిచే పలు ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి గతంలో బాక్స్ డ్రైన్‌లు నిర్మించిన సంస్థ.. ఆ తరహా పరిష్కార చర్యలు చేపట్టలేని చోట భూగర్భ సంపుల నిర్మాణాన్ని ప్రతిపాదించింది. డ్రైన్లలోకి వెళ్లే అవకాశం లేక.. గంటల తరబడి రోడ్లపై వరద నీరు నిలిచే 12 ప్రాంతాలను అధికారులు గుర్తించారు. తొలి విడతలో ఆ ఏరియాల్లో సంపులు నిర్మించి.. వర్షపు నీరు వాటిలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తారు. సంపులో ఉండే మోటరు ద్వారా డ్రైన్లలోకి పంప్ చేస్తారు. ఆయా ప్రాంతాల్లో సంపుల నిర్మాణానికి రూ.8.08 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆరు పనుల కోసం మంగళవారం టెండర్ నోటిఫికేషన్ ప్రకటించారు. బిడ్‌ల దాఖలుకు 21వ తేదీ

మిగతా 8వ పేజీలో..


రోడ్డుపై నిలిచిన వరద నీటిని తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

సెల్లార్లు.. ప్రమాద ఘంటికలు!


సెట్‌బ్యాక్‌లు లేకుండా బంజారాహిల్స్‌లో ఇటీవల తవ్విన సెల్లార్

- ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- నిషేధం ఉన్నా యథేచ్ఛగా పనులు
- ప్రకటన విడుదల చేసి.. చోద్యం చూస్తోన్న యంత్రాంగం

8

నిషేధం ఉన్నా సెల్లార్ల తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొందరు నిర్మాణదారులు అధికారుల ఆదేశాలను ఖాతరు చేయడం లేదు. జీహెచ్ఎంసీ అధికారులే కదా.. ఏం చేస్తారులే అన్న ధీమానో, ప్రమాదాలు జరిగితే పొట్టకూటికి వచ్చే కార్మికుల ప్రాణాలకు, పొరుగున ఉన్న భవనాలకే కదా ముప్పు అన్న నిర్లక్ష్యమో కానీ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. వానాకాలం నేపథ్యంలో తవ్వకాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

చినుకు పడితే చీకటే!

- విద్యుత్‌లైన్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం
- ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోని అధికారులు
- చెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కవర్‌కండక్టర్ తీగలు

ఓవర్‌లోడ్‌తో తరచూ సమస్యలు

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షం పడితే చాలు.. కొన్ని ప్రాంతాల్లో గంటల కొద్దీ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత కురిసిన మూడు, నాలుగు వర్షాల్లోనూ ఇబ్బందులు తలెత్తాయి. సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో బీకేగూడ 60 ఫీట్ రోడ్‌లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సుమారు ఏడున్నర గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. ఈదురుగాలులకు భారీవృక్షాలు కూలి విద్యుత్‌తీగలు తెగిపోతే ప్రత్యామ్నాయ లైన్లనుంచి విద్యుత్ సరఫరా చేయాల్సిన యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్ట లేదు. చెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కవర్ కండక్టర్ విద్యుత్ తీగలను డిస్కం అందుబాటులోకి తెచ్చినా వర్షం పడినపుడు అంతరాయాలు తగ్గడం లేదు. గ్రేటర్‌లో 2 వేలకు పైగా ఫీడర్లు, వేల కిలోమీటర్లు విద్యుత్ లైన్లు ఉన్నా వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు నెలలుగా

మిగతా 8వ పేజీలో..

విపత్తుల వేళ ఆందోళన వద్దు

- ఉద్యోగులకు ప్రకాష్‌రెడ్డి సూచన

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినపుడు అప్రమత్తతతోపాటు చాకచక్యంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని జీహెచ్ఎంసీలోని ఈవీడీఎం డైరెక్టర్ ఎన్ ప్రకాష్‌రెడ్డి సూచించారు. ఆందోళన చెందకుండా సురక్షితంగా బయట పడేందుకు ఏం చేయాలనేది ఆలోచించాలన్నారు. మంగళవారం సలార్‌పురియా నాలెడ్జ్ సిటీలో జేపీ మోర్గాన్ సంస్థ నిర్వహించిన ఫైర్ అండ్ డిజాస్టర్ సేఫ్టీ వీక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ఏం చేయాలి..? ఏం చేయవద్దు..? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై పలు సూచనలు చేశారు. అన్ని సంస్థలు తమ ఉద్యోగులకు ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ప్రమాదాలు సంభవించినప్పుడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ వినియోగించే పరికరాలు, అవి ఎలా పని చేస్తాయన్నది సిబ్బంది వివరించారు.

ప్రజావాణి




ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులు సమర్పించేందుకు ప్రజలు క్యూ కట్టారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య వినతులు స్వీకరించారు.

రాగి + ఇనుము = బంగారం

సినిమా షూటింగ్‌ల కోసమంటూ భారీగా తయారీ

- అసలైన బంగారమంటూ విక్రయాలు
- రూ.కోట్లు కొల్లగొట్టి జల్సాలు
- ముఠా నాయకుడికి ఇంద్రభవనం లాంటి ఇల్లు
- పిల్లల ఫీజులకు రూ. 16 లక్షలు చెల్లింపు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ గోల్డ్‌ను చూపిస్తున్న సీపీ తరుణ్‌జోషి

హైదరాబాద్ సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): 'కస్టమ్స్ వారు సీజ్ చేసిన బంగారం.. అతి తక్కువ ధరకే విక్రయం' అంటూ నకిలీ బంగారాన్ని అంటగడుతున్న ముఠా మోసాల తీరును చూస్తే విస్తుపోవాల్సిందే. రాచకొండ పోలీసులు అరెస్టు చేసినన ముఠా నాయకుడు విజయ్‌కుమార్, అతడి అనుచరులు సెంథిల్, హరీష్, ఓం సాయికిరీటీల నకిలీ లీలలు మామూలుగా లేవు. విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.


పంజాబ్‌లో తయారీ..

సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేసిన నిందితులు పంజాబ్‌లో నకిలీ బంగారం తయారు చేయిస్తున్నట్లు తెలిసింది. ఇనుము, రాగిని కలిపి బంగారు బిస్కెట్లుగా మార్చి వాటిపైన గోల్డ్ కోటింగ్ వేయించినట్లు పోలీసులు గుర్తించారు. సినిమా షూటింగ్‌ల్లో వినియోగించడానికని వాటిని తయారు చేయించినట్లు గుర్తించారు. వారి వద్ద కోట్ల రూపాయల నకిలీ కరెన్సీని సైతం పోలీసులు కనుగొన్నారు. వాటిని కూడా సినిమా షూటింగ్‌ల పేరు చెప్పి తయారు చేయించినట్లు తెలిసింది. అయితే నకిలీ కరెన్సీని నిందితులు ఎక్కడా చెలామణి చేయకపోవడం గమనార్హం. కేవలం బంగారం కొనుగోలు చేయడానికి వచ్చిన కస్టమర్లను బురిడీ కొట్టించడానికి మాత్రమే ఆకర్షణగా పెడుతున్నారు. తన ముఠాలోని కొంతమంది బంగారం కొనడానికి వచ్చిన కస్టమర్లలా నటించి కేజీలకొద్దీ బంగారం కొనుగోలు చేస్తారు. నిజంగానే కొనడానికి వచ్చిన వారు అదంతా చూసి బంగారం అయిపోతుందని భావించి కొనేలా ప్లాన్ చేస్తారు. అనంతరం బంగారం కొన్నవారిని ముఠాలోని ఇతర సభ్యులు ఫాలో చేస్తారు. పోలీస్‌డ్రెస్‌లు వేసుకొని మార్గమధ్యలో వారిని అడ్డుకుంటారు. పోలీసుల్లా వాహన తనిఖీలు చేస్తూ, ఎలాంటి రసీదు లేకుండా ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకుంటారు. దొంగ బంగారం విక్రయిస్తున్నట్లు కేసులు పెట్టి జైలు నుంచి బయటకు రాకుండా చేస్తామని బెదిరించి ఆ బంగారంతో ఉడాయిస్తారని పోలీసుల విచారణలో తేలింది. అప్పనంగా కోట్ల రూపాయల డబ్బులు కొట్టేయడంతో పాటు, వారు విక్రయించిన నకిలీ బంగారాన్ని కూడా తిరిగి వారే కొట్టేస్తున్నారు. వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించి పిల్లలకు చదువులు

ముఠా నాయకుడు కాడెద్దుల విజయ్‌కుమార్ అలియాస్ కృష్ణమోహన్ చౌదరిని విచారించిన పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిసినట్లు సమాచారం. అతనికి ముగ్గురు పిల్లలు. నెల్లూరు జిల్లా కావలిలో అతడికి రౌడీషీటర్‌గా పేరుండటం, కేసులు నమోదు కావడంతో పిల్లల చదువును చెన్నైకి మార్చినట్లు గుర్తించారు. ఖరీదైన కార్పొరేట్ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఒక్కొక్కరికి రూ. 8లక్షల చొప్పున ఇద్దరు పిల్లలకు ఫీజులు చెల్లించినట్లు తేలింది. ఆ డబ్బంతా ఇలా నకిలీ గోల్డ్ దందాలో కస్టమర్లను మోసం చేసి కొల్లగొట్టిన కోట్ల రూపాయలేనని పోలీసులు గుర్తించారు. ఆ డబ్బును కూడా రికవరీ చేయడానికి పోలీసులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. అంతేకాదు కావలిలో ఇంద్రభవనం లాంటి పెద్ద ఇల్లు నిర్మించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ దందాలో ఇప్పటి వరకు ఎంతమందిని మోసం చేశాడు..? ఎన్ని కోట్లు సంపాదించాడు..? ఎక్కడెక్కడ ఆస్తులు కొనుగోలు చేశాడు..? అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.









నీట్ అవకతవకలపై విద్యార్థి, యువజన సంఘాలు గళమెత్తాయి. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ 'స్టూడెంట్ మార్చ్' పేరిట నగరంలోని నారాయణగూడ నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు చేపట్టిన భారీ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సౌకర్యాలను మెరుగుపర్చాలని, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావెద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని చాలాప్రాంతాల్లోని వసతి గృహాల్లో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయని, తాగునీటి ఇబ్బందులతో విద్యార్థులు సతమతమవుతున్నారని ఆరోపించారు.

భవనంపై నుంచి పడి ఇంటర్ విద్యార్థి మృతి


బౌద్ధనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో భవనంపై నుంచి పడి ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టుగూడలో నివసించే బీఆర్ఎస్ నాయకుడు రాపోల్ సురేష్ కుమారుడు రాహుల్(17) ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి పది గంటల సమయంలో తన ఇంటి భవనం ఐదో అంతస్తులోని రూప్‌టాప్‌పైకి వెళ్లి నలుగురు స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. కిందకు దిగుతుండగా ఐదో అంతస్తు నుంచి మొదటి అంతస్తులో పడిపోయాడు. నలుగురు స్నేహితులు భయంతో అక్కడి నుంచి పారిపోయారు. రాహుల్‌ను తండ్రి సురేష్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నలుగురు స్నేహితులను అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ మృతదేహానికి సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్, యువనాయకుడు రామేశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ సునీత నివాళులర్పించారు.


రాహుల్ (ఫైల్)


















పత్రీజీ ధ్యాన మహాయజ్ఞంలో పాల్గొన్న ధ్యానులు

కనులపండువగా పత్రీజీ ధ్యాన మహాయజ్ఞం

అఫ్జల్‌గంజ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పత్రీజీ ధ్యాన మహాయజ్ఞం డాక్టర్ సంజయ్‌సింగ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా కనులపండువగా కొనసాగుతుంది. పత్రీజీ ధ్యాన మహాయజ్ఞం కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ధ్యానులు పాల్గొని భక్తులకు పలు సూచనలు అందజేశారు. సొసైటీ సభ్యులు డాక్టర్ సంజయ్‌సింగ్, పిరమిడ్ సొసైటీ కార్యకలాపాల ట్రస్టీ విజయ్‌భాస్కర్ రెడ్డి, సుధీర్‌షా మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో యోగా డే నిర్వహిస్తామన్నారు.


వాకర్లకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు. చిత్రంలో మనీలాల్ షా

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

గోషామహల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నేటి యంత్రిక జీవితంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని టీపీసీసీ కార్యాదర్శి మనీలాల్ షా సూచించారు. మంగళవారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో రెనోవా సెంచరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది వాకర్లు బీపీ, షుగర్, ఇతరాత్ర సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మనీలాల్ షా మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వహించడంతో గుండె, ఇతర వ్యాధులతో చిన్న వయస్సులోనే చనిపోతున్నారని.. అలాంటి వారు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రవివర్మ, వి. రాణి, కైలాష్ అగర్వాల్ పాల్గొన్నారు.

మైసిగండి ఆలయానికి 24 ఫ్యాన్లు అందజేత

అఫ్జల్‌గంజ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన ఆమన్‌గల్ మైసిగండి ఆలయానికి 24 ఫ్యాన్లను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ ఉపాధ్యక్షులు మాడిశెట్టి సదానందం గుప్తా అందజేశారు. మంగళవారం ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం వనమాల రామస్వామిగుప్తా, బొజ్జ వెంకటేశం గుప్తా, టి.హనుమంతు, రాజన్‌సింగ్, రాజ్‌కుమార్, జగపతి, అజయ్‌లతో కలిసి ఆలయ కమిటీ ప్రతినిధులకు ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా సదానంద్‌గుప్తా మాట్లాడుతూ... గతంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన మాకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఫ్యాన్లు అందజేయాలని కోరారు. వారి అభ్యర్థన మేరకు ఫ్యాన్లను అందజేశామని వారు తెలిపారు.

మేక మాంసం ఇస్తామని మోసం

- కిద్మత్ ఫౌండేషన్‌పై పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

అఫ్జల్‌గంజ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ రోజున ఇంటింటికీ మేక మాంసాన్ని పంపిస్తామంటూ అమాయకులను నమ్మించి లక్షలు వసూలు చేసిన కిద్మత్ ఫౌండేషన్‌పై బాధితులు హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు సంస్థపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు కథనం ప్రకారం.. బక్రీద్ పండుగ నేపథ్యంలో కిద్మత్ ఫౌండేషన్ మేక మాంసాన్ని వధిస్తామని ప్రకటించింది. అందులో కొంత భాగాన్ని అందజేస్తామని చెప్పి పలువురి నుంచి రూ.8 లక్షలకు పైగా వసూలు చేసింది. పండుగ పూట మీ ఇళ్లకు వచ్చి తామే మాంసం పంచుతామని చెప్పింది. ఇందులో భాగంగా వారం రోజుల క్రితం నగరంలోని మల్లేపల్లి, పాతబస్తీ ఇహనుమా, ఫలక్‌నుమా, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు పెట్టి ప్రచారం చేసింది. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించిన వారికి మాంసాన్ని సరఫరా చేస్తామని నమ్మించారు. దీంతో కొంతమంది నుంచి రూ. 2,300 నుంచి రూ. 2,800 వరకు ఫౌండేషన్‌కు ఆన్‌లైన్‌లో చెల్లించారు. అయితే సదరు ఫౌండేషన్ నిర్వాహకులు డబ్బులు తీసుకుని పారిపోయారు. విషయం తెలుసుకున్న బాధితులు మంగళవారం హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ సంఘటనలో ఇప్పటివరకు 80 మందికి పైగా బాధితులు ఫిర్యాదు చేసినట్లు హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


రోడ్డుపై కొండ చిలువ... ఇన్‌సెట్‌లో పట్టుకుంటున్న స్నేక్‌సెల్ ప్రతినిధి

మణికొండలో 'అనకొండ'

- తిరుమల హిల్స్ కాలనీలో 12 అడుగుల భారీ కొండచిలువ
- అరగంట పాటు శ్రమించి పట్టుకున్న స్నేక్‌సెల్ ప్రతినిధి

నార్సింగ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మణికొండ మున్సిపాలిటీ తిరుమల హిల్స్ కాలనీలో కొండచిలువ హల్‌చల్ చేసింది. మంగళవారం ఉదయం ఇళ్ల మధ్యకు వచ్చిన 12 అడుగుల కొండచిలువను చూసి జనాలు హడలెత్తిపోయారు. వెంటనే స్నేక్ ఫ్రెండ్స్ సెల్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే స్నేక్ సెల్ ప్రతినిధి అవినాశ్ ఆధ్వర్యంలోని బృందం అక్కడకు చేరుకున్నారు. అది భారీ పాము కావడంతో పట్టుకునేందుకు చాలా కష్టపడ్డారు. కొండచిలువను పట్టుకునే క్రమంలో అది స్నేక్ సెల్ ప్రతినిధిపై దాడిచేసే ప్రయత్నం చేసింది. చివరకు అరగంట శ్రమించి కొండచిలువను ఒక సంచిలో బంధించి తీసుకెళ్లారు. వర్షాకాలంలో పాములు బయటకు వస్తాయని వాటని చూసి భయపడొద్దని, తమకు సమాచారం ఇవ్వాలని స్నేక్ సెల్ ప్రతినిధి తెలిపారు.

జూలై 19 నుంచి లాల్‌దర్వాజా బోనాలు

పాతబస్తీలో ముస్తాబవుతున్న ఆలయాలు

చాంద్రాయణగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా, ప్రతిష్ఠాత్మకంగా జరుపుకునే పాతబస్తీ లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీమహంకాళి బోనాల ఉత్సవాలు జులై 19న ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయ కమిటీ చైర్మన్‌గా మాజీ కార్పొరేటర్ సి.రాజేందర్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఆలయానికి రంగులు వేసే కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ ఇటీవల ఆలయ గోడలపై ఓంకారం పెయింటింగ్ వేసి రంగులు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బోనాల ఉత్సవాలకు ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించనున్నారు. జులై 19 నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాలలో తొలి రోజున గణపతిహోమం, సప్తశతి పారాయణం, దేవీ అభిషేకం నగర పోలీస్ కమిషనర్, గ్రేటర్ కమిషనర్ చేతుల మీదుగా ధ్వజారోహణ, శిఖరపూజ చేయడం ఆనవాయితీ. సాయంత్రం కలశ స్థాపనతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమవుతాయి. 29న పోతరాజు స్వాగతం, అమ్మవారి భవిష్యవాణిని వినిపించే రంగం, ఊరేగింపుతో ఉత్సవాలు ముగియనున్నాయి. లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీమహంకాళి ఆలయ దశాబ్ది బోనాల ఉత్సవాలు జులై 8 నుంచి 10 వరకు ఢిల్లీలో జరగనున్నాయి.


లాల్‌దర్వాజ ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం


ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీమహంకాళి ఆలయం 116వ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు, బోనం ఎత్తుకుని వచ్చే మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ యేడాది బోనాల ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నాం.

\- ఆలయ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్

బోనాల పండుగకు ముందే ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలి

చాంద్రాయణగుట్ట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ కోరారు. మంగళవారం దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పండరీనాథ్ మాట్లాడుతూ, అనేక ఆలయాల వద్ద సమస్యలు తిష్టవేశాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. సీసీ రోడ్లు, దేవాలయాలకు రంగులు, విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదరి చంద్రశేఖర్, మధుసూదన్, లక్ష్మణ్, రవి, ఎం.వేణు, ఫజల్, నరేశ్ తదితరులున్నారు.


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు


గోల్కొండ కోటపై అమ్మవారి దేవాలయం

మరో వారంలో బోనాలు

- జూలై 7న గోల్కొండ ఎల్లమ్మకు తొలి బోనం
- ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయని ప్రభుత్వం

కార్వాన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బోనాలు మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. తెలంగాణ సంప్రదాయం ప్రకారం జూలై 7న గోల్కొండ ఎల్లమ్మకు మొదటి బోనం సమర్పిస్తారు. నెల రోజులపాటు బోనాల ఉత్సవాలను నిర్వహిస్తూ ఉంటారు. అయితే నేటి వరకు చారిత్రక గోల్కొండ బోనాల ఉత్సవాలకు సంబంధించి ప్రభుత్వం ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయలేదు. మిగతా ఆలయాలకు భిన్నంగా ఇక్కడ ట్రస్టు బోర్డు పని ఎక్కువ. దేవాదాయ శాఖ తరఫున ఈవో మాత్రమే ఉంటారు. ట్రస్టు బోర్డు చైర్మన్, సభ్యులు, వంశపారంపర్యపరంగా వచ్చే కులవృత్తుల వారు ఈ బోనాలకు తమ తమ పనులు చేస్తుంటారు. అయితే వీటన్నిటికీ ట్రస్టు బోర్డే నాయకత్వం వహిస్తుంది. దీంతో ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయకపోవడం పెద్ద సమస్యగా మారింది.

కాగా, ట్రస్టు బోర్డు చచైర్మన్ తమకు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శోభాపాండే, చంటిబాబు, అరవింద్ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలకు, దేవాదాయ శాఖ కమిషనర్‌కు అర్జీలు పెట్టుకున్నారు. అయినా ఇంతవరకు ఆ ఫైల్ ముందుకు కదలలేదు. చైర్మన్‌తోపాటు పది మందిని సభ్యులను కూడా నియమించాల్సి ఉంది. బోనాలకు సమయం దగ్గర పడుతున్నందున వెంటనే ట్రస్టు బోర్డును ప్రకటించాలని స్థానిక భక్తులు కోరుతున్నారు.

ఆశా వర్కర్ల జీతాన్ని రూ.18 వేలకు పెంచాలి: శిల్పారెడ్డి


డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న శిల్పారెడ్డి తదితరులు

మంగళ్‌హట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఆశా వర్కర్ల జీతాలను పెంచాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న జీతాన్ని రూ.9 వేల నుంచి రూ.18 వేల వరకు పెంచాలని ఆమె అన్నారు. మంగళవారం బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షులు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో నాయకులతో కలిసి కోఠిలోని డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో ఆందోళనకు దిగి కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడికి యత్నించారు. పోలీసులు గేట్లను మూసి వేయడంతో వారు రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా రాష్ట్రవ్యాప్తంగా 24 వేల మంది ఆశావర్కర్లు సేవలు అందిస్తున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చేయడం, సర్వేలు చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందించేందుకు చేస్తున్న వెలకట్టలేనివన్నారు. అలాంటి వారి న్యాయమైన డిమాండ్‌లను నేరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. వెటర్నల్ హెల్త్ న్యూట్రీషియన్ జాయింట్ డైరెక్టర్, ఆశా నోడల్ అధికారికి డాక్టర్ పద్మజాకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

వ్యవసాయ వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలి: విద్యాసాగర్

రాజేంద్రనగర్, జూన్18 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో కొంతకాలంగా పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్(టాసా) అధ్యక్షుడు డాక్టర్ బి.విద్యాసాగర్ అన్నారు. వర్సిటీకి పూర్తిస్థాయి పాలకవర్గం, ఉన్నతాధికారులు, శాశ్వత ఉపకులపతి లేకపోవడమే కారణమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జయశంకర్ వ్యవసాయ వర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. 'వైస్ చైర్మన్ నియామకం చేస్తామని రెండేళ్ల నుంచి చెబుతూ కాలయాపన చేస్తుండడం వలన వర్సిటీలో చాలా సమస్యలు ఉన్నాయి. ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రావడం లేదన్నారు. హెల్త్ సెంటర్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. క్యాంపస్‌లోకి ఆర్టీసీ బస్సులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని' అన్నారు. సిబ్బంది ట్రాన్స్‌ఫర్‌లు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగినా, హాస్టళ్లలో వారికి అవసరమైన సదుపాయాలు లేవన్నారు. ఇప్పటికే పలువురు ఉద్యోగులు పదవీ విరమణ పొందగా, బోధన, బోధనేతర సిబ్బంది సంఖ్య తగ్గిందన్నారు. ఈ నెలాఖరుకు ఇద్దరు వర్సిటీ అధికారులు డీన్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ పదవీ విరమణ పొందుతున్నారన్నారు. ఈ పోస్టులను కొత్త వారితో భర్తీ చేస్తారా.. పాతవారికి ఇచ్చి ఇన్‌చార్జీల పాలనతో నడుపుతారో తెలియని పరిస్థితి. ఈ సమస్యలు అన్నింటి పరిష్కారానికి వీసీని నియమించి నాణ్యమైన సేవలను వర్సిటీ ద్వారా రైతులకు అందించాలన్నారు. తక్షణమే వైస్‌చాన్స్‌లర్‌తోపాటు పూర్తిస్థాయి పాలకవర్గం, శాశ్వత ప్రతిపాదికన అధికారులను నియమించాలని ఆయన కోరారు.

సమాజాన్ని కదిలించే రచనలు రావాలి

- తొలకరి చినుకులు పుస్తకావిష్కరణలో వక్తలు

రవీంద్రభారతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నల్లని సిరాక్షరాలతో హృదయాల్ని కదిలించేలా కవిత్వీకరించారని వక్తలు అభివర్ణించారు. మంగళవారం రవీంద్రభారతిలో కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి, కవి డా.సింగూరు నరేంద్రబాబు కలం నుంచి జాలువారిన తొలి కవితా సంపుటి 'తొలకరి చినుకులు' పుస్తకావిష్కరణ సభ జరిగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ, నాటక రచయిత ఆకెళ్ల శివప్రసాద్, వై.ఎ్ ఎ.ఆర్.శర్మ, మరంగంటి శ్రీనివాస్, పొత్తూరి సీతారామరాజు, దైవజ్ఞశర్మ, చంద్రశేఖర్ ఆజాద్, తిరునగరి శ్రీనివాస్, శైలజామిత్ర లహరి తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజాన్ని కదిలించే కవిత్వం రచించారని కొనియాడారు. ఇలాంటి రచనలు మరిన్ని జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురుసాహితీవేత్తలు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నిరుపేదలకు అండగా నిలవాలి: కేవీ రమణాచారి

రవీంద్రభారతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు, దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం అఖిలభారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో లోకల్ ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(ఎల్‌పీడీవో) అధ్యక్షుడు భరత్ సంగం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి నిరుపేదలకు, దివ్యాంగులకు కేవీఆర్ కిట్‌లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని అన్నారు. ఎంతో మంది అనాథలైన అభాగ్యులకు అండగా నిలవాల్సిన అవసరముందని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈతరం యువత ముందుకు రావాలని కోరారు. దివ్యాంగులపై సానుభూతి కాద సహకారం కాదు సమాన హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో సెట్విన్ మాజీ ఎండీ వైద్యనాథ్, వసుంధర, కన్నారావు, వీఆర్. శ్రీనివాస్, మాయ బ్రహ్మం మహంకాళి రవీందర్, శ్రీను, శంకర్, బాలకృష్ణ, గోవింద్, గంగమ్మ, సమంత, అలివేలు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు కేవీఆర్ కిట్‌లను ప్రదానం చేస్తున్న కేవీ రమణాచారి

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/u9HFtkLలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

మదీన, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇంటినుంచి వెళ్లిన ఇద్దరు బాలికలు కనిపించకుండా పోయారు. ఈ ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అస్గర్ అలీ భార్య, కుమార్తె షీరిన్ సుల్తాన(15)తో కలిసి ఘాజిమిల్లత్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. షేక్ షరీఫ్ భార్య, కుమార్తె యాస్మీన్ ఫాతిమా(13) అదే కాలనీలో పది రోజుల క్రితం వచ్చి అద్దెకు ఉంటున్నాడు. ఇద్దరు బాలికల మధ్య పరిచయం ఏర్పడింది. బక్రీద్ పండుగకు దుస్తులు కుట్టించుకుంటామని ఈ నెల 15న టైలర్ షాపునకు వెళ్తున్నామని బయటకు వెళ్లి తిరిగిరాలేదు. రాత్రి అయినా రాకపోవడంతో రెండు రోజుల నుంచి వారి తల్లిదండ్రులు అన్ని చోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87125 71899 ఫోన్ నంబర్‌లో సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అడ్డగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాండు వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని 50ఏళ్ల వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో రోడ్డుపై పడి ఉండగా వైద్య పరీక్షల నిమిత్తం అతనిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి మరణించాడని పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే వెంటనే 8712660248 నెంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరొకరు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో అపస్మారకస్థితిలో పడివున్న ఓ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 9లో మంగళారం ఉదయం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 45ఏళ్ల వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని వైద్యపరీక్షల నివిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

సమస్యలు తెలుసుకోరు.. ఫోన్ చేస్తే స్పందించరు

- ప్రభుత్వ అధికారుల తీరుపై కాలనీల వాసుల నిటూర్పు
- సమస్యల పై శంఖారావంలో తాగునీరు డ్రైనేజీపై ఫిర్యాదుల వెల్లువ

బంజారాహిల్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మురుగు నీరు రోడ్లను ముంచెత్తుతోంది.. తాగునీటి సరఫరా సరిగా ఉండదు.. సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో అర్థం కావడం లేదు.. ఫోన్ చేస్తే స్పందించేవారే కరువయ్యారంటూ కాలనీల వాసులు ప్రభుత్వాధికారుల తీరుపై నిటూర్చారు. అధికారుల మధ్య సమన్వయ లోపం తమకు శాపంగా మారుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ ప్రాంతాల ఇబ్బందులు తెలుసుకునేందుకు మంగళవారం కమలాపురి కాలనీ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో మస్యలపై శంఖారావం జరిగింది. వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. తాగునీరు, రోడ్లపై మురుగునీరు ప్రవహించడంపై స్థానికులు పెద్దఎత్తున ఫిర్యాదులు చేశారు. నవోదయకాలనీ, ఎల్లారెడ్డిగూడ, ఇంజనీర్స్‌కాలనీ, ఎల్ఐసీ కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల తరుచూ డ్రైనేజీలు లీకవుతున్నాయని, పైపులైన్ సామర్థ్యం పెంచడం లేదా కొత్త పైపులైన్ వేయాలని విజ్ఞప్తి చేశారు. ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. పార్కు నిర్వహణ ఖర్చులను జీహెచ్ఎంసీ ఇవ్వడం లేదని ప్రగతినగర్ వాసులు చెప్పారు. తమ కాలనీలో పోలీస్ ఔట్ పోస్టు ఉందని, గతంలో బంజారాహిల్స్ ఠాణా నుంచి ఇటీవల జూబ్లీహిల్స్‌కు మారిందన్నారు. బాధ్యతలు బదిలీ కాకపోవడంతో కాలనీలో సీసీ కెమెరాలు పెట్టుకున్నా వాటి మానిటరింగ్‌లో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జలమండలి సిబ్బంది మీటర్ రీడింగ్ తీసుకోకుండా ఇష్టానుసారంగా బిల్లులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు సమస్య పరిష్కరిస్తామన్నారు. కృష్ణానగర్‌లో తాగునీటి సరఫరా లోప్రెషర్‌తో వస్తుందని, కేవలం 45 నిమిషాలు మాత్రమే సరఫరా చేస్తున్నారని బస్తీవాసులు ఆరోపించారు. మారుతీనగర్‌లో రోడ్లు శిథిలావస్థకు చేరాయని ఫిర్యాదు చేశారు.

నిధుల కోసం ప్రతిపాదన

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. సమస్యలపై శంఖారావంలో వచ్చిన ఫిర్యాదులపై నివేదిక రూపొందించి నిధుల కోసం ప్రతిపాదన చేయనున్నట్లు తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు అధికారులతో 15 రోజులకొకసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. మిగతా డివిజన్‌లలో కూడా త్వరలో సమస్యలపై శంఖారావం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, జీహెచ్ఎంసీ డీసీ ఎస్లావత్‌నాయక్, ఏఈ భరత్‌కుమార్, జలమండలి మేనేజర్ శ్యాంకుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాణి, ట్రాన్స్‌కో ఏఈ నరేందర్, పలు కాలనీల సంక్షేమ సమితి నాయకులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి

అధ్వానంగా మారిన బుద్వేల్, శ్రీశివసాయి కాలనీలు


బుద్వేల్ వికాస్ స్కూల్ వద్ద రోడ్డుపై గుంతలు

రాజేంద్రనగర్, జూన్18(ఆంధ్రజ్యోతి): రోడ్లు అధ్వానంగా మారాయని బుద్వేల్, శ్రీశివసాయి కాలనీ వాసులు వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు. బుద్వేల్ శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయం పక్క నుంచి వికాస్ స్కూల్ మీదుగా బొద్రాయి, శ్రీకుసుమ హరనాథ బాబా మందిరం, శ్రీశృంగేరీ శంకరమఠం నుంచి శ్రీ శివసాయి కాలనీ వరకు రోడ్లపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వెంటనే గుంతల పడిన రోడ్లకు మరమ్మతులు చేయాలని శ్రీశివసాయి కాలనీసంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.గోపాల్‌రెడ్డి కోరారు. వికాస్ స్కూల్ వద్ద రోడ్డు మరి అధ్వానంగా ఉందని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. వర్షాలు పడినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, వెంటనే అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.


శివసాయి కాలనీ మలుపు వద్ద తవ్వి వదిలేసిన రోడ్డు



డాక్టర్ ప్రభాశంకర్‌ను సత్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

గోషామహల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేవలం విద్య మాత్రమే సమాజాన్ని, దేశాన్ని మారుస్తుందని.. ఆ దిశగా విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో వనితా మహావిద్యాలయ ఫార్మసీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని.. ఆ దిశగా విద్యార్థులు రాణించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన పలువురు విద్యార్థులకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో చదువుతున్న విద్యార్థులు, సొసైటీకి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ డి.గంగాధర్‌రావు, బి.ఎన్.రాజేశ్వర్ రావు, జి.వి.రంగారెడ్డి, సొసైటీ సెక్రటరీ బి.హనుమంత్‌రావు, డాక్టర్ ఎన్.శ్రీనివాస్, టి.మమత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఉత్పాదక పౌరులుగా తీర్చిదిద్దాలి

● ఏఎంఎఫ్ ట్రస్టీ, బాహుబలి నిర్మాత శోబు యార్లగడ్డ



పారా సైక్లింగ్‌లో ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తున్న నిర్మాత శోబు యార్లగడ్డ

రాయదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ఉత్పాదక పౌరులుగా తీర్చిదిద్దాలని ఏఎంఎఫ్ ట్రస్టీ, బాహుబలి నిర్మాత, ఆర్కా మీడియా సీఈవో శోబు యార్లగడ్డ అన్నారు. దివ్యాంగుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్), జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని జేఎన్‌వీ రంగారెడ్డి క్యాంపస్‌లో నిర్వహిస్తున్న పారాస్పోర్ట్స్ ప్రత్యేక అవసరాల పిల్లల శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. ఆదిత్య మెహతా ఫౌండేషన్ కోచ్, వ్యవస్థాపకుడు ఆదిత్య మెహతా మాట్లాడుతూ ఈ శిబిరం దివ్యాంగ పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు సహాయపడిందని, 28పారా స్పోర్ట్స్‌లో పిల్లలను పరీక్షించామన్నారు. ఈ శిబిరం నుంచి 181మంది పిల్లలను ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ మాట్లాడారు. అనంతరం పారా సైక్లిస్టులను సత్కరించారు. ఆసియా పారా సైక్లింగ్ చాంపియన్ షిప్-2024లో పతకాలు సాధించిన పారా సైక్లిస్టులను శోబు యార్లగడ్డ సత్కరించారు.

విశ్వకర్మలపై వేధింపులు ఆపాలి

- కర్ర పని వారిపై, సామిల్లపై, స్వర్ణకారులపై కేసులు సరికాదు
- ఇందిరాపార్కు వద్ద విశ్వకర్మ సంఘం నేత ఆమరణ దీక్ష
- కొండోజు దీక్షకు బీసీ సంఘాల మద్దతు



విశ్వకర్మ సంఘం నాయకుల ఆమరణ నిరాహారదీక్షకు మద్దతు తెలియజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, కుందారం గణేష్‌చారి, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నరసింహాచారి తదితరులు

కవాడిగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులపైనా, సామిల్స్ (కట్టెకోత విభాగం)పైనా ఫారెస్ట్ అధికారుల వేధింపులు నిలిపివేయాలని పలు బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకార వృత్తిదారులను, బంగారం వ్యాపారస్తులను అక్రమ, దొంగ బంగారం కేసుల పేరుతో వేధింపులను ఆపివేయాలని అన్నారు. పోలీసుల వేధింపులను నిరసిస్తూ మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద విశ్వకర్మ సంఘం నాయకులు కొండోజు నరసింహాచారి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కులాల ఐక్యవేదిక చైర్మన్ కుందారం గణేష్‌చారి, విశ్వకర్మ సంఘం నాయకులు కౌలే జగన్నాథం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విశ్వకర్మ సామాజికవర్గానికి అన్యాయం చేయకుండా న్యాయమైన సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి చేయూతనివ్వాలని అన్నారు. విశ్వకర్మల జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించి కనుమరుగైన విశ్వకర్మ చేతి వృత్తిదారులను ప్రోత్సహించి ఆదుకోవాలని కోరారు.

కార్పెంటర్ వృత్తిదారులను ఫారెస్ట్ అధికారులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కొత్త చట్టాలను రూపొందించి, రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణలో అక్రమ దొంగ బంగారం కేసులో స్వర్ణకారుల వద్ద, వ్యాపారస్తుల వద్ద బంగారం రికవరీల పేరుతో కేసు నమోదుచేసి దొంగలతో పాటు విశ్వకర్మలను కూడా జైలుకు పంపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ రాష్ట్ర నాయకులు కన్నెకంటి సత్యం, సోమోజు శ్యామ్‌ప్రసాద్, బొట్టు శ్రీనివాస్, పట్నాల సావిత్రి, సిద్ధాంతం శ్యామల, నాగరాజు తదితరులతో పాటు తెలంగాణ వ్యాప్తంగా వచ్చిన విశ్వకర్మలు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్

● ప్రభుత్వ వైఖరికి నిరసనగా 20న మహాధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

పంజాగుట్ట, జూన్18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. ప్రభుత్వం మొండి వైఖరికి పోకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ ఖాళీల భర్తీ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక వ్యవస్థాపకుడు, అశోక్ ఆన్‌లైన్ అకాడమీ నిర్వాహకుడు పాలకూరి అశోక్‌కుమార్, నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు నీల వెంకటేష్, బక్క జడ్సన్, అన్వర్, నిరుద్యోగులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని ఆర్.కృష్ణయ్య గుర్తు చేశారు. బీఆర్ఎస్ మీద ఉన్న కోపంతో నిరుద్యోగులు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే నేటికి ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం, ఒక్క పోస్టు ఖాళీని భర్తీ చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తన మొండివైఖరి విడనాడాలని, నిరుద్యోగులు తిరుగుబాటు చేయక ముందే ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఎన్నికల ముందు, మేనిఫెస్టోలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నామని అశోక్‌కుమార్ తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్, వెంకటరెడ్డి, విజ్ఞానదర్శిని రమేష్, బాలబ్రహ్మాచారి తదితరులు

సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులివ్వాలి

● ఆర్ఎంపీ, పీఎంపీల ఉమ్మడి వేదిక డిమాండ్

నల్లకుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీలకు వెంటనే శిక్షణ కల్పించి సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను ఇవ్వాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి వేదిక నేతలు విజ్ఞానదర్శిని రమేష్, చప్పరి శంకర్ ముదిరాజ్, ఎస్. వెంకటరెడ్డి, బాలబ్రహ్మాచారి, గట్టు రమాశంకర్, భాస్కర్, రవిశంకర్, మోహన్, శంకర్ ఉమేష్, ఎం. డి. హుస్సేన్ తదితరులు మాట్లాడారు. 2008 వైఎస్ హయంలో జీవో 1273 ద్వారా ఆర్ఎంపీ, పీఎంపీలందరికీ కమ్యూనిటీ పారామెడిక్స్ గా శిక్షణ ఏర్పాటు చేసి 13 వేల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. నాడు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నేటికీ కూడా సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. దీంతో ఆర్ఎంపీ, పీఎంపీ కుటుంబాలు అభద్రతలో జీవిస్తున్నాయని వాపోయారు. మెడికల్ కౌన్సిల్ అధికారులు తమపై దాడులు చేసి కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పలుచోట్ల ఆర్ఎంపీ, పీఎంపీలపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

● అంతర్జాతీయ యోగా ట్రైనర్ సిమ్రాన్ అహుజా



అభ్యాసకులతో కలిసి యోగాసనం వేస్తున్న సిమ్రాన్

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు యోగా దోహద పడుతుందని మాజీ మిస్ ఇండియా, అంతర్జాతీయ యోగా ట్రైనర్ సిమ్రాన్ అహుజా అన్నారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయంటే అందుకు యోగా కూడా ఒక కారణమని ఆమె అన్నారు. బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమెరికా లాంటి దేశాలలో ఫిట్‌నెస్ కోసం యోగాను ఓ మార్గంగా ఎంచుకున్నారని, మరి కొన్ని దేశాలు అధునాతన వ్యాయామాలకు బదులుగా యోగానే అనుసరిస్తున్నాయని తెలిపారు. అనంతరం కొన్ని యోగాసనాలను అభ్యాసకులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కంట్రీక్లబ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్‌రెడ్డితో కలిసి సంస్థ సభ్యత్వ కార్డును సిమ్రన్ విడుదల చేశారు.

చినుకు పడితే చీకటే!

(5వ పేజీ తరువాయి)

విద్యుత్ డిమాండ్ ఉన్న నేపథ్యంలో లైన్‌క్లియరెన్స్(ఎల్‌సీ)లకు అనుమతులివ్వకపోవడంతో ట్రీ కట్టింగ్ పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై ఓవర్‌లోడ్ పడుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

ఈదురుగాలులకు వణికిపోతున్న వ్యవస్థ

ఈదురుగాలులకు గ్రేటర్‌లో విద్యుత్ వ్యవస్థ వణిపోతున్నది. వర్షం పడితే చాలు ఏ ప్రాంతంలో ఎన్ని గంటలు కరెంటు సరఫరా నిలిచిపోతుందో అర్థం కావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 కూడా సరిగా పనిచేయడం లేదంటూ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. బోయిన్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్, బాచుపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఓల్టేజీ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నా, పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల నివారణ, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటుచేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

అనుమానం పెనుభూతమై..
యువతిపై ప్రియుడి దాడి

చాంద్రాయణగుట్ట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనుమానం పెనుభూతమైంది. మరొకరితో చనువుగా ఉంటుందన్న అనుమానంతో ప్రియురాలిపై ఓ ప్రియుడు దాడికి పాల్పడ్డాడు. స్క్రూ డ్రైవర్‌తో ఆమె ఛాతి, ముఖంపై పలుమార్లు దాడిచేయడంతో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఎస్ఆర్‌టీ కాలనీలో ఉండే శ్రావ్య (24) బ్యూటీషియన్. తల్లితో కలిసి నివాసముంటున్నది. శ్రావ్యకు గతంలో వివాహం కాగా.. వివాదాలు తలెత్తి విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో చిన్ననాటి స్నేహితుడైన హరిబౌలికి చెందిన మణికంఠ.. శ్రావ్యతో ప్రేమగా ఉంటూ వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. యువతి తల్లి కూడా ఇందుకు అంగీకరించినట్లు తెలిసింది. అయితే, శ్రావ్య కొన్ని రోజులుగా దూరంగా ఉంటుండడంతో మణికంఠకు అనుమానం కలిగింది. మరొకరితో చనువుగా ఉంటోందన్న అనుమానంతో మంగళవారం ఉదయం ఆమె ఇంటికి వెళ్లి తలుపు గడియవేసి గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో శ్రావ్య ఛాతి, ముఖంపై స్క్రూ డ్రైవర్‌తో మణికంఠ దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడింది. శ్రావ్య కేకలు విన్న స్థానికులు ఛత్రినాక పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తలుపులు బలవంతంగా తెరవడంతో భయానికి మణికంఠ చేతికి గాయం చేసుకున్నాడు. తీవ్రంగా రక్తస్రావమైన శ్రావ్యను చికిత్స నిమిత్తం పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం దాడికి పాల్పడ్డ మణికంఠ చేతికి ప్రాథమిక చికిత్స చేయించి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.60లక్షలతో గాయబ్

● విదేశాల్లో ఉద్యోగాలంటూ వల

● వర్కింగ్ వీసా పేరుతో డబ్బు వసూలు ● ఆరుగురిపై కేసు

చాదర్‌ఘాట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వల వేసి నిరుద్యోగులనుంచి సుమారు రూ.60లక్షలు వసూలు చేసి ఓ కన్సల్టెన్సీ నిర్వాహకులు ఉడాయించారు. బాధితుల ఫిర్యాదుతో నిందితుల కోసం మలక్‌పేట పోలీసులు గాలింపు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కిరణ్‌కుమార్ గండ్ల ముసారాంబాగ్‌లోని శ్రీపురం కాలనీలో అద్దెగదిలో ఉంటున్నాడు. సలీంనగర్‌లోని సబ్‌రోడ్‌లో డేగాస్ డెస్టినేషన్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో కన్సల్టెన్సీని గత ఏడాది అక్టోబర్‌లో ఏర్పాటు చేశాడు. అద్దె విషయంలో గొడవ తలెత్తడంతో కిరణ్‌కుమార్ గండ్ల తన కన్సల్టెన్సీ ఆఫీసును ముసారాంబాగ్‌లోని సబ్ రోడ్‌కు మార్చాడు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా తదితర విదేశాల్లో వర్కింగ్ వీసా ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించాడు. ఇలా 16 మంది నిరుద్యోగులను న్యూజిలాండ్‌కు, ఒకరిని ఆస్ట్రేలియాకు పంపుతానంటూ నమ్మించి వారి నుంచి రూ.60లక్షల వరకు వసూలు చేశాడు. రెండు, మూడు నెలలుగా కాలయాపన చేస్తూ యువకులను ఆఫీసు చుట్టూ తిప్పించుకున్నాడు. న్యూజిలాండ్‌లో వర్కింగ్ వీసా సమస్య ఉందని, తాను అక్కడికి వెళ్లి పరిష్కరించుకుని వచ్చి పంపుతానని కిరణ్‌కుమార్ చెప్పాడు. ఈనెల 10వ తేదీన అతను మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో మోసపోయినట్లు గుర్తించిన 17మంది నిరుద్యోగులు మలక్‌పేట పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఆర్‌నగర్ లోకేషన్‌లో కిరణ్‌కుమార్ మొబైల్‌ఫోన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో ఎస్ఐ జయంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కన్సల్టెన్సీలో పనిచేస్తున్న మరో ఐదుగురు ఉద్యోగులు నాగేందర్, అనిరుధ్, వినయ్, రుచిక గాంధీ, షికా పాండేలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయంత్ తెలిపారు.

పక్షపాత పోలీసులపై చర్యలు తీసుకోండి

● డీజీపీకి వీహెచ్‌పీ వినతి

హైదరాబాద్, జూన్18 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా పక్షపాత ధోరణితో వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తాను విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కోరింది. సదరు పోలీసు అధికారులు పనిగట్టుకుని హిందువులపై అక్రమ కేసులు పెట్టారని ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా మెదక్ పట్టణంలో పోలీసుల అలసత్వం కారణంగా అల్లర్లు జరిగాయని, అల్లర్లలో దోషులను వదిలిపెట్టి.. బాధితులను రిమాండ్ చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో మంగళవారం కలుసుకుని వినతిపత్రం అందజేశారు. చాదర్‌ఘాట్, ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీసులు దోషులను వదలిపెట్టి, వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలను బెదిరిస్తున్నారని వారు డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లాలో ఆవులను మితిమీరి ఒకే వాహనంలో ఎక్కించడం వల్ల, తొక్కిసలాటకు గురై 12 ఆవులు చనిపోయాయన్నారు. కానీ, ఈ విషయాలను బయటకు రాకుండా పోలీసులు తొక్కి పెడుతున్నారని ఆరోపించారు.

రోడ్లపై వరద నీరు నిలవకుండా..

(5వ పేజీ తరువాయి)

ఆఖరుగా పేర్కొన్నారు. మిగతా పనులకు త్వరలో బిడ్‌లు ఆహ్వానించనున్నారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు.

కుండపోత.. రోడ్లపై వరద

నగరంలో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తోంది. గంటకు రెండు సెంటీమీటర్ల ప్రవాహ సామర్థ్యం మాత్రమే ఉండడంతో వరద నీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. కాలనీ, బస్తీ.. ప్రధాన, అంతర్గత రహదారి అన్న తేడా లేకుండా చాలా చోట్ల గంటల తరబడి వరద నీరు ఉంటోంది. ప్రధాన రహదారులపై పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలుస్తుండడం ట్రాఫిక్ జామ్‌జాటానికి దారి తీస్తోంది. వర్షం పడిందంటే ఐదు కిలో మీటర్ల ప్రయాణానికి కనీసం గంట సమయం పడుతోంది. ఐటీ కారిడార్ నుంచి ఉప్పల్‌కు 25 కిలోమీటర్ల దూరం ఉండగా.. రెండున్నర నుంచి మూడు గంటలు, ఒక్కోసారి అంతకంటే ఎక్కువ సమయం పడుతుండడం గమనార్హం. 534 అత్యవసర బృందాలు ఏర్పాటు చేసినా.. 30కిపైగా విపత్తు నిర్వహణ టీంలు రంగంలోకి దిగినా పౌరులకు ఇబ్బందులు తప్పడం లేదు.

సంపుల్లోకి నీరు.. పంపింగ్‌తో బయటకు..

గంటల తరబడి వరద నీరు నిలిచే ప్రాంతాల్లో భూగర్భంలో సంపులు నిర్మించనున్నారు. స్థల లభ్యతను బట్టి ఒక్కో ఏరియాలో పదివేల లీటర్ల నుంచి నాలుగు లక్షల లీటర్లు నీరు నిలిచే సామర్థ్యంతో సంపులుంటాయని ఓ అధికారి చెప్పారు. వాటిలో ఎక్కువ అశ్వసామర్థ్యంతో కూడిన మోటార్ల పంపులను ఏర్పాటు చేస్తారు. పంపింగ్ చేసే నీరు సమీపంలోని వరద నీటి డ్రైన్లలోకి సులువుగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తారు. దీంతో రోడ్లపై వరద నీరు నిలిచే అవకాశం ఉండదని ఖైరతాబాద్ జోన్‌కు చెందిన ఓ ఇంజనీర్ చెప్పారు. సంపులో నిర్ణీత స్థాయిలో వరద నీరు చేరిన అనంతరం ఆటోమేటిక్‌గా మోటార్లు ఆన్ అయ్యేలా సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు.

సెల్లార్లు.. ప్రమాద ఘంటికలు..!

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సెల్లార్ల తవ్వకాల విషయంలో చర్యలపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫిర్యాదులు వస్తే.. మధ్యే మార్గం సూచిస్తున్నారు తప్ప.. ఉల్లంఘనులపై కొరడా ఝుళిపించే ప్రయత్నం చేయడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు గ్రేటర్‌లో తవ్విన సెల్లార్లు ప్రస్తుతం 147 ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 27 సెల్లార్లకు అనుమతి లేదు. తదుపరి పనులు చేపట్టవద్దని ఆయా నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయినా ఆయా ప్రాంతాల్లో పనులు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పట్టణ ప్రణాళికా విభాగం నిబంధనల ప్రకారం సుమారు 900 చదరపు గజాల(750 చ.మీటలు) స్థలం ఉంటేనే సెల్లార్లకు అనుమతి ఇస్తారు. పర్మిషన్ తీసుకున్న మెజార్టీ నిర్మాణదారులు సెట్‌బ్యాక్‌లు వదలకుండా సెల్లార్లు తవ్వుతున్నారు. నిబంధనల ప్రకారం మొదటి సెల్లార్‌కు 1.5 మీటర్లు.. ఆ తరువాత ఒక్కో సెల్లార్‌కు 0.5 మీటర్ల చొప్పున సెట్‌బ్యాక్‌లు వదలాలి. కానీ నగరంలోని చాలా ప్రాంతాల్లో ఒకటి, రెండు అడుగులు కూడా వదలకుండా తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో వర్షాలు పడితే పక్కనున్న నిర్మాణాలు కూలిపోతున్నాయి. గతంలో ఇదే కారణాలతో ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పక్కభవనాల యజమానులు ఫిర్యాదు చేస్తే.. షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటోన్న అధికారులు.. ముందస్తు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

జోన్	సెల్లార్లు	అనుమతి ఉన్నవి	లేనివి	రిటైనింగ్ వాల్ నిర్మించినవి
ఎల్‌బీనగర్	30	20	10	11
చార్మినార్	27	22	5	17
ఖైరతాబాద్	34	27	7	8
శేరిలింగంపల్లి	26	23	3	2
కూకట్‌పల్లి	20	20	--	9
సికింద్రాబాద్	10	8	2	1
మొత్తం	147	120	27	48

సర్దిచెబుతున్నారు కానీ..

బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లో 400 చ.గల విస్తీర్ణం కంటే తక్కువ స్థలంలో అంగుళం కూడా సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణదారుడు సెల్లార్ తవ్వాడు. దీనిపై పక్క భవన యజమాని ఫిర్యాదు చేయగా.. సర్కిల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు మధ్యే మార్గంగా ఇరువురికి నచ్చచెప్పడం చర్చనీయాంశమైంది. నగరంలో 200-300 చదరపు గజాల స్థలంలోనూ సెల్లార్లు తవ్వుతున్నారు. అనుమతి లేవని బల్దియా గుర్తించిన 27 సెల్లార్లు తక్కువ స్థల విస్తీర్ణంలో తవ్వినవే ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 19 జూన్ 2024

ఆందోళన తగ్గాలంటే..

చాలా మందికి ఆందోళన ఒక పెద్ద సమస్య. దీనికి కారణాలు అనేకం. అందుకే కారణాలు వెతకకుండా ఆందోళనను తగ్గించుకొనే మార్గాలను అన్వేషించమని మానసిక నిపుణులు సలహా ఇస్తూ ఉంటారు. అలాంటి కొన్ని మార్గాలేమిటో చూద్దాం..

మైండ్‌ఫుల్‌నెస్

ధ్యానం, శ్వాసను నియంత్రించే వ్యాయామాలు, అంతర్ముఖులు కావటానికి చేసే ప్రయత్నాల వల్ల ఆందోళన కొంత తగ్గుతుంది. గతంలో జరిగిన విషయాలు మళ్లీ జరుగుతాయేమోననే ఆందోళన లేదా భవిష్యత్తులో ఏదైనా జరుగుతుందేమోననే భయం తగ్గాలంటే- వర్తమానంపై దృష్టిని కేంద్రీకరించాలి. వర్తమాన సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో ఆలోచించాలి. అప్పుడే ఆందోళన తగ్గుతుంది.

వ్యాయామం..

శారీరక వ్యాయామం వల్ల శరీరానికి మాత్రమే కాదు. మెదడుకు కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. వ్యాయామం చేసినప్పుడు శరీరంలో ఎండోమార్ఫిన్స్ విడుదల అవుతాయి. ఇవి శరీరంలో సహజంగా ఉండే ఒత్తిడిని తగ్గిస్తాయి. ప్రతి రోజు కనీసం అరగంట పాటు వ్యాయామం చేయటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది.

రొటీన్ అవసరం



ఒక రొటీన్‌ను ఏర్పాటు చేసుకోవటం వల్ల అనవసరపు ఆందోళనను తగ్గుతాయి. సక్రమంగా పని చేయగలమనే విశ్వాసం పెరుగుతుంది.

సామాజిక సంబంధాలు

స్నేహితులు, బంధువులతో ఎక్కువ సమయం పెరగటం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఆందోళనలు తగ్గిపోతాయి. ఇతరులతో మన ఆందోళనలను పంచుకోవటం వల్ల - మనసు తేలికపడుతుంది. కొన్ని సార్లు సమస్యలకు సమాధానాలు కూడా లభించే అవకాశముంది.

ఆరోగ్యకరమైన జీవనం

తగినంత నిద్ర, పౌష్టికాహారం, విశ్రాంతి కోసం తగినంత సమయాన్ని కేటాయించటం ఇవన్నీ చాలా ముఖ్యమైన విషయాలు. వీటి వల్ల ఆరోగ్యకరమైన జీవనం అలవాటు అవుతుంది. దీని వల్ల ఆందోళన తగ్గుతుంది.



విన్నర్

సినీ తారగా ప్రపంచానికి పరిచయమైనా... ఆమె పేరు ఎంటర్‌టైన్‌మెంట్ వార్తలకే పరిమితమవ్వలేదు. తరచూ వివాదాలు... బెదిరింపులు... కోర్టు కేసులు... అయినా మనసులో ఉన్నది ఉన్నట్టు మాట్లాడటానికి ఎన్నడూ జంకలేదు. వెండితెరపై వెలిగిన కథానాయిక కంగనా రనౌత్... నేడు ఎన్నికల్లో నెగ్గి జననాయిక అయ్యారు. ఎంపీగా సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్న 37 ఏళ్ల ఈ బాలీవుడ్ స్టార్ విజయం వెనుక ఎన్నో పోరాటాలు ఉన్నాయి.

కంగన... వివాదాలకు.. విజయాలకు కేరాఫ్

నలభైకి పైగా చిత్రాలు... వేటికవే ప్రత్యేకమైన పాత్రలు... బాలీవుడ్‌లో బంధు ప్రీతిని ప్రశ్నించి... అదే పరిశ్రమలో నిలదొక్కుకోగలిగిన తార కంగనా రనౌత్. పదిహేడేళ్లకు పైబడిన కెరీర్‌లో ఆమె ఎదుర్కొన్న ఎత్తుపల్లాలు, ఒడుదొడుకులు ఎన్నో. హిమాచల్‌ప్రదేశ్ మండి జిల్లాలోని భంబ్లా అనే చిన్న పట్టణంలో పుట్టిన ఆమెది భిన్నమైన నేపథ్యం. ఒకరిపై ఆధారపడకూడదన్న తత్వం. అందుకే పదహారేళ్లకే ఇల్లు వదిలి ఢిల్లీ వెళ్లారు. అది మొదలు ఎన్నో కష్టాలు పడ్డారు. తమ మాట కాదన్నందుకు తల్లితండ్రులు ఆమెకు ఎలాంటి సాయం చేయకూడదని నిర్ణయించుకున్నారు. అయినా కంగన ఆత్మవిశ్వాసంతో ఒంటరిగానే పోరాడారు. మోడలింగ్‌తో ప్రారంభించి... అటు నుంచి ముంబయికి మారి... పదిహేడేళ్లకే 'గ్యాంగ్‌స్టర్'తో నటిగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. అద్భుతమైన నటనతో జాతీయ చలనచిత్ర అవార్డులతో పాటు ఫిలిమ్‌ఫేర్ పురస్కారాలు కూడా అందుకున్నారు. ఆమెలోని కళాకారిణిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ' ఇచ్చి సత్కరించింది. ఏ రంగంలో ఉన్నా... వేదిక ఏదైనా కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడడం ఆమె నైజం. అదే ఆమెను ఎన్నో వివాదాలు, కోర్టు కేసుల్లోకి లాగింది.

పీఓకేతో పోల్చి...

హీరో హృతిక్ రోషన్‌పై కంగనా బహిరంగ వ్యాఖ్యల గురించి మాట్లాడేందుకు ప్రముఖ గీత రచయిత జావేద్ అక్తర్ ఆమెను తన ఇంటికి పిలిచారు. కొన్నేళ్ల తరువాత ఓ ఇంటర్వ్యూలో కంగన ఆ విషయంపై మాట్లాడుతూ... నాడు జావేద్ తనను బెదిరించారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ కంగనపై జావేద్ పరువు నష్టం దావా వేశారు. కోర్టులో ఆ కేసు

> 'కెరీర్ ఆరంభంలో నా పట్ల కొందరు చాలా దారుణంగా వ్యవహరించారు. హీరోయిన్ ఎప్పుడూ నిర్మాత మీదో లేక హీరో మీదో ఆధారపడాల్సిందే. ఆడపిల్ల కనుక ఏమీ చేయలేదనేది వాళ్ల ధీమా' అంటూ హిందీ చిత్ర పరిశ్రమలోని లోపాలను ఎత్తి చూపారు.

ఇప్పటికీ నడుస్తోంది. తన ముంబయి కార్యాలయాన్ని కూలగొట్టిన ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని నాటి 'మహా వికాస్ అఘడీ' ప్రభుత్వాన్ని... పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పోల్చి పెద్ద దుమారమే రేపారు కంగన. ఇది కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాట యుద్ధానికి దారి తీసింది. ఫలితంగా కంగనాకు వై-ప్లస్ గ్రేడ్ భద్రతను కేంద్ర హోంశాఖ సమకూర్చాల్సి వచ్చింది.

మాధ్యమం మార్చి...

ఆ మరుసటి ఏడాది (2021) పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతరం జరిగిన హింసపై ట్విటర్ (ఎక్స్)లో కంగన ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆమె ట్విటర్ ఖాతా నిషేధానికి గురైంది. అంతటితో ఆగని ఆమె... ఇన్‌స్టాలో తన అభిప్రాయాల్ని పంచుకోవడం మొదలుపెట్టారు. నటనలో నాలుగుసార్లు జాతీయ అవార్డులు దక్కించుకున్న ఈ బాలీవుడ్ తార... సగటు బాలీవుడ్ హీరోయిన్లకు పూర్తి భిన్నం. నచ్చింది చేయడం, నచ్చనిదాని గురించి నిర్మొహమాటంగా చెప్పడం ఆమెకు చిన్నప్పటి నుంచీ అలవాటు. సెలబ్రిటీ చాట్ షో 'కాఫీ విత్ కరణ్'లో 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి నువ్వు పతాకధారివి' అంటూ కరణ్ జోహార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు కంగన. ఆ వ్యాఖ్యలు కరణ్‌తో పాటు హిందీ చిత్ర పరిశ్రమను కూడా దిగ్భ్రాంతికి గురి చేశాయి. స్టార్ కిడ్స్‌వల్ల బయటివారు అవకాశాలు పొందలేకపోతున్నారనేది కంగన వాదన. తరువాత కరణ్, కంగన మధ్య వివాదం పతాక స్థాయికి వెళ్లింది. 2020లో హీరో సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ మరణంపై కూడా రనౌత్ స్పందించారు. అదీ పలు వివాదాలకు కారణమైంది. అప్పటికే 'క్రిష్3, కైట్స్' సహనటుడు హృతిక్ రోషన్‌తో గొడవ ఒక పక్క నడుస్తోంది. తనతో ఉన్న అనుబంధాన్ని హృతిక్ ఒప్పుకోవడంలేదంటూ నాడు ఆమె రచ్చకెక్కారు. అయితే మా ఇద్దరి మధ్య ఎలాంటి వ్యక్తిగత సంబంధాలూ లేవని కంగన వ్యాఖ్యలను నాడు హృతిక్ తిప్పికొట్టారు.



'ఈ గడ్డ బిడ్డ'...

కంగనతో పాటు ఈసారి ఎన్నికల్లో 'రామాయణ్' స్టార్ అరుణ్ గోవిల్, హేమమాలిని, శత్రుఘన్ సిన్హా తదితర సినీ తారలు కూడా పోటీపడ్డారు. బీజేపీ తరుఫున పోటీ చేసిన అరుణ్ గోవిల్ (మీరట్), హేమమాలిని (మధుర) నుంచి, టీఎంసీ అభ్యర్థిగా శత్రుఘన్ సిన్హా (అసాన్‌సోల్) నుంచి గెలుపొందారు. అయితే వీరందరిలో కంగన పేరే దేశ వ్యాప్తంగా వినిపించింది. 'మండీ' నియోజకవర్గం పేరును, కంగన సినీ నేపథ్యాన్ని ఉద్దేశించి ప్రత్యర్థులను చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆమెకు సానుభూతిని తెచ్చి పెట్టాయి. 'ఈ గడ్డ బిడ్డను' అంటూ ఆమె చేసిన ప్రచారం ప్రజలకు బాగా చేరింది. ఎంపీగా తొలిసారి పార్లమెంట్‌లోకి అడుగు పెడుతున్న కంగన... 'నా మీద ప్రేమానురాగాలు కురిపించి, నాపై నమ్మకం ఉంచిన మండీ ప్రజలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇది మీ అందరి విజయం. మండీకి దక్కిన గౌరవం' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఎంపీ అయిన తరువాత కూడా మరో వివాదానికి కేంద్రం అయ్యారు కంగన. చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ ఆమెను చెంప దెబ్బ కొట్టారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ, ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేపట్టిన రైతులను అగౌరవపరిచేలా కంగన వ్యాఖ్యలు చేసినందుకే తానీ పని చేసినట్టు కౌర్ తెలిపారు. కుల్వీందర్ కౌర్ చర్యలను కొందరు సమర్థించారు. దీనిపై కంగన 'ఎక్స్' వేదికగా... 'అనుమతి లేకుండా ఒక వ్యక్తి శరీరాన్ని తాకడం, వారిపై దాడి చేయడం వంటి ఘటనలు మీరు సమర్థిస్తే... హత్యలు, అత్యాచారాలు జరిగినా మీకేం పర్వాలేదనే అర్థం. మీలాంటివారు మీ మానసిక స్థితిపై మరింత దృష్టి పెట్టాలి. యోగా, ధ్యానం చేయండి' అంటూ స్పందించారు.

సొంత చిత్రానికీ...

స్త్రీవాదాన్ని బలంగా వినిపించే కంగన... తనకు తానుగా పరిశ్రమలో ఎలా ఎదిగిందీ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. 'కెరీర్ ఆరంభంలో నా పట్ల కొందరు చాలా దారుణంగా వ్యవహరించారు. హీరోయిన్ ఎప్పుడూ నిర్మాత మీదో లేక హీరో మీదో ఆధారపడాల్సిందే. ఆడపిల్ల కనుక ఏమీ చేయలేదనేది వాళ్ల ధీమా' అంటూ పరిశ్రమలోని లోపాలను ఎత్తి చూపారు. 'కంగన ఎక్కడుంటే అక్కడ వివాదం ఉంటుంది' అనేది హిందీ పరిశ్రమలో టాక్. దానికి తగ్గట్టుగానే తను సొంతంగా నిర్మించిన 'మణికర్ణిక' చిత్రం నిర్మాణ సమయంలో దర్శకుడు క్రిష్ జాగర్లమూడితో వివాదం రేగింది. అదే తరహాలో 'సిమ్రాన్' సినిమా విషయంలోనూ రచయిత అపూర్వ అస్రానీతో పొసగలేదు. దాంతో ఆయన మధ్యలోనే సినిమా వదిలి వెళ్లిపోయారు. దక్షిణాదిలో కూడా పలు చిత్రాల్లో నటించిన కంగన చివరగా 'తేజస్'లో కనిపించారు. ఆ తరువాత రాజకీయాల్లో బిజీ అయిపోయారు.

ప్రజా క్షేత్రంలోకి...

మీడియా, సామాజిక మాధ్యమాల్లో నిత్యం తన అభిప్రాయాలు, ఆలోచనలను పంచుకొనే కంగన... రాజకీయంగా మొదటి నుంచీ బీజేపీని అభిమానిస్తూ వస్తున్నారు. దానికి కారణం ప్రధాని మోదీ నాయకత్వం అంటారామె. అందులో భాగంగానే ఆయన ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వం సవరణ చట్టానికి మద్దతుగా అనేక సందర్భాల్లో మాట్లాడారు. అలాగే ఢిల్లీలో రైతుల ఆందోళనల సమయంలో అధికార పార్టీకి అండగా నిలిచారు. కొన్నేళ్లుగా బీజేపీ అనుకూల వ్యాఖ్యలతో రాజకీయ ప్రత్యర్థులను కూడా పెంచుకున్న కంగన... మొన్న జరిగిన సాధారణ ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలోకి దిగారు. సొంత జిల్లా మండి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి పోటీపడిన ఆమె... కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. ఏదిఏమైనా ఇకపై తన సమయాన్ని పూర్తిగా రాజకీయాలు, మండీ ప్రజల అభ్యున్నతికే కేటాయిస్తానంటూ ప్రకటించారు కంగన.

అవకాడోతో ప్రయోజనాలెన్నో

ఈ మధ్యకాలంలో అవకాడోలు చిన్న చిన్న పట్టణాలలోకి కూడా ప్రవేశించాయి. ఈ అవకాడోల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు.

- ఒక అవకాడో ద్వారా 320 కేలరీలు లభిస్తాయి. 28 గ్రాముల కొవ్వు, 17 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 14 గ్రాముల ఫైబర్, రెండు గ్రాముల సుగర్ లభిస్తాయి. అందువల్లే అవకాడోల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పౌష్టికాహార నిపుణులు పేర్కొంటున్నారు.
- అవకాడోలలో సీ,ఈ,కె, బీ6 విటమిన్లు ఎక్కువగా లభిస్తాయి. ఇవి మన శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయి. వీటితో పాటుగా రిబోఫ్లోవిన్, నయాసిన్, ఫోలేట్, పేంటోథినిక్ యాసిడ్, మాగ్నిషియం, పోటాసియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా లభిస్తాయి.
- అవకాడోలలో విటమిన్ కె ఉంటుంది. ఇది కాల్షియం శరీరంలోకి ప్రవేశించేలా చేస్తుంది. మూత్రం ద్వారా కాల్షియం బయటకు వెళ్లకుండా చూస్తుంది.
- కొలస్ట్రాల్ విలువలు పెరగకుండా అవకాడో ఉపకరిస్తుంది. దీని వల్ల హృద్రోగ సమస్యలు తొలగిపోతాయి.
- శరీరంలో చక్కెర విలువలు పెరగకుండా అవకాడో నియంత్రిస్తుంది.
- అవకాడోలో ఫోలేట్ చాలా ఎక్కువగా ఉంటుంది. మెదడు చురుకుగా పనిచేయటంలో ఇది ఉపకరిస్తుంది.
- దీనిలో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల అజీర్తి సమస్యలు తొలగిపోతాయి.



రోజూ టీ తాగితే..!

చాలా మందికి ఉదయాన్నే లేచిన వెంటనే టీ తాగకపోతే రోజు ప్రారంభమయినట్లు అనిపించదు. అయితే టీని ప్రతి రోజు క్రమం తప్పకుండా తాగితే శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో చాలా మందికి తెలియదు. ఆ మార్పులు ఏమిటో చూద్దాం...

- రోజు పాలతో చేసిన టీని తాగితే- పాలలో ఉండే కాల్షియం శరీరానికి అందుతుంది. వయస్సు పైబడుతున్న సమయంలో ఎముకలకు సంబంధించిన వ్యాధులు రాకుండా ఈ కాల్షియం కాపాడుతుంది.
- టీపొడిలో కొన్ని రకాల యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి మన మెదడు చురుకుగా పనిచేయటానికి ఉపకరిస్తాయి.
- టీలో కెఫైన్ కూడా ఉంటుంది. కెఫైన్ వల్ల ఏకాగ్రత పెరగటం వంటి కొన్ని మంచి లక్షణాలు ఉన్నా.. ఎక్కువ కెఫైన్‌ను తాగటం మంచిది కాదు. దీని వల్ల ఆందోళన పెరుగుతుంది.



- టీలో ఉండే టేనిన్స్ అనే రసాయనాలు - మన శరీరం ఐరన్‌ను పొందే ప్రక్రియలో అడ్డం పడతాయి. దీని వల్ల ఎక్కువగా టీ తాగే వారిలో ఐరన్ తక్కువగా ఉంటుంది.
- పాలు, పంచదార కలిపిన టీలో చక్కెర ఎక్కువగా ఉంటుంది. ప్రతి రోజు క్రమం తప్పకుండా అవసరాన్ని మించిన చక్కెరను తీసుకుంటే- స్థూలకాయం, మధుమేహం వంటి సమస్యలు రావచ్చు.

ఇవి పాటించండి...

- రోజుకు రెండు కప్పుల టీ కన్నా ఎక్కువ తాగవద్దు
- వీలైనంత తక్కువ చక్కెర వాడండి
- టీను ఎక్కువగా తాగే వారు నీళ్లను కూడా ఎక్కువగా తాగాలి
- అజీర్తి వంటి సమస్యలు తలెత్తినప్పుడు - పాలతో చేసిన టీని తాగకండి

ఫ్యాషన్





తేలికగా ఉండే ఫ్యాబ్రిక్ చందేరి. దీంతో చీరలే కాదు, షల్వార్ కమీజ్‌లూ, సూట్లు కూడా తయారుచేస్తూ ఉంటారు. ఫ్లవర్ డిజైన్లలో ఆహ్లాదకరంగా కనిపించే చందేరి సూట్స్ మీద ఓ లుక్కేద్దామా?

చందేరి చమక్కులు

అదనపు హంగులు ఇలా...

సెక్విన్లు, డోరీలు, భారీ చున్నీలు చందేరీ డ్రస్సుల ప్రత్యేకత. సాధారణంగా అనార్కలి స్టైల్‌లో రూపొందే చందేరీ సూట్లు నాజూకుగా ఉండే అమ్మాయిలకు చాలా బాగా నప్పుతాయి. అడుగున అదే రంగు లెగ్గింగ్ వేసుకుని, పాదాలకు ఫ్లాట్స్ ధరించే చందేరీ లుక్ పూర్తవుతుంది. ఈ దుస్తులకు సింపుల్, మెటల్ జ్యూవెలరీ సూటవుతుంది. లేయర్డ్ స్టైల్ చందేరీ దుస్తులైతే హీల్స్ వేసుకోవచ్చు.



దుపట్టా ఇలా...

చందేరీ సూట్‌కు దుపట్టా ఉన్నా, లేకపోయినా పర్వాలేదు. రౌండ్ లేదా వి నెక్ డ్రస్‌లు అమ్మాయిలందరికీ నప్పుతాయి. టాప్ పొడవు మోకాళ్ల కింద వరకూ ఉంటే, ప్యాంట్ స్టైల్‌లో ఉండే బాటమ్ ధరించాలి. ఫెస్టివ్ లుక్ రప్పించాలనుకుంటే, మెరుసే సెక్విన్లతో కూడిన డ్రస్ ఎంచుకోవాలి.

స్టైల్‌గా... హుందాగా...

సిల్క్, గోల్డెన్ జరీల కలనేతతో రూపొందే చందేరీ సూట్లు హుందాగా ఉంటాయి. ఈవినింగ్ పార్టీలు, పెళ్లిళ్లలో టీనేజీ అమ్మాయిలు ధరించడానికి అనువుగా ఉండే ఈ దుస్తులు లేటెస్ట్ ఫ్యాషన్‌గా చలామణీ అవుతున్నాయి. హాఫ్ వైట్ మీద ఆకర్షణీయమైన రంగుల్లోని పువ్వులు, లతల డిజైన్లు చందేరీ ప్రత్యేకతలు. చూడడానికి భారీగా కనిపించినా, ధరించడానికి తేలికగా ఉంటాయి కాబట్టి చందేరీ దుస్తులు మహిళలను ఆకర్షిస్తూ ఉంటాయి.





ఆ ప్రశ్నలకు సమాధానం కల్కి



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ సైన్స్ ఫిక్షన్ ఎపిక్ 'కల్కి 2898 ఏడీ' ఈ నెల 27న విడుదల కానుంది. వైజయంతీ మూవీస్ సంస్థ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ విజువల్ వండర్ రోజురోజుకీ అంచనాలు పెంచుతోంది. ప్రమోషన్స్‌లో భాగంగా 'ఎపిక్ జర్నీ వన్.. ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ' ని మంగళవారం విడుదల చేశారు. ఈ వీడియోలో దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కలియుగంలో ఏం జరుగుతుంది, ఏం జరగవచ్చు.. ఇలాంటి ప్రశ్నలకు 'కల్కి' క్లైమాక్స్ సమాధానం. కేవలం ఇండియాలోనే కాదు ప్రపంచంలో ఉన్న వారందరికీ సంబంధించిన కథ ఇది. నాకు చిన్నప్పటి నుంచి పౌరాణిక చిత్రాలు అంటే ఇష్టం. అలాగే హాలీవుడ్‌లో వచ్చిన 'స్టార్ వార్స్' వంటి సినిమాలు కూడా నన్ను ఆకట్టుకున్నాయి. అయితే ఇలాంటి సినిమాలను అక్కడే తీయాలా, మనం తీయలేమా అనిపించేది. మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలు ఉన్నాయి. కృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైనప్పుడు ఏం జరుగుతుంది అనే సృజనాత్మక ఊహతో రాసుకున్న కథ ఇది. మనం చదివిన పురాణాలు, ఎపిక్స్. అన్నింటికీ ఈ సినిమా క్లైమాక్స్‌లా ఉంటుంది. ఒక యుగంలో రావణుడు, మరో యుగంలో దుర్యోధనుడు.. ఇలా అన్నింటిలోంచి ఓ రూపం తీసుకుని దాంతో పోరాటం ఎలా ఉంటుందన్న ఐడియాతో 'కల్కి' కథ రాయడానికి ఐదేళ్లు పట్టింది. సరికొత్తగా రూపుదిద్దుకున్న ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీని చూసి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని, రాజేంద్రప్రసాద్ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

గిలాసే ఎత్తేస్తే కులాసే



ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా హిట్‌ను అందుకున్న కె. నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అశ్విన్ రామ్ దర్శకుడు. ఇటీవలే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు చక్కటి ఆదరణ దక్కింది. ఇప్పుడు ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ను యూనిట్ ప్రారంభించింది. 'డార్లింగ్' నుంచి తొలి గీతం 'ఖలాసే ఖలాసే మామా నా బతుకే ఖలాసే... గిలాసే ఎత్తేస్తే కులాసే'ను మంగళవారం విడుదల చేసింది. సామాన్యుడి బాధలను ఏకరువు పెడుతూ సాగే ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, వివేక్ సాగర్ స్వరాలు సమకూర్చారు. హనుమాన్ సీహెచ్, రామ్ మిరియాల ఆలపించారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణ తేజ్, అనన్య నాగళ్ల కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నరేశ్ రామదురై, ఎడిటర్: ప్రదీప్ ఇ రాఘవ్,

ప్రియురాలిని పెళ్లాడుతున్న సిద్ధార్థ్ మాల్యా



వ్యాపారవేత్త విజయ్ మాల్యా తనయుడు, నటుడు సిద్ధార్థ్ మాల్యా పెళ్లి పీటలు ఎక్కనున్నారు. తన ప్రియురాలు జాస్మిన్‌ను సిద్ధార్థ్ లండన్‌లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లాడనున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతాలో వారిద్దరూ కలసి తెల్లకోటు, తెల్ల గౌను వేసుకుని పెళ్లి దుస్తుల్లో ముస్తాబైన ఓ ఫొటోను పోస్ట్ చేసి "పెళ్లికి సమయం ఆసన్నమైంది. వేడుకలు మొదలయ్యాయి" అని ఆయన పేర్కొన్నారు. జాస్మిన్‌కు గతేడాది నవంబరులో తన ప్రేమను వ్యక్తపరిచిన సందర్భాన్ని.. ఇద్దరూ కలసి నిశ్చితార్థపు ఉంగరాన్ని ధరించిన ఫొటోలను సిద్ధార్థ్ మాల్యా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. దీంతో వీరిద్దరి ప్రేమాయణం గురించి అందరికీ తెలిసింది.



థాయ్‌లాండ్ వెళుతున్న దేవర

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దేవర' మీదే ప్రస్తుతం అందరి దృష్టీ ఉంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న తారక్ సినిమా కావడంతో ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ నటిస్తున్న తొలి తెలుగు చిత్రం ఇదే కావడం మరో ముఖ్య కారణం. దర్శకుడు కొరటాల శివ ఓ అద్భుత చిత్రంగా 'దేవర'ను తీర్చిదిద్దుతున్నారు. ఇటీవలే గోవాలో ఎన్టీఆర్, సైఫ్ అలీఖాన్ మీద ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించారు. గోవాలో భారీ వర్షం కురుస్తున్నా వెనుకడుగు వేయకుండా, రాజీ పడకుండా ఈ ఫైట్ చిత్రీకరించడం గమనార్హం. త్వరలో థాయ్‌లాండ్‌లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్ మీద ఓ మెలోడియస్ సాంగ్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



'హ్యాపీడేస్', 'కొత్త బంగారులోకం'తో లవర్ బాయ్, పక్కింటి కుర్రాడి ఇమేజ్ సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. తనకున్న ఆ ఇమేజ్‌కి భిన్నంగా ఆయన పూర్తి సీరియస్ రోల్‌లో నటించిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అనేది ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

"నేనిప్పటివరకూ ఇటువంటి పాత్రను చేయలేదు. నిజజీవితంలో ఎంతో చలాకీగా, నవ్వుతూ కనిపించే నేను.. ఇందులో చాలా సీరియస్‌గా ఉంటాను. ఒక నటుడిగా నన్ను కొత్తగా ఆవిష్కరించిన చిత్రమిది. రొటీన్‌కు భిన్నంగా సినిమాలు చేద్దామనుకొంటున్న సమయంలో ఈ కథ విన్నా. చాలా నచ్చింది. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా 'నింద' సినిమా కథను చాలా పకడ్బందీగా రాసుకున్నారు డైరెక్టర్ రాజేశ్ జగన్నాథం. సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌లలో చాలా కథలు వచ్చాయి. కానీ వాటన్నికంటే పూర్తి భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. కొత్తదనంతో నిండిన ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే చాలా గ్రిప్పింగ్‌గా ఉంటుంది. తరువాతి సన్నివేశంలో ఏం జరుగుతుందనేది ఎవరూ ఊహించలేరు" అని చెప్పారు.



మొదట్నుంచే అలా చేసి ఉండాల్సింది

కృతిశెట్టి

తొలి చిత్రంతోనే ఇండస్ట్రీ బ్లాక్‌బస్టర్‌లు అందుకున్న నటీనటులు ఆ తర్వాత కెరీర్ రేస్‌లో వెనుకబడడం తెలిసిందే. ఇప్పుడు హీరోయిన్ కృతిశెట్టి కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. తన తొలి చిత్రం 'ఉప్పెన'తోనే అటు ఇండస్ట్రీ, ఇటు తెలుగు ప్రేక్షకులను తన అందం, అభినయంతో ఆమె ఆకట్టుకున్నారు. తెలుగులో అగ్రకథానాయికగా కొనసాగగల సత్తా కృతి సొంతం అని అంతా అనుకున్నారు. కానీ ఆ తర్వాత ఆమెకు అవకాశాలు ధాటిగానే వచ్చినా, 'ఉప్పెన' స్థాయిలో మరో బ్రహ్మాండమైన విజయం మాత్రం అందుకోలేక పోయారు. ఇటీవలే శర్వానంద్‌కు జంటగా నటించిన 'మనమే' చిత్రం సైతం ఆమెకు మరోసారి నిరాశనే మిగిల్చింది. అయితే వరుస వైఫల్యాలతోనే తెలుగులో హీరోయిన్‌గా కృతి అవకాశాలు సన్నగిల్లుతున్నాయనే వాదనను ఆమె కొట్టిపారేశారు. తమిళ, మలయాళ చిత్రాలతో బిజీగా ఉండడం వల్లే ఎక్కువ సంఖ్యలో తెలుగు సినిమాలు చేయలేకపోతున్నానని కృతి చెప్పారు. దాంతో పాటు కథల ఎంపికలో ఆచితూచి వ్యవహరించడం కూడా ఓ కారణమన్నారు. తెలుగులో మంచి కథలు కుదిరినప్పుడే సినిమా చేయాలనుకుంటున్నాననీ, అసలు మొదట్నుంచే కథల ఎంపికలో జాగ్రత్తగా ఉండాల్సిందని వాపోయారు. 'ఇప్పుడిప్పుడే మన చుట్టూ ఉండే మనుషులు, ప్రపంచం గురించి తెలుసుకుంటున్నాను, గతంలో జరిగిన పొరపాట్లను గుణపాఠాలుగా భావిస్తాను. వైఫల్యాల నుంచి నేర్చుకొని ఇకపై మంచి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రయత్నిస్తాను' అని కృతి అన్నారు.

కొత్త కలయిక కుదిరిందా?



'ఫైటర్' చిత్రంతో తనదైన యాక్షన్‌తో అభిమానులను ఎంటర్‌టైన్ చేశారు బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్. ప్రస్తుతం ఆయన 'వార్ 2' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. సెప్టెంబర్ కల్లా 'వార్ 2'లో తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేసి, కొత్త సినిమాపై దృష్టి సారించాలని ఆయన భావిస్తున్నారు. ఇప్పటికే పలువురు దర్శకులు హృతిక్‌ను కలసి కథలు వినిపిస్తున్నారు. అయితే ఆయన మాత్రం కబీర్ ఖాన్ చెప్పిన కథపై ఆసక్తి చూపినట్లు బాలీవుడ్ సర్కిల్లో వినిపిస్తోంది. విచిత్ర జీవుల నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందట. 'చందు ఛాంపియన్' చిత్రం విడుదలవ్వడంతో కబీర్‌ఖాన్ కూడా హృతిక్‌తో సినిమాపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టనున్నారు. ప్రస్తుతానికి కథా చర్చలు జరుగుతున్నాయి. తనకు కొత్త తరహా కథాంశం కావడంతో హృతిక్ కూడా ఆసక్తి చూపడంతో ఈ కాంబినేషన్ సెట్టయ్యే అవకాశాలే ఎక్కువనేది బాలీవుడ్ టాక్. అన్ని అనుకూలిస్తే కొత్త ఏడాదిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది.


త్వరలోనే మీ ముందుకొస్తా

అల్కా యాగ్నిక్



ప్రఖ్యాత గాయని, జాతీయ అవార్డు గ్రహీత అల్కా యాగ్నిక్ ఓ అరుదైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారు. దీని గురించి ఆమె వివరణ ఇస్తూ "కొన్నాళ్లుగా నువ్వు కనిపించడం లేదు ఎందుకని మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అడుగుతున్నారు. ఈ గ్యాప్‌కు కారణం.. నేను ఓ అరుదైన వినికిడి సమస్యతో బాధపడుతున్నాను. చెవికి సోకిన ఓ వైరస్ వల్ల ఏర్పడిన ఈ వినికిడి సమస్యను చికిత్సతో నయం చేయవచ్చనే భరోసాను డాక్టర్లు ఇచ్చారు. మీరు కూడా చింతించొద్దు.. ఆందోళన చెందవద్దు. త్వరలోనే నా వినికిడి శక్తిని తిరిగి పొంది.. మీ ముందుకు ఫుల్ జోష్‌తో వస్తాను. మీరు కూడా వీలైతే పెద్ద శబ్దాల నుంచి దూరంగా ఉండండి. హెడ్‌సెట్ ధరించి ఎక్కువ సౌండ్‌తో పాటలు వినడం తగ్గించండి" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

ఆకాశం అంచుల్లోకి విజేత ప్రయాణం



అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'సర్ఫిరా'. తమిళ చిత్రం 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా')కు ఇది రీమేక్. మాతృకకు దర్శకత్వం వహించిన సుధా కొంగర రీమేక్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. జూలై 12న ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం 'సర్ఫిరా' ట్రైలర్‌ను విడుదల చేసింది. వైమానికదళ పైలెట్‌గా, ప్రేమికుడిగా, పేద ప్రజల విమాన ప్రయాణం కల సాకారమవ్వాలని తపించే వ్యక్తిగా విభిన్న కోణాల్లో అక్షయ్ నటన అలరించింది. ఒరిజినల్‌లో హీరోగా నటించిన సూర్య ఈ రీమేక్‌లో అతిథి పాత్రను పోషించడం విశేషం. అక్షయ్‌కు జోడీగా రాధికా మదన్ నటించారు. పరేశ్ రావల్, సీమా బిశ్వాస్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. టు డీ ఎంటర్టైన్‌మెంట్, కేప్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్, అబండెన్షియా ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



టైటిల్ లోగో ఆవిష్కరించిన తేజ

దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం టైటిల్ లోగోని దర్శకుడు తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాకైనా ప్రేక్షకుల్ని ఆకర్షించేది, వారిని థియేటర్ దగ్గరకు నడిచేలా చేసేది టైటిల్ మాత్రమే. 'పోలీస్ వారి హెచ్చరిక' శక్తిమంతమైన మాస్ టైటిల్. నిర్మాతకు విజయం చేకూరాలి' అన్నారు. 'రెండు తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్ పూర్తి చేశామనీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ నిర్మాత బెల్లి జనార్ధన్, దర్శకుడు బాబ్జీ చెప్పారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, శుభలేఖ సుధాకర్, షియాజీ షిండే, హిమజ, జయవాహినీ, తులసి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: గజ్వేల్ వేణు, ఫొటోగ్రఫీ: నళినీకాంత్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.పి. సుబ్బారాయుడు.

నీరజ్‌దే స్వర్ణం



తుర్కు (ఫిన్లాండ్): ఒలింపిక్ చాంపియన్, స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా స్వల్ప విరామం తర్వాత బరిలోకి దిగిన అంతర్జాతీయ టోర్నీలో అదరగొట్టాడు. పావో నుర్మీ క్రీడల్లో తొలి సారి విజేతగా నిలిచి సత్తా చాటాడు. మంగళవారం ఇక్కడ జరిగిన జావెలిన్ త్రో ఫైనల్స్‌లో నీరజ్ తన మూడో ప్రయత్నంలో ఈటెను 85.97 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో స్వర్ణం సాధించడం నీరజ్‌కిదే మొదటిసారి. 2022లో ఇక్కడ అత్యుత్తమంగా రజత పతకం గెలిచాడు. ఇక, నీరజ్‌కు గట్టి పోటీ ఇస్తాడనుకున్న జర్మనీకి చెందిన 19 ఏళ్ల టీనేజర్ మ్యాక్స్ డెహనింగ్ 79.84 మీటర్ల ప్రదర్శనతో ఏడో స్థానంలో నిలిచాడు. గతంలో 90 మీటర్ల మార్క్ అందుకున్న ఈ యువ సంచలనం.. ఇక్కడ కనీసం 80 మీటర్ల దూరాన్ని నమోదుచేయలేకపోవడం గమనార్హం. స్థానిక ఫేవరెట్ టోనీ కెరానెన్ (84.19 మీ.) రజతం దక్కించుకోగా.. ఫిన్లాండ్‌కే చెందిన మాజీ చాంపియన్ ఒలివర్ హెలాండర్ (83.96 మీ.) కాంస్య పతకానికి పరిమితమయ్యాడు. నీరజ్ తన తదుపరి పోటీల్లో భాగంగా వచ్చే నెల 7న జరిగే పారిస్ డైమండ్ లీగ్‌లో పోటీపడనున్నాడు.

స్టెపాన్ చెస్ విజేత అర్జున్



జెర్ముక్ (అర్మేనియా): అద్భుత ఆట తీరుతో స్టెపాన్ అవగ్యాన్ చెస్ టైటిల్‌ను తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ సొంతం చేసుకున్నాడు. మంగళవారం ముగిసిన ఈ తొమ్మిది రౌండ్ల టోర్నీలో అర్జున్ 6.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఆఖరి రౌండ్‌లో స్థానిక జీఎం మాన్యువల్ పెట్రోస్యన్‌తో తలపడిన అర్జున్ 43వ ఎత్తు అనంతరం డ్రాకు అంగీకరించాడు. అర్జున్ విజేతగా నిలవగా, అమెరికా జీఎం శామ్యూల్ సెవియన్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకున్నాడు. ఈ టోర్నీ అనంతరం ఫిడే వరల్డ్ క్లాసిక్ ర్యాంకింగ్స్‌లో అర్జున్ నాలుగోస్థానంలో కొనసాగుతున్నాడు.

భారత్ X దక్షిణాఫ్రికా మహిళల రెండో వన్డే	మ.1.30 నుంచి జియో సినిమా, టీవీ 18లో

గంభీరే కాదు.. రామన్ కూడా

- చీఫ్ కోచ్ ఇంటర్వ్యూకు హాజరైన మాజీలు



న్యూఢిల్లీ: భారత జట్టు చీఫ్ కోచ్ పోస్టు కోసం మాజీ ఆటగాళ్లు గౌతమ్ గంభీర్, డబ్ల్యూవీ రామన్‌లను క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) మంగళవారం ఇంటర్వ్యూ చేసింది. ఆన్‌లైన్‌లో జరిగిన కార్యక్రమంలో గంభీర్, రామన్, సీఏసీ చైర్మన్ అశోక్ మల్హోత్రాలు వర్చువల్‌గా హాజరయ్యారు. 'గంభీర్ ఇంటర్వ్యూ తొలి రౌండ్ ముగిసింది. బుధవారం మరోసారి అతడితో మాట్లాడే చాన్సులున్నాయ'ని బోర్డు అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత రామన్ ఇంటర్వ్యూ కూడా 40 నిమిషాలపాటు జరిగిందని చెప్పారు. కోచ్ రేసులో గంభీర్ ప్రధానంగా ఉండడంతో.. అతడి ఎంపిక లాంఛనమే కానుంది. మరో 48 గంటల్లో అధికారికంగా గౌతీని టీమిండియా కోచ్‌గా ప్రకటించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు కూడా భావిస్తున్నాయి. కాగా, అశోక్‌తో పాటు సీఏసీ సభ్యులు జతిన్ పరాంజపే, సులక్షణ నాయక్‌లు ఏఏ ప్రశ్నలు అడిగారనే సమాచారం ఇంకా బయటకు రాలేదు. రానున్న మూడేళ్లలో జరిగే మెగా టోర్నీలను దృష్టిలో ఉంచుకొని గంభీర్ ఆలోచనలు ఎలా ఉన్నాయనే వాటిపై ప్రధానంగా చర్చ జరిగిందని సమాచారం.

మ్యాక్సీ సెల్ఫ్‌గోల్.. ఫ్రాన్స్ విన్



- 0-1తో ఆస్ట్రియా ఓటమి
- యూరో చాంపియన్‌షిప్

డుస్సెల్‌డోర్ఫ్ (జర్మనీ): యూరోపియన్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఫ్రాన్స్ బోణీ చేసింది. మ్యాక్సీమిలన్ వేబర్ సెల్ఫ్ గోల్‌తో.. గ్రూప్-డిలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ 1-0తో ఆస్ట్రియాపై గెలిచింది. 38వ నిమిషంలో ఫ్రాన్స్ స్టార్ కిలియన్ ఎంబప్పే కొట్టిన కిక్‌ను మ్యాక్సీ హెడర్‌తో క్లియర్ చేసేందుకు యత్నించగా.. దురదృష్టవశాత్తూ బంతి గోల్‌పోస్టులోకి వెళ్లింది. ఆ తర్వాత ఫ్రాన్స్ మరిన్ని దాడులు చేసినా ఆస్ట్రియా సమర్థంగా ఎదుర్కొంది. అయితే, చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకొన్న ఫ్రాన్స్ విజయాన్ని సొంతం చేసుకొంది.

ఎంబప్పే ముక్కు పగిలింది



మ్యాచ్‌లో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబప్పే ముక్కుకు తీవ్ర గాయమైంది. ముక్కు ఎముక చిట్లినట్టు ఫ్రాన్స్ ఫుట్‌బాల్ సమాఖ్య ప్రకటించింది. అయితే, తక్షణం శస్త్రచికిత్స చేయించాల్సిన అవసరం లేదని తెలిపింది. బంతిని అందుకోవడం కోసం గాలిలోకి ఎగిరిన సమయంలో ప్రత్యర్థి ఆటగాడు డాన్సో భుజం బలంగా తగలడంతో ఎంబప్పే ముక్కుకు గాయమైంది. రక్తస్రావం కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం ఆసుపత్రికి తరలించారు. ఇలాంటి దెబ్బలు నయం కావడానికి ఆరు వారాల సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, అతడు మాస్క్ ధరించి ఆడే చాన్సులున్నాయి. 'మాస్క్‌కు ఏదైనా ఐడియా ఉందా?' అని ఎంబప్పే ఎక్స్‌లో పోస్టు చేయడం విశేషం.



రాత్రి 8 గం. నుంచి స్టార్ స్పోర్ట్స్, డిస్నీ హాట్‌స్టార్‌లో..

సఫారీలకు సవాల్

టీ20 వరల్డ్‌కప్

నేడు అమెరికాతో సూపర్-8 మ్యాచ్

నార్త్ సౌండ్: అంచనాలకు భిన్నంగా సాగిన టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ దశ ముగిసింది. పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంకలాంటి పటిష్ట జట్లు లేకుండానే నేటి నుంచి సూపర్-8 మ్యాచ్‌లు సాగనున్నాయి. ఇందులో గ్రూప్-1, గ్రూప్-2లో నాలుగేసి జట్లు పోటీపడనున్నాయి. ప్రతీ జట్టు తమ గ్రూప్‌లోని మిగతా మూడు జట్లతో ఆడాల్సి ఉంటుంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. దీనిలోభాగంగా సూపర్-8లో మొదటి మ్యాచ్ గ్రూప్-2లోని దక్షిణాఫ్రికా-యూఎస్‌ఏ మధ్య జరుగబోతోంది. ఎవరూ ఊహించని విధంగా ఆతిథ్య యూఎస్ జట్టు గ్రూప్ దశను దాటగలిగింది. ఎక్కువగా ప్రవాస భారతీయులతో కూడిన ఈ జట్టు కరీబియన్ గడ్డపైనా తమ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. కెప్టెన్ మోనంక్ పటేల్ ఫిట్‌నె‌స్‌పై స్పష్టత రావాల్సి ఉండగా, ఎప్పటిలాగే పేసర్ నేత్రావల్కర్‌పై భారం పడనుంది.

బౌలింగే బలంగా..: సఫారీలు తమ గ్రూప్ 'డి' దశను అజేయంగా ముగించినా ఆశించిన మేర రాణించలేకపోయారు. కేవలం తమ బౌలర్ల ప్రదర్శనతోనే అతికష్టమ్మీద గట్టెక్కారు. బ్యాటర్లు మాత్రం పసికూన జట్లపైనా బెంబేలెత్తిపోయారు. ఒక్కసారి కూడా 120 పరుగుల మార్క్‌ను దాటలేకపోవడం గమనార్హం. నేపాల్‌పై ఆఖరి బంతికి దారుణ పరాభవం నుంచి బతికిపోయారు. ఇక నుంచి పోరు అత్యంత కీలక దశకు చేరిన నేపథ్యంలో తమ ప్రపంచస్థాయి బ్యాటర్ల నుంచి మెరుగైన ప్రదర్శనను జట్టు ఆశిస్తోంది. డికాక్, హెన్‌డ్రిక్స్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్ మార్‌క్రమ్‌లతో లైనప్ పటిష్ఠంగా కనిపిస్తున్నా.. క్రీజులో నిలువలేకపోతోంది. తమ గ్రూప్‌లోనే ఇంగ్లండ్, విండీస్ కూడా ఉండడంతో సఫారీ బ్యాటర్లు తీవ్ర ఒత్తిడిలోనే బరిలోకి దిగనున్నారు. కానీ బౌలర్లు మాత్రం అద్భుత ఫామ్‌లో ఉండడం సానుకూలాంశం. టోర్నీ ఆరంభానికి ముందు పేసర్ నోకియా ఫామ్‌పై ఆందోళన నెలకొన్నా.. గ్రూప్ దశలో అదరగొట్టాడు. తొమ్మిది వికెట్లతో టోర్నీ సెకండ్ టాపర్‌గా ఉన్నాడు. అటు బార్ట్‌మన్ కూడా జోరు మీదున్నాడు. ఇతర పేసర్లు జాన్సెన్, రబాడ యూఎస్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టేందుకు ఎదురుచూస్తున్నారు.

తుది జట్లు (అంచనా)

దక్షిణాఫ్రికా: డికాక్, హెన్‌డ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కేశవ్/షంసీ, రబాడ, నోకియా, బార్ట్‌మన్.

యూఎస్ఏ: స్టీవెన్ టేలర్, మోనంక్ (కెప్టెన్), గౌస్, జోన్స్, నితీశ్ కుమార్, అండర్సన్, హర్మీత్, జస్దీప్, కెనిగె, అలీ ఖాన్, సౌరభ్ నేత్రావల్కర్.

పిచ్, వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉండనుంది. వర్షం కురిసే అవకాశం 20 శాతమే ఉండడంతో పెద్దగా ఆటంకం ఉండకపోవచ్చు. టోర్నీలో ఇప్పటిదాకా ఈ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించింది. అలాగే చక్కటి బౌన్స్, పేస్ లభించడంతో పేసర్లు కూడా రాణించారు.

ఒలింపిక్స్‌కు ఐదుగురు షాట్‌గన్ షూటర్లు

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత షాట్‌గన్ బృందాన్ని జాతీయ షూటింగ్ సమాఖ్య ప్రకటించింది. మంగళవారం విడుదల చేసిన ఈ జాబితాలో ఐదుగురు షూటర్లకు స్థానం దక్కింది. పృథ్వీరాజ్ తొండైమన్, రాజేశ్వరీ కుమారి, అనంత్‌జీత్ సింగ్, రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్‌కు పారిస్ బెర్త్‌లు లభించాయి. సీనియర్ షూటర్ పృథ్వీరాజ్ ఈ షాట్‌గన్ బృందాన్ని నడిపించనున్నాడు. ఈ ఐదుగురికి ఒలింపిక్స్‌లో ఆడడం ఇదే తొలిసారి.

ఐదు రోజుల్లోనే మ్యాచ్‌లన్నీ..



భారత్ షెడ్యూల్ బిజీ

బ్రిడ్జ్‌టౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో గ్రూప్ 'ఏ' దశను అజేయంగా ముగించిన టీమిండియా ఇప్పుడు సూపర్-8పై దృష్టి సారించింది. అయితే ఇందులో భాగంగా విండీస్ గడ్డపై ఐదు రోజుల వ్యవధిలోనే భారత్ మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈనెల 20న అఫ్ఘాన్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, ఆ తర్వాత 22న బంగ్లా, 24న ఆసీస్‌తో తలపడుతుంది. మరోవైపు ఇలాంటి కఠిన సవాల్‌ను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని కెప్టెన్ రోహిత్ చెబుతున్నాడు. 'సూపర్-8లో మ్యాచ్‌ల మధ్య మాకు ఎక్కువ సమయం లేదు. ఐదు రోజుల వ్యవధిలోనే మూడు మ్యాచ్‌లను ఆడాల్సి ఉంటుంది. అలాగే ప్రయాణాలు కూడా తప్పవు. ఇది హడావిడిగా కనిపించినా.. మేం దీన్ని ఓ సాకుగా చెప్పాలనుకోవడం లేదు' అని రోహిత్ తెలిపాడు.

వరల్డ్‌కప్‌లో ఫిక్సింగ్ కలకలం

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): క్రికెట్‌లో మరోసారి ఫిక్సింగ్ కలకలం రేగింది. తాజాగా టీ20 వరల్డ్‌కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కోసం కెన్యా మాజీ ఆటగాడు ఒకరు.. ఉగాండా ప్లేయర్‌ను పలువిధాలుగా సంప్రదించడానికి ప్రయత్నించాడట. అయితే, సదరు ఉగాండా ఆటగాడు ఈ విషయాన్ని ఐసీసీ అవినీతి నిరోధక యూనిట్‌కు ఫిర్యాదు చేశాడట. గయానాలో జరిగిన లీగ్ మ్యాచ్‌ల సందర్భంగా కెన్యా మాజీ ఆటగాడు పలు ఫోన్ నెంబర్లతో ఉగాండా ఆటగాడిని సంప్రదించడానికి ప్రయత్నించాడని తెలిసింది. సమాచారం అందుకొన్న అవినీతి నిరోధక యూనిట్.. అతడి గురించి మిగతా జట్లను అప్రమత్తం చేసింది.

పూరన్ ధనాధన్




అఫ్ఘాన్‌పై విండీస్ విజయం

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): నికోలస్ పూరన్ (53 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 98) దూకుడైన ఆటతీరుతో చెలరేగాడు. దీంతో మంగళవారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన గ్రూప్ 'సి' ఆఖరి మ్యాచ్‌లో వెస్టిండీస్ 104 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే ఓటమనేదే లేకుండా 8 పాయింట్లతో ఆతిథ్య జట్టు టాప్‌లో నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోరు సాధించింది. చార్లెస్ (43), పావెల్ (26), హోప్ (25) రాణించారు. ఆఖరి ఓవర్‌లో పూరన్ రనౌట్ కావడంతో త్రుటిలో శతకం కోల్పోయాడు. గుల్బదిన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో అఫ్ఘాన్ 16.2 ఓవర్లలో 114 పరుగులకు కుప్పకూలింది. ఇబ్రహీం జద్రాన్ (38), ఒమర్జాయ్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. మెకాయ్‌కు మూడు.. హోసీన్, మోటీలకు రెండేసి వికెట్లు దక్కాయి.

బిజినెస్

వడ్డీ రేట్ల తగ్గింపుపై తొందరపడం



- సాహసాలు చేసే ఆలోచనా లేదు
- పసిడి నిల్వలు ఇంకా పెంచుకుంటాం
- ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

ముంబై: వడ్డీ రేట్ల తగ్గింపునకు తొందర లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. ప్రస్తుత ద్రవ్య, పరపతి విధానం కొనసాగుతుందన్నారు. ఈటీ నౌ బిజినెస్ న్యూస్ చానల్ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం తెలిపారు. రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా నాలుగు శాతంపైనే ఉన్న నేపథ్యంలో కీలక రెపో రేటు తగ్గించే సాహసం చేయదలచుకోలేదన్నారు. రిటైల్ ద్రవ్యోల్బణం కొంత తగ్గినా, ఆహార ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిలోనే ఉన్న విషయాన్ని దాస్ గుర్తు చేశారు. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం నిదానంగా తగ్గుముఖం పడుతోందన్న తమ అంచనాల్లో మార్పు లేదన్నారు.

ఫారెక్స్ నిల్వలు పెంచుకుంటాం: ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకునేందుకు వీలుగా విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలు పెంచుకునే తమ విధానం కొనసాగుతుందని దాస్ స్పష్టం చేశారు. ఫారెక్స్ నిల్వల వివిధీకరణలో భాగంగా బంగారం నిల్వలు పెంచుకునే వ్యూహం కూడా కొనసాగుతుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు ఆర్‌బీఐ అంచనా వేసిన 7.2 శాతం కంటే ఎక్కువే ఉండే అవకాశం ఉందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మూలధన ఖాతా (సీఏడీ) లోటూ జీడీపీలో 1.2 శాతాని కంటే తక్కువే ఉంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. స్టాక్ మార్కెట్ ఎఫ్ అండ్ ఓలో వ్యాపార లావాదేవీలు భారీగా పెరగడాన్నీ నిశితంగా గమనిస్తున్నట్టు దాస్ తెలిపారు. అయితే ఈ విషయంలో పరిస్థితులు అదుపు తప్పితే సెబీనే చర్యలు తీసుకుంటుందని అన్నారు.

77,000 ఎగువకి సెన్సెక్స్



23,500 స్థాయిని దాటిన నిఫ్టీ

- సరికొత్త గరిష్ఠాలకు సూచీలు
- రూ.437 లక్షల కోట్లకు మార్కెట్ క్యాప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ తొలిసారిగా 77,000 ఎగువన ముగియగా.. నిఫ్టీ 23,500 మార్క్‌ను దాటింది. ఇన్ఫోసిస్, విప్రోతో పాటు ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు, గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాలూ సూచీల ర్యాలీకి కలిసివచ్చాయి. ఒక దశలో సెన్సెక్స్ 374 పాయింట్లు ఎగబాకి 77,366.77 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును తాకి చివరికి 308.37 పాయింట్ల లాభంతో 77,301.14 సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒకదశలో 113.45 పాయింట్ల వృద్ధితో 23,579.05 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని, చివరికి 92.30 పాయింట్ల లాభంతో 23,557.90 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును నమోదు చేసింది. అలాగే, ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.437.24 లక్షల కోట్లకు చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో మార్కెట్ సంపద రూ.10.29 లక్షల కోట్లు పెరిగింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 లాభపడ్డాయి.

ఇక్సిగో షేర్ల బంపర్ లిస్టింగ్

తొలిరోజే 78 శాతం వృద్ధి

ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ ఇక్సిగో మాతృ సంస్థ లే ట్రావెన్యూస్ టెక్నాలజీ లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.93తో పోలిస్తే, ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు 48.49 శాతం ప్రీమియంతో రూ.138.10 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో మరింత పుంజుకున్న షేరు.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 78.19 శాతం లాభంతో రూ.165.72 వద్దకు చేరుకుంది. గత బుధవారంతో ముగిసిన లే ట్రావెన్యూస్ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 98.10 రెట్ల సబ్‌స్ర్కిప్షన్ లభించింది.

ఇండస్ టవర్స్‌లో 10% వాటా విక్రయించనున్న వొడాఫోన్

మొబైల్ టవర్ల నిర్వహణ సంస్థ ఇండస్ టవర్స్‌లో దాదాపు 10 శాతం వాటాకు సమానమైన 26.8 కోట్ల ఈక్విటీ షేర్లను వొడాఫోన్ గ్రూప్ ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్ ద్వారా బుధవారం విక్రయించనుంది. తద్వారా వొడాఫోన్‌కు 110 కోట్ల డాలర్ల (రూ.9,185 కోట్లు) వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఇండస్ టవర్స్‌లో వొడాఫోన్ గ్రూప్ 21.5 శాతం వాటా కలిగి ఉంది.

పన్ను వసూళ్ల జోరు

న్యూఢిల్లీ: దేశంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు అమిత వేగంగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ 17 నాటికి నికరంగా రూ.4,62,664 కోట్లు పన్ను వసూలైనట్టు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రూ.1,80,949 కోట్లు కార్పొరేట్ ఆదాయపు పన్నుగాను, రూ.2,81,013 కోట్లు వ్యక్తిగత ఆదాయపు పన్నుగాను వసూలయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన పన్ను వసూళ్ల కన్నా ఇది 21 శాతం అధికం. ఇదే తేదీ నాటికి రిఫండ్ల కింద రూ.53,322 కోట్లు బట్వాడా చేశారు. అడ్వాన్స్ టాక్స్ వసూళ్లు పెరగడమే ఇందుకు కారణం. జూన్ 15వ తేదీ నాటికి అందవలసిన అడ్వాన్స్ టాక్స్ తొలి వాయిదా కింద రూ.1.48 లక్షల కోట్లు వసూలైంది.

హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ ఆర్ అండ్ డీ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ హైదరాబాద్ శివార్లలోని పటాన్‌చెరులో అత్యాధునిక ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ప్రారంభించింది. మినరల్ ప్రాసెసింగ్‌లో ఇన్నోవేషన్‌ను, సుస్థిర స్టీల్ టెక్నాలజీని ఇది ప్రోత్సహిస్తుంది. గత ఐదేళ్ల కాలంలో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై రూ.150 కోట్లు ఇన్వెస్ట్ చేశామని, కొత్త ఆర్ అండ్ డీ కేంద్రం స్థాపనకు రూ.50 కోట్లు ఖర్చు చేశామని కంపెనీ తెలిపింది. పటాన్‌చెరులో ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఎన్ఎండీసీ సీఎండీ (అదనపు చార్జి) అమితవ ముఖర్జీ ఇతర డైరెక్టర్లు, సీనియర్ అధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఇందులో నిపుణుల పర్యవేక్షణలో ఆధునిక లేబరేటరీలు ఉంటాయి.

50వ వసంతంలోకి సంగీత మొబైల్స్

వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు



సంగీత మొబైల్స్ ఎండీ సుభాష్ చంద్ర

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద మొబైల్ రిటైల్ వ్యాపార సంస్థ సంగీత మొబైల్స్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. సంగీత గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా మొబైల్స్ కొనుగోలుపై వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ చంద్ర తెలిపారు. 50 ఏళ్ల క్రితం బెంగళూరు జేసీ రోడ్‌లో గ్రామ్‌ఫోన్ రికార్డులతో వ్యాపార ప్రస్థానాన్ని ప్రారంభించిన సంగీత.. కాలానుగుణంగా రేడియోలు, క్యాసెట్స్, హోం అప్లయెన్సెస్, టెలివిజన్స్, రిఫ్రిజిరేటర్లు, ఆడియో సీడీలు, వీడియో డీవీడీల వరకు తన కార్యకలాపాలను విస్తరించుకుంటూ వచ్చిందని వెల్లడించారు. టెలికాం విప్లవంతో గడిచిన రెండున్నర దశాబ్దాలుగా మొబైల్స్ రంగంలో తిరుగులేని సంస్థగా సంగీత మొబైల్స్ అవతరించిందని ఆయన తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలే కాకుండా ఉత్తరాది మార్కెట్లోకి సంగీత అడుగుపెట్టిందని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 800లకు పైగా షోరూమ్‌లను నిర్వహిస్తునట్లు సుభాష్ చంద్ర పేర్కొన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా మొబైల్స్ కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే సంగీతలో ప్రైస్‌డ్రాప్, డ్యామేజ్ ప్రొటెక్షన్ కల్పిస్తుండగా తాజాగా లక్కీడీప్ ద్వారా 50 కార్లను బహుమతిగా అందించనున్నట్లు ఆయన చెప్పారు. అలాగే రూ.10 లక్షల వ్యక్తిగత బీమాను ఆఫర్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా ఆఫర్లలో భాగంగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై వినియోగదారుడికి 50 శాతం క్యాష్‌బ్యాక్‌ను అందించనున్నట్లు చెప్పారు. మొబైల్స్‌తో పాటు అన్ని రకాలైన ఎలక్ట్రిక్ ఉత్పత్తులను సంగీతలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే బెంగళూరులో త్వరలోనే సంగీత మల్టీ స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత వీటిని మరింతగా విస్తరించనున్నట్లు సుభాష్ చంద్ర తెలిపారు.

గ్లాండ్ ఫార్మాకు ఫోసన్ ఫార్మా గుడ్‌బై!

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే గ్లాండ్ ఫార్మా కంపెనీ నుంచి చైనా కంపెనీ ఫోసన్ ఫార్మా తప్పుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా వచ్చే వారం ఈ కంపెనీ ఈక్విటీలో తనకు ఉన్న 58 శాతం వాటాలో కొంత భాగాన్ని బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించబోతున్నట్టు సమాచారం. 2011లో గ్లాండ్ ఫార్మా ఈక్విటీలో 74 శాతం వాటాను కేకేఆర్ అండ్ కంపెనీ వంటి ప్రైవేట్ ఈక్విటీ సంస్థల నుంచి ఫోసన్ ఫార్మా 110 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది. అందులో ఇప్పటికే 16 శాతం వాటాను వివిధ సంస్థలకు విక్రయించింది. మంచి ధర వస్తే మిగిలిన వాటాను కూడా బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించాలని నిర్ణయించినట్టు సమాచారం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,220 ▼	66,200 ▼	96,000 ▲
ముంబై	71,285 ▼	65,295 ▼	87,553 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	485
వరంగల్	502	గోదావరి	480
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	139	విజయవాడ	145
వరంగల్	139	గుంటూరు	145
కరీంనగర్	139	ఒంగోలు	145
మహబూబ్‌నగర్	139	చిత్తూరు	140
కర్నూలు	139	నెల్లూరు	140
విశాఖపట్నం	136	అనంతపురం	145
గోదావరి	145		

రియల్టీ హాట్‌స్పాట్స్‌గా తిరుపతి, విశాఖపట్నం

కోలియర్స్ ఇండియా వెల్లడి

న్యూఢిల్లీ: వచ్చే కొద్ది సంవత్సరాల్లో దేశంలోని 17 ద్వితీయ శ్రేణి నగరాల్లో స్థిరాస్తి (రియల్టీ) రంగం వేగంగా అభివృద్ధి చెందనుంది. ఈ జాబితాల్లో వారణాసి, అయోధ్య, పూరి, ద్వారక, షిర్డీ, అమృత్‌సర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విశాఖపట్నం నగరాలు కూడా ఉన్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకం, మౌలిక సదుపాయాలు, డిజిటైజేషన్, రైలు, రోడ్డు, విమాన రవాణా వంటి సదుపాయాలు ఇందుకు కలిసి వస్తాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ కోలియర్స్ ఇండియా తెలిపింది. వందకుపైగా ద్వితీయ శ్రేణి నగరాలను పరిశీలించి కోలియర్స్ ఇండియా మొత్తం 30 నగరాలను ఎంపిక చేసింది. మళ్లీ ఇందులో తిరుపతి, వైజాగ్‌తో సహా 17 నగరాల్లో స్థిరాస్తి రంగం మధ్య, దీర్ఘ కాలంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని అంచనా వేసింది. దీంతో భారత రియల్ ఎస్టేట్ రంగం 2030 నాటికి లక్ష కోట్ల డాలర్లకు, 2050 నాటికి ఐదు లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని పేర్కొంది. డేటా కేంద్రాలు, సీనియర్ సిటిజన్ల నివాసాలు, రెండో ఇల్లు కావాలనే కోరికలు కూడా ఈ నగరాల్లో స్థిరాస్తి రంగ అభివృద్ధికి కలిసి రానున్నాయి.

7 నగరాల్లో పెరిగిన అద్దెలు

హైదరాబాద్‌తో సహ దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో నివాస గృహాల అద్దెలు పెరిగాయి. ఈ ఏడాది జనవరి-ఫిబ్రవరితో పోలిస్తే, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఈ పెరుగుదల సగటున 2 నుంచి 4 శాతం వరకు ఉందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. అయితే ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో పెరిగిన 4-9 శాతంతో పోలిస్తే.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అద్దెల పెరుగుదల స్వల్పంగానే ఉంది. నివాస గృహాల అందుబాటు పెరగడం ఇందుకు ప్రధాన కారణం. 2024 జనవరి-మార్చి త్రైమాసికంతో పోలిస్తే ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతంలో నివాస గృహాల నెలవారీ అద్దెలు 3 శాతం పెరిగాయని తెలిపింది.

భారత్‌లో ఎయిర్‌బస్ హెలికాప్టర్ల తయారీ

పరిశీలనలో హైదరాబాద్!

ముంబై: ఎయిర్‌బస్ మరో 'భారత్‌లో తయారీ'కి సిద్ధమవుతోంది. తన హెచ్ 145, హెచ్ 125 హెలికాప్టర్లను భారత్‌లో తయారు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే టాటా గ్రూప్‌తో జట్టు కట్టింది. దీంతో ఈ రెండు సంస్థలు.. ఈ హెలికాప్టర్ల తయారీ ప్రాంతాన్ని ఎంపిక చేసే ప్రయత్నంలో ఉన్నాయి. ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ (ఇండియా, దక్షిణాసియా) చీఫ్ సన్నీ గుగ్లానీ ఈ విషయం వెల్లడించారు. స్థల ఎంపిక పూర్తయితే, వెంటనే ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి 2026లో మూడు హెలికాప్టర్ల అసెంబ్లింగ్ పూర్తి చేస్తామని గుగ్లానీ చెప్పారు. ఆ తర్వాత ఈ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతామన్నారు. టాటా గ్రూప్ ఇప్పటికే హైదరాబాద్‌లో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) పేరుతో బోయింగ్, సికోర్స్కీ కంపెనీల హెలికాప్టర్ విడిభాగాలను తయారు చేసి అసెంబ్లింగ్ చేస్తోంది. దీంతో ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ కూడా తన హెలికాప్టర్ల అసెంబ్లింగ్ కోసం హైదరాబాద్‌నే ఎంచుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

2 రియల్ ఎస్టేట్ సంస్థలకు 'రెరా' నోటీసులు

హైదరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థలపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) కొరడా ఝుళిపిస్తోంది. సొనెస్టా ఇనిఫినిటీ, హస్తిన రియాల్టీ సంస్థలకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు రెరా చైర్మన్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. సొనెస్టా ఇనిఫినిటీ.. గచ్చిబౌలి కేర్ ఆస్పత్రి వెనుక ఉన్న జయభేరి పైన్ కాలనీలో స్కై విల్లాస్ నిర్మాణానికి రెరాలో రిజిస్ట్రేషన్ కాకుండానే సామాజిక మాధ్యమాల ద్వారా బ్రోచర్ విడుదల చేసి ప్రచారం చేపట్టిందన్నారు. హస్తిన రియాల్టీ.. బ్రిస్సా పేరుతో శ్రీశైలం హైవే సమీపంలోని కడ్తాల్ ఫార్మా సిటీ వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు ప్రచారం సాగిస్తోందన్నారు. ఈ రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాల్సిందిగా నోటీసులు జారీ చేశామన్నారు. ప్రీలాంచ్ ఆఫర్లు, మోసపూరిత ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన రియల్టర్లు, భవన నిర్మాణదారులపై వాట్సాప్ నంబరు 9000006301కి, ఫోన్ నంబరు 040-29394972తో పాటు reramaud@telangana.gov.in, secyreramaud@telangana.gov.inకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

'భద్రాద్రి రామయ్య గోత్రప్రవరల'పై విచారణ షురూ

భద్రాచలం, జూన్ 18: భద్రాద్రి రామయ్య గోత్ర ప్రవరల విషయంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఏర్పాటైన ఐదుగురు సభ్యుల కమిటీ మంగళవారం భద్రాచలం చేరుకుంది. ఈ కమిటీ తొలి రోజు రామాలయంలో పని చేసే వైదిక సిబ్బంది, విశ్రాంత వైదిక సిబ్బంది నుంచి అభిప్రాయాలను సేకరించింది. వాస్తవానికి వైదిక సిబ్బంది ఇప్పటికే తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా సీల్డ్ కవర్‌లో దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు పంపారు. కానీ, వారి అభిప్రాయాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు కమిటీ సభ్యులు భద్రాచలం వచ్చినట్లు తెలుస్తోంది. కాగా కొందరు వైదిక సిబ్బంది తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు కమిటీ ముందుకు రాలేదని సమాచారం. ఆలయ విశ్రాంత వైదిక సిబ్బంది నుంచి సైతం కమిటీ అభిప్రాయాలను సేకరించింది. మరోవైపు కమిటీ అభిప్రాయ సేకరణ సమయంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను అధికారులు అనుమతించలేదు. రామయ్య గోత్ర ప్రవరల అంశం హైకోర్టు పరిధిలో ఉండడంతో తాము అనుమతించలేదని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

కవితను కలిసిన సబిత, సత్యవతి

న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ కలిశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు తిహాడ్ జైలుకు వెళ్లి కవితతో సుమారు 20 నిమిషాల పాటు ములాఖత్ అయ్యారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. వేసవి సెలవుల కంటే ముందే తీర్పు ఇస్తామని న్యాయమూర్తి చెప్పడంతో బెయిల్ వస్తుందని కవిత ఆశించారు. కానీ హైకోర్టు తీర్పు వెల్లడించలేదు. ఈ నెలంతా హైకోర్టుకు సెలవులు ఇన్నాయి. ఈ విషయాలను సబిత, సత్యవతిల వద్ద కవిత ప్రస్తావించినట్టు తెలిసింది.

ఖమ్మంలో నేడు, రేపు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభలు

- ముఖ్య అతిథులుగా మంత్రులు పొంగులేటి, తుమ్మల
- ముగింపు వేడుకలకు రానున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

ఖమ్మం, జూన్18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభలు బుధ, గురువారాల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. స్థానిక ఉషాహరి కన్వెన్షన్ హాల్‌లోని అమర్‌నాథ్ ప్రాంగణంలో నిర్వహించే ఈ సభలను సమాచార, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల గురించి చర్చించడంతో పాటు 11 అంశాలపై తీర్మానం చేయనున్నారు. గురువారం జరిగే ముగింపు వేడుకలకు ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరుకానున్నారు.

మెట్రోను సంగారెడ్డి వరకు పొడిగించండి

- సంస్థ ఎండీకి ఎంపీ రఘునందన్ వినతి

పటాన్‌చెరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణలో మియాపూర్ నుంచి పటాన్‌చెరు మీదుగా సంగారెడ్డి వరకు పొడిగించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. మెట్రో సంస్థ ఎండీ ఎన్వీఎస్.రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం రఘునందన్ మాట్లాడారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతానికి మెట్రోరైలును తక్షణమే విస్తరించాలన్నారు. నెలలో డీపీఆర్ తయారు చేసి సీఎం దృష్టికి తీసుకెళతామని, ఆయన ఆమోదం పొందిన వెంటనే ఆ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని మెట్రో ఎండీ హామీ ఇచ్చినట్లు సమాచారం.

ఆర్టిజన్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న 22వేల మంది కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలను తక్షణం క్రమబద్ధీకరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తున్నామని ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చివరకు ఆర్టిజన్లుగా పేర్కొంటూ వారి జీవితాలను త్రిశంకు స్వర్గంలోకి నెట్టిందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాణి రుద్రమ మీడియాతో మాట్లాడారు. పదేళ్లలో కేసీఆర్ సర్కారు ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలైనా ఎందుకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని నిలదీశారు.

నర్సీపట్నం నుంచి హాష్ ఆయిల్ అక్రమ రవాణా

- ముగ్గురి అరెస్టు.. 20లక్షల విలువైన ఆయిల్ స్వాధీనం
- రూ. కోటి విలువైన అల్ప్రాజోలం పట్టివేత

భువనగిరి రూరల్/హైదరాబాద్ సిటీ/గుమ్మడిదల, జూన్ 18: ఏపీలోని నర్సీపట్నం నుంచి గంజాయి హాష్ ఆయిల్‌ను అక్రమంగా రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు స్మగ్లర్లను, ఒక వినియోగదారున్ని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 2 లీటర్ల హాష్ ఆయిల్, ఒక కారు, మూడు ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ రూ. 20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ బోరబండ అల్లాపూర్‌కు చెందిన పెరుసాముల దినేష్, అమర్లూరి హానెస్ట్ స్నేహితులు. ఇద్దరూ గంజాయి, హాష్ ఆయిల్‌కు అలవాటుపడ్డారు. ఆ తర్వాత దాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకున్నారు. నర్సీపట్నం నుంచి తక్కువ ధరకు హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి గుట్టుగా నగరానికి తెచ్చి వారు తీసుకోవడంతో పాటు.. ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. భువనగిరి పరిధిలోని ఓ కాలేజీ విద్యార్థులను టార్గెట్ చేసుకొని హాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు రంగంలోకి దిగి దినేష్, హానెస్ట్‌లను అరెస్టు చేయడంతో పాటు.. హాష్ ఆయిల్‌ను వినియోగిస్తున్న బోరబండకు చెందిన తాళ్లపల్లి భరణిని భువనగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలో కొత్తపల్లిలో నిషేధిత ఆల్ప్రాజోలం తయారీ కేంద్రంపై టీఎస్ న్యాబ్, సంగారెడ్డి జిల్లా పోలీసులు దాడులు చేశారు. సుమారు రూ. కోటి విలువ గల 2.6 కిలోల ఆల్ప్రాజోలం, ఆల్ప్రాజోలం తయారీ ముడిపదార్థాలను సీజ్ చేశారు. తయారీ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ తనిఖీ చేశారు. అంజిరెడ్డి, రాజేశ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

బీటెక్ విద్యార్థి డ్రగ్స్‌కు బానిసై, స్మగ్లర్‌గా మారి..

డ్రగ్స్‌కు అలవాటుపడటంతో పాటు.. దానిని విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. రాచకొండ సీపీ తరుణ్‌జోషి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ హయత్‌నగర్‌కు చెందిన అత్తాపురం భరత్‌రెడ్డి బీటెక్ చదువుతున్నాడు. వనస్థలిపురానికి చెందిన 19 ఏళ్ల చిక్కాల విక్యాత్ అతని స్నేహితుడు. ఇద్దరూ కలిసి డ్రగ్స్‌కు అలవాటుపడ్డారు. డ్రగ్స్‌ను కొనుగోలు చేయడానికి అవసరమైన డబ్బు సంపాదన కోసం అక్రమార్గం పట్టారు. ఎక్కడైతే డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారో వారి ద్వారానే డ్రగ్స్ సరఫరా చేసేలా ప్లాన్ చేసుకున్నారు. బెంగళూరు వెళ్లి ఎండీఎంఏ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి.. వారు తీసుకోవడంతో పాటు కొంతమొత్తాన్ని అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌వోటి పోలీసులుభరత్‌రెడ్డి, విక్యాత్‌ను పట్టుకున్నారు. వారితో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న తన్నీరు హేమంత్‌కుమార్‌నూ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 4లక్షల విలువైన 26 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు.

వాణిజ్య ప్రకటనలకు స్వీయధ్రువీకరణ

మంగళవారం నుంచి అమల్లోకి కొత్త నిబంధన.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విధించిన కేంద్రం

- కొత్త యాడ్స్‌కే పరిమితం.. పాతవాటికి వర్తించదు
- ఈ నిబంధనతో ఇబ్బందే: ప్రకటనకర్తలు

న్యూఢిల్లీ, జూన్ 18: వాణిజ్య ప్రకటనలకు 'స్వీయ ధ్రువీకరణ పత్రం' సమర్పించడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం తెచ్చిన నిబంధన మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది! రాందేవ్‌బాబా పతంజలి కేసును విచారించిన సుప్రీంకోర్టు.. ప్రకటన కర్తలు, ఏజెన్సీలు మీడియాకు వాణిజ్యప్రకటనలు ఇచ్చేటప్పుడు స్వీయధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సిందేనంటూ మే 7న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఆ తీర్పు మేరకు.. ఈ నెల 3న కేంద్ర సమాచార ప్రసార శాఖ స్వీయధ్రువీకరణను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ నిబంధనను వెంటనే అమల్లోకి తేకుండా.. ప్రకటనకర్తలు/ఏజెన్సీలు ఈ నిబంధనను పాటించడానికి రెండు వారాల గడువు ఇచ్చింది. 18వ తేదీ, ఆ తర్వాత నుంచి ప్రచురించే/ప్రసారం చేసే అన్ని కొత్త వాణిజ్యప్రకటనలకూ స్వీయధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రచురిస్తున్న/ప్రసారం చేస్తున్న ప్రకటనలకు మాత్రం ప్రస్తుతానికి ఈ నిబంధన వర్తించదని కేంద్రం వెల్లడించింది. టీవీ/రేడియోలో ఇచ్చే వాణిజ్య ప్రకటనలకు అడ్వర్టైజర్లు సమాచార, ప్రసార శాఖకు చెందిన 'బ్రాడ్‌కాస్ట్ సేవా పోర్టల్‌లో'.. ప్రింట్/డిజిటల్ మీడియాలో ఇచ్చే వాణిజ్య ప్రకటనలకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పోర్టల్‌లోను స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని వివరించింది. ఆ రెండు పోర్టళ్లలో ఇందుకు తగిన ఏర్పాట్లు చేసినట్టు పేర్కొంది.

ఏమని ధ్రువీకరించాలంటే..

తమ వాణిజ్య ప్రకటనలో తప్పుదోవ పట్టించే వివరాలేవీ లేవని.. తమ వాణిజ్య ప్రకటన సంబంధిత నియంత్రణ నిబంధనలకు లోబడే ఉందని.. ప్రకటనకర్తలు/ఏజెన్సీలు తాము సమర్పించే స్వీయధ్రువీకరణ పత్రంలో స్పష్టం చేయాలి. ఈ పత్రాన్ని సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, అలా అప్‌లోడ్ చేసినట్టుగా రుజువును.. ఆ వాణిజ్యప్రకటనను ప్రచురించే/ప్రసారం చేసే మీడియా ప్లాట్‌ఫామ్‌కు సమర్పించాలి. స్వీయధ్రువీకరణ పత్రం లేనిదే ప్రసారమాధ్యమాలు వాటిని ప్రచురించకూడదు/ప్రసారం చేయకూడదు. వినియోగదారుల హక్కుల సంరక్షణ, పారదర్శకత, సహేతుకమైన వాణిజ్యప్రకటనల విధానాన్ని ప్రోత్సహించేందుకే.. సుప్రీం ఆదేశాల మేరకు తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్రం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏజెన్సీల ఆందోళన..

స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచే ప్రకటనకర్తలు, ఏజెన్సీలు ఈ నిబంధనపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిబంధన.. 'పిడుక్కి, బియ్యానికి ఒకటే మంత్రం' అన్న చందంగా ఉందన్న వాణిజ్యప్రకటనల పరిశ్రమ పెద్దల మాట. చిన్న చిన్న వ్యాపారాల నుంచి పెద్ద, భారీ వ్యాపారాల దాకా అన్నింటికీ ఒకటే నిబంధన పెట్టడం వల్ల ఉపయోగం ఉండదని వారు చెబుతున్నారు. ఉదాహరణకు.. కాలనీలో చిన్న బేకరీ నడుపుకొనే వ్యక్తి గూగుల్‌లో ప్రకటన ఇవ్వాలన్నా స్వీయధ్రువీకరణ తప్పనిసరి అని.. ఇలాంటివాటి వల్ల చిన్న వ్యాపారాలకు ఇబ్బంది అని వారి వాదన. అలాగే.. 2023లో భారతదేశంలో 34 కోట్ల డిజిటల్ వాణిజ్య ప్రకటనలు, 8.6 కోట్ల టీవీ యాడ్స్, 30 లక్షల పత్రికా ప్రకటనలు వచ్చాయని.. వాటన్నింటికీ స్వీయధ్రువీకరణపత్రాలు అప్‌లోడ్ చేస్తే సంబంధిత పోర్టళ్లు వీటితోనే నిండిపోతాయని, సమాచార-ప్రసార శాఖ సిబ్బంది వాటన్నింటినీ చూడలేక యాంత్రికంగా ఆమోదిస్తే అసలు ఈ నిబంధన వల్ల ఉపయోగమే ఉండదని యాడ్స్ ఇండస్ట్రీ పెద్దలు చెబుతున్నారు. వారే కాదు.. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 'ద ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ)' కూడా ఈ నిబంధనపై అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. డిజిటల్ వాణిజ్యప్రకటనల రంగం సంప్రదాయ మీడియాకు భిన్నమైనదని.. ఐటీ చట్టం, వినియోగదారుల సంరక్షణ చట్టం సహా పలు చట్టాల నియంత్రణలో ఉంటుందని వివరిస్తూ ఐఏఎంఏఐ ప్రభుత్వానికి ఇప్పటికే ఒక లేఖ రాసింది. 2025 నాటికి డిజిటల్ వాణిజ్య ప్రకటనల రంగం వృద్ధి రూ.62 వేల కోట్లకు చేరుకునే అవకాశాన్ని ఈ నిబంధన దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

నియంత్రణ ఉన్నా..

పత్రికల్లో, టీవీల్లో వచ్చే యాడ్స్‌పై మనకు ఏవైనా అభ్యంతరాలుంటే వాటిపై ఫిర్యాదు చేసేందుకు 'భారత వాణిజ్య ప్రకటనల ప్రమాణాల మండలి (ఏఎస్‌సీఐ)' ఉంది. ఆ సంస్థ తనకు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి వాటిని పరిష్కరిస్తుంది. ఏఎస్‌సీఐ చేసే సూచనలను అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు తప్పనిసరిగా స్వీకరించి, పాటిస్తాయి. ఇలా ఇప్పటికే ఒక వ్యవస్థ ఉండగా.. కొత్తగా ఈ స్వీయధ్రువీకరణ దేనికనే ప్రశ్న వినిపిస్తోంది.

ఐఎన్ఎస్ లేఖ..

వాణిజ్య పరిశ్రమ నుంచే కాక.. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కూడా ఈ నిబంధనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉదాహరణకు.. 800కు పైగా ప్రచురణసంస్థలను సభ్యులుగా కలిగిన 'ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్)' ఈ నిబంధనపై ఆందోళన వెలిబుచ్చుతూ కేంద్రానికి ఇప్పటికే ఒక లేఖ రాసింది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ దిశగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే.. దీంట్లో ఉన్న నిర్వహణ సమస్యల గురించి అందులో ప్రస్తావించింది. ఈ నిబంధన వల్ల ప్రకటనకర్తలు, పబ్లిషర్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్, ఇంటర్‌నెట్/డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై పడే ప్రభావాల గురించి ప్రభుత్వం పూర్తిగా ఆలోచించలేదని అభిప్రాయపడింది. చిన్నవ్యాపారులు ఇచ్చే చాలా ప్రకటనల్లో కేవలం వివరాలు మాత్రమే ఉంటాయని.. 'తమ ఔషధం అన్ని రోగాలనూ తగ్గించేస్తుంది' తరహా క్లెయిములేవీ వాటిలో ఉండవని.. గుర్తుచేసింది. చిన్నవ్యాపారాలు చేసుకునే చాలా మందికి పరిమిత వనరులే ఉంటాయని.. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వల్ల వారు సంబంధిత పోర్టల్‌లో స్వీయధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయలేరని వివరించింది. అలాగే.. కొన్ని ప్రకటనలు అప్పటికప్పుడు ఇచ్చేవి ఉంటాయని, అలాంటివాటికి ఈ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేసే సమయం ఉండకపోవచ్చని పేర్కొంది. ఆ ప్రక్రియ సకాలంలో పూర్తికాక.. ఆ యాడ్ రాకపోతే సదరు వ్యాపార సంస్థ నష్టాలపాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చింది.

జగనన్న విదేశీ విద్యా దీవెన' ఇక అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి!

- సీఎంగా జగన్ ఈ పథకానికి తన పేరు
- ప్రక్షాళన మొదలుపెట్టిన కొత్త ప్రభుత్వం
- వైఎస్, జగన్ పేరిట ఉన్న పథకాలకు తిరిగి పాత పేర్లు పెడుతూ ఉత్తర్వులు

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీలో నాడు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అంతకు ముందున్న ప్రభుత్వ పథకాల పేర్లను తీసేసింది. చివరకు షెడ్యూలు కులాల విద్యార్థుల విదేశీ విద్యను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన 'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి' పథకంలోని అంబేడ్కర్ పేరును సైతం తొలగించింది. దానిని 'జగనన్న విదేశీ విద్యా దీవెన'గా మార్చివేసింది. టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు పేరు ప్రక్షాళనకు పూనుకుంది. ఆ పథకానికి గతంలో ఉన్న పేరునే కొనసాగిస్తూ ఆదేశాలు జారీచేసింది. నాడు జగన్ పలు సంక్షేమ పథకాలకు తండ్రి వైఎస్ఆర్ పేరు, తన పేరును జోడించేవారు. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలు సులభంగా తెలుసుకునేలా ఆయా పథకాల పేర్లను మార్చాలంటూ ఆదేశాలిచ్చారు. జగనన్న విద్యాదీవెన పథకానికి.. 'పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్(ఆర్‌టీఎఫ్)'గా, జగనన్న వసతి దీవెన పథకానికి 'పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ (ఎంటీఎఫ్)'గా, వైఎస్ఆర్ కల్యాణమస్తు పథకానికి 'చంద్రన్న పెళ్లి కానుక'గా, వైఎస్ఆర్ విద్యోన్నతి పథకానికి.. 'ఎన్టీఆర్ విద్యోన్నతి', జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి 'ఇన్సెంటివ్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్'గా పేరు మార్చుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీలో 2 ఎమ్మెల్సీలకు ఉప ఎన్నిక

అమరావతి/న్యూఢిల్లీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ శాసన మండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 25వ తేదీన ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. అదే రోజు నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలవుతుంది. వాటి దాఖలుకు జూలై 2ను తుది గడువుగా పేర్కొన్నారు. మర్నాడు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు జూలై 5గా ఈసీ పేర్కొంది. అనివార్యమైతే జూలై 12వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. వైసీపీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ రాజీనామా, మరో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యపై అనర్హత వేటుపడడంతో ఈ 2 ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి.




చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పవన్; సచివాలయానికి వస్తున్న పవన్‌కు స్వాగతం పలుకుతున్న అమరావతి రైతులు

తొలిసారి సచివాలయానికి పవన్

సీఎం చాంబర్లో చంద్రబాబుతో భేటీ.. ఆలింగనం చేసుకుని ఆహ్వానించిన ముఖ్యమంత్రి

- పాలన, రాజకీయాంశాలపై ఏకాంత చర్చలు
- అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులతో భేటీ

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మంగళవారం మధ్యాహ్నం మొదటిసారి అమరావతి సచివాలయంలో అడుగుపెట్టారు. తన చాంబర్ ఉన్న రెండో బ్లాకు ప్రభుత్వ ఉద్యోగులతో నిండిపోవడంతో దానిని పరిశీలించకుండానే.. ఆయన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌తో కలిసి నేరుగా సీఎం చంద్రబాబు చాంబరుకు వెళ్లారు. రాష్ట్ర సచివాలయానికి.. అందునా తన చాంబరుకు తొలిసారి వచ్చిన తన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను.. చంద్రబాబు తన సీటులో నుంచి లేచి ఆలింగనం చేసుకుని ఆహ్వానించారు. పవన్ ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. తర్వాత వారిద్దరూ సుమారు గంటపాటు విడిగా అదే చాంబర్లో చర్చించుకున్నారు. చంద్రబాబు కార్యాలయ గది బాగుందని పవన్ ప్రశంసించారు. ఆ గదిలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చిహ్నం చూపించి.. దానికి మీరు హుందాతనం తెచ్చారని చంద్రబాబుతో అన్నారు. ఆ ప్రశంసకు సంతోషించిన చంద్రబాబు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. తర్వాత వారిద్దరూ గంటసేపు ప్రభుత్వం.. పాలన, రాజకీయపరమైన అంశాలపై మాట్లాడుకున్నారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న మంత్రులను చాంబర్లోకి ఆహ్వానించారు. టీడీపీకి చెందిన మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, పొంగూరు నారాయణ, గొట్టిపాటి రవికుమార్.. జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ వచ్చారు. పవన్ చేపట్టనున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలు, జగన్ పాలనలో పంచాయతీల పాలన కుంటుపడడం.. గ్రామాల్లో విపరీతంగా పేరుకుపోతున్న చెత్త గుట్టల సమస్యను పరిష్కరించే మార్గాలు.. గ్రామాల్లో సమస్యలు వంటివి ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. మొత్తమ్మీద సుమారు రెండు గంటలపాటు చంద్రబాబు చాంబర్లో పవన్ గడిపారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ తొలిసారి సచివాలయంలోకి రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఆయన్ను చూసేందుకు ఉద్యోగులంతా నాలుగు బ్లాకుల నుంచీ బయటకు వచ్చారు. ఘనంగా స్వాగతం పలికారు.

అడుగడుగునా పూలవర్షం..

అంతకుముందు ఉప ముఖ్యమంత్రిగా తొలిసారి అమరావతిలో అడుగుపెట్టిన పవన్‌కు.. రాజధాని రైతులు అపూర్వ స్వాగతం పలికారు. జనసేన కార్యాలయం నుంచి బయల్దేరిన ఆయన్ను తాడేపల్లి వద్ద ప్రజలు పూల వర్షంలో ముంచెత్తారు. అక్కడి నుంచి కరకట్ట మీదుగా వెంకటపాలెం చేరుకున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో రైతులు, ప్రజలు గజమాలలతో ఘనంగా సత్కరించారు. అక్కడి నుంచి మందడం వరకు పూలవాన కురిపిస్తూ నీరాజనాలు పలికారు.

అమ్మో... అంత ఖర్చా!

రుషికొండపై నిర్మాణాలకు భారీ వ్యయం

- చదరపు అడుగుకు ఏకంగా రూ.30 వేలు
- స్టార్ హోటల్ పేరుతో నిర్మాణం ప్రారంభం
- రూ.450 కోట్లకు రావలసిన రూమ్‌లు 450
- కానీ నిర్మించినవి కేవలం 12 బెడ్ రూమ్‌లే



విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రుషికొండపై పర్యాటక భవనం పేరుతో చేపట్టిన నిర్మాణం, దానికి వెచ్చించిన వ్యయం చూసి విశాఖపట్నంలో బిల్డర్లు ఆశ్చర్యపోతున్నారు. కేవలం ఏడు భవనాలలో 1,48,413 చదరపు అడుగుల బిల్టప్ ఏరియాకు రూ.450 కోట్లు ఎలా ఖర్చు చేశారని తెల్ల ముఖాలు వేస్తున్నారు. విశాఖపట్నంలో ఇటీవల కాలంలో నిర్మించిన స్టార్ హోటళ్లు చాలా ఉన్నాయి. రుషికొండలో జగన్ ప్యాలెస్‌కు కేవలం కిలో మీటరు ముందు రాడీసన్ బ్లూ హోటల్ ఉంది. అక్కడ ఒక్కో సూట్ రూమ్ నిర్మాణానికి ఫర్నిషింగ్‌తో సహా కోటి రూపాయల వ్యయం అయింది. పదేళ్ల క్రితం ఆర్‌కే బీచ్ రోడ్డులో నిర్మించిన నోవాటెల్‌కు అప్పట్లో రూమ్‌కి రూ.60 లక్షల వరకూ వ్యయం అయింది. స్టార్ హోటళ్లలో సగటున ఒక్కో రూమ్ వేయి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. అంటే కామన్ ఏరియా, రెస్టారెంట్, బాంకెట్ హాళ్లు, జిమ్‌లు, స్విమ్మింగ్‌పూల్స్ అన్నీ కలుపుకొని రూమ్‌కు వేయి చదరపు అడుగుల విస్తీర్ణం వస్తుంది. అలా ఒక్కో రూమ్‌కు బెడ్, బాత్‌రూమ్ టబ్, సోఫాలు, టీవీ, ఫర్నీచర్ అన్నీ కలిపి కోటి రూపాయల వ్యయం అవుతుందని విశాఖలో పేరొందిన బిల్డర్లు చెబుతున్నారు. ఆ లెక్కన చూసుకుంటే చదనపు అడుగు రూ.10 వేలు ఖర్చు అవుతుంది. ఇలా చూస్తే, రుషికొండపై వెచ్చించిన రూ.450 కోట్లకు 450 రూమ్‌లు అన్ని హంగులతో రావాలి. కానీ అక్కడ జగన్మోహన్‌రెడ్డి కుటుంబం కోసం నిర్మించుకున్న 12 బెడ్‌రూమ్‌లు తప్ప ఇంకేమీ లేవు. మిగిలినవన్నీ సమావేశ మందిరాలు, కార్యాలయానికి ఉపయోగించుకునే విధంగా నిర్మించినవే. అలాంటి వాటికి చదనపు అడుగు ఒక్కింటికి రూ.30 వేలు ఖర్చు చేశారు. ఆ వ్యయానికి తగిన ఆనవాళ్లు మాత్రం రూమ్‌ల రూపంలో అక్కడ లేవు. చదనపు అడుగుకు రూ.10 వేలు అవ్వాల్సినచోట రెండు రెట్లు అధికంగా అంటే రూ.30 వేలు ఎక్కువ ఖర్చు చేశారు. ఇదంతా ప్రజాధనం. బిల్డర్ల లెక్కల ప్రకారం 1,48,315 చదనపు అడుగుల బిల్టప్ ఏరియాకు రూ.150 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుంది. కానీ లెక్కలు చూపిస్తున్నది రూ.450 కోట్లకు. పర్యాటకుల కోసం అని చెప్పి వారికి తగినట్టుగా వేయి చదరపు అడుగులు, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో ఒక్కటి అంటే ఒక్క రూమ్ కూడా నిర్మించలేదు. బయటకు చెప్పింది ఒకటి...లోపల చేసింది మరొకటి.

ఏపీ అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి!

- గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపిన సీఎస్

అమరావతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ అడ్వకేట్ జనరల్((ఏజీ)గా సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ నియమితులు కానున్నారు. ఆయన పేరును ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు నోట్ ఫైల్ వెళ్లింది. దీంతో ఆయన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ప్రతిపాదనలు పంపారు. గవర్నర్ ఆమోదించిన వెంటనే ఏజీగా దమ్మాలపాటి నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దమ్మాలపాటి 2014 జూన్ 30 నుంచి 2016 మే వరకు అదనపు అడ్వకేట్ జనరల్(ఏఏజీ)గా సేవలు అందించారు. 2014 జూన్ నుంచి ఏజీగా వ్యవహరించిన సీనియర్ న్యాయవాది పి.వేణుగోపాల్ తన పదవికి రాజీనామా చేయడంతో 2016 మే 28న దమ్మాలపాటిని ప్రభుత్వం ఏజీగా నియమించింది. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం వచ్చే వరకు ఆయన సేవలు అందించారు. ఈ అనుభవమే ప్రస్తుతం ఆయన రెండోసారి ఏజీగా నియమితులయ్యేందుకు దోహదపడింది. అధికారిక ఉత్తర్వులు వెలువడిన అనంతరం గురువారం ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దమ్మాలపాటిపై క్రిమినల్ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారు. వాటన్నిటినీ ఆయన సమర్థంగా ఎదుర్కొన్నారు. చంద్రబాబును అరెస్టు చేసి జైలులో ఉంచిన సందర్భంలో ఏసీబీ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో జరిపిన న్యాయ పోరాటంలో దమ్మాలపాటి కీలకపాత్ర పోషించారు.

తాను గెలవలేక ఈవీఎంలు 'ఓడు!'

ఈవీఎంలపై జగన్ నాలుక మడత.. తాను గెలిచినప్పుడు ఓహో.. ఇప్పుడు ఈవీఎంలపై అనుమానాలు

- పేపర్ బ్యాలెట్‌కే వెళ్లాలంటూ ట్వీట్
- జగన్ వల్లే ఓడామంటున్న అభ్యర్థులు
- సమస్యలు చెప్పినా పట్టించుకోని జగన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

> 80 శాతం మంది ఓటు వేశారు. బటన్ నొక్కిన తర్వాత ఏ పార్టీకి ఓటు వేశారో వీవీ ప్యాట్‌లో వాళ్లకు కనిపిస్తా ఉంది. తేడా వచ్చిందని ఎక్కడా ఫిర్యాదులు రాలేదు. నేను ఫ్యాను గుర్తుకు నొక్కినాక వీవీప్యాట్‌లో నాకు సైకిల్ గుర్తు కనిపిస్తే ఎందుకు గమ్మునుంటా? బూత్‌లో అక్కడే ఉండి గొడవ చేసి ఉండేవాడిని కదా! మరి ఈవీఎంలలో అది జరిగాయి.. ఇది జరిగాయని ఏవిధంగా చెబుతారు?
>
> - 2019లో గెలుపు తర్వాత జగన్మోహన్ రెడ్డి

> న్యాయం జరగడం ఒక్కటే ముఖ్యం కాదు. జరిగినట్లు కనిపించాలి కూడా. ప్రజాస్వామ్యం గెలవడంతో పాటు నిస్సందేహంగా గెలిచినట్లు కనిపించాలి కూడా. ప్రపంచం మొత్తమ్మీద ప్రజాస్వామ్యం కొనసాగుతున్న అత్యధిక దేశాల్లో ఎన్నికల ప్రక్రియ కోసం పేపర్ బ్యాలెట్లు వాడుతున్నారు. ఈవీఎంలు కాదు. ప్రజాస్వామ్యం అసలైన స్ఫూర్తిని కొనసాగించేందుకు మనం కూడా ఇదే దిశగా ముందుకు కదలాలి.
>
> - తాజా ఓటమి నేపథ్యంలో 'ఎక్స్'లో జగన్ సందేశం

ఆడలేక మద్దెల వోడు అన్నట్లు.. వైఎస్ జగన్ ఎన్నికల్లో గెలవలేక ఈవీఎంల వల్లే ఓడిపోయానని ఇప్పుడు వాపోతున్నారు. 2014లో టీడీపీ-బీజేపీ కూటమిని ప్రజలు గెలిపించినప్పుడు.. చంద్రబాబు ఇచ్చిన తప్పుడు హామీలు నమ్మి జనం ఆయనకు ఓట్లేశారని అన్నారు. 2019లో వైసీపీ గెలిచాక ఈవీఎంలపై ఆరోపణలు వచ్చినప్పుడు.. చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని, ప్రజల తీర్పునూ అపహాస్యం చేశారని విమర్శించారు. అదే 2024లో ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ఓడించడంతో తట్టుకోలేక.. వారి ఆప్యాయత, అభిమానం ఏమయ్యాయోనని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మాట తప్పను.. మడమ తిప్పనని పదే పదే చెప్పుకొనే జగన్ తీరు చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతోందని రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఓటమిని జీర్ణించుకోలేక ప్రజాతీర్పును కించపరుస్తూ.. తప్పంతా ఈవీఎంలపై నెట్టేయడంపై సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఓటమికి కారణాలను విశ్లేషించుకుని వాటిని సరిదిద్దుకోకపోగా.. కుంటిసాకులు చెబితే జనం నమ్మరని వారు అంటున్నారు. ఎన్నికల్లో ఓటమి రుచి చూసిన ఆ పార్టీ నేతలంతా ఇందుకు జగనే కారణమని.. ఆయన తప్పుడు విధానాల వల్లే ఓడిపోయామని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును అమలు చేయవద్దని ఎంత చెప్పినా జగన్ వినలేదని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బాహాటంగానే అన్నారు. గడప గడపకూ పర్యటించినప్పుడు ఈ చట్టంపై ప్రజాగ్రహం పెద్దఎత్తున వ్యక్తమైందని.. ఈ యాక్టు అమలు నిర్ణయమే తమ కొంప ముంచిందని మెజారిటీ అభ్యర్థులు నెత్తీనోరూ బాదుకుంటున్నారు. మహిళలు వైసీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. కూటమికి సానుకూలంగా ఓట్లు వేశారంటూ పోలింగ్ తర్వాత జగన్‌ను తాడేపల్లిలో



కలసినప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన ఒక మంత్రి చెప్పారు. కానీ ఆయన పట్టించుకోలేదు. గతంలో గెలిచిన 151 సీట్ల కంటే ఎక్కువే వస్తాయని దబాయించారు. నాసిరకం మద్యం, ఇసుక విధానం కొంప ముంచుతున్నాయని ఎప్పటి నుంచో చెబుతున్నా ఆయన వినలేదు, పట్టించుకోలేదు. ఇప్పుడు తమకు 11 సీట్లే ఇవ్వడంతో తట్టుకోలేక తప్పంతా ఈవీఎంలదే అన్నట్లు మాట్లాడుతున్నారు. ఇదే నిజమైతే 2019లో ఆయన గెలుపు ఈవీఎంలను తారుమారు చేయడం వల్లే వచ్చిందా అని రాజకీయ వర్గాలు నిలదీస్తున్నాయి. జగన్ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నాయి.

మీ వల్ల సర్కారుకు చెడ్డపేరొస్తోంది!

- ప్రభుత్వ అనుమతి లేకుండా సొంత నిర్ణయాలా?
- మద్యం కంపెనీల విధానాలను ఎలా ఖరారు చేస్తారు?
- విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించండి
- అధికారులకు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి ఆదేశం



హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ తప్పుడు నిర్ణయాల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్నవారు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాలని, సొంత నిర్ణయాలు తగవని అధికారులను హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి నాలుగు గంటల పాటు అధికారులతో సమీక్షించారు. ఇటీవల ఎక్సైజ్ శాఖలో చోటుచేసుకున్న పరిణామాలపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మద్యం కంపెనీల అనుమతుల విషయంలో జరిగిన పరిణామాలను మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మద్యం కంపెనీల అనుమతుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురాకుండా బేవరేజ్ కార్పొరేషన్ అధికారులే విధివిధానాలను ఎలా ఖరారు చేస్తారని మండిపడ్డారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని, విచారణ జరిపి సమగ్ర నివేదికను సమర్పించాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్, ఎండీ శ్రీధర్, జీఎం అబ్రహాంను మంత్రి ఆదేశించారు. నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అధికారుల సొంత నిర్ణయాల వల్ల ఎక్సైజ్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిందని, దీనివల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని చెప్పారు. కాగా, మాదక ద్రవ్యాలు, గంజాయి, అక్రమ మద్యం, కల్తీ కల్లు, గుడుంబా తయారీ, సరఫరా, అమ్మకాలపై నిరంతరం నిఘా పెట్టాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. అక్రమ మద్యం తయారీ, సరఫరాదారులు, విక్రేతల నెట్‌వర్క్ సమాచారాన్ని తయారు చేయాలని మంత్రి ఆదేశించారు.

ఆయిల్ పామ్ బకాయిలు 100 కోట్లు విడుదల

- ఆయిల్ పామ్ లక్ష్యాన్ని చేరుకోవాలి: మంత్రి తుమ్మల



ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు, కంపెనీలకు సంబంధించిన బకాయిలు రూ. 100.76 కోట్లు విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ నిధులతో రెండు, మూడు రోజుల్లో ఆయిల్ పామ్ తోటల నిర్వహణ, అంతర పంటల సాగుకు సంబంధించిన రాయితీలు రైతుల ఖాతాల్లో జమ చేయడానికి ఉద్యానశాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇదే క్రమంలో 2022-23 నుంచి పెండింగ్‌లో ఉన్న సూక్ష్మ సేద్యానికి సంబంధించిన రూ. 55.36 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు తుమ్మల వెల్లడించారు. ఆయిల్ పామ్, ఇతర పంటల్లో రైతులు అమర్చిన సూక్ష్మ సేద్య పరికరాల కంపెనీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిల కింద వీటిని జమ చేస్తున్నట్లు తెలిపారు. 2023-24 సంవత్సరానికిగాను 59,261 ఎకరాలు కొత్తగా ఆయిల్ పామ్ సాగులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. పాత బకాయిలు ఇప్పుడు విడుదల చేసిన నేపథ్యంలో... 2024-25 సంవత్సరానికి గాను ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని రైతులు చేరుకునేలా ప్రోత్సహించాలని ఉద్యానశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

'ప్రజావాణి'కి భూసమస్యలే అధికం

బేగంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 607 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా ధరణిలో భూములు కోల్పోయిన వారితో పాటు గత ప్రభుత్వ హయంలో భూములు కబ్జా చేశారని.. ఇండ్లు, పెన్షన్లు తదితర సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు.

నిలిచిపోయిన టీచర్ల ప్రమోషన్లు

- హైకోర్టు ఆదేశాలు తెలుసుకోకుండా ఎలా ఇస్తారు?
- డివిజన్ బెంచ్ ప్రశ్న.. టెట్ వివాదమే కారణం

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉపాధ్యాయుల ప్రమోషన్ల మార్గదర్శకాలు నిలిచిపోయాయి. 'టెట్' విషయమై సమస్య నెలకొనడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 2010లో నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) జారీ చేసిన నోటిఫికేషన్ కంటే ముందు సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియామకమైన వారికి టెట్ అర్హతతో సంబంధం లేకుండా ప్రమోషన్లు కల్పించాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఈ ఏడాది మే 2వ తేదీన ఆదేశాలు జారీచేసింది. అయితే టెట్ అర్హత లేని వారికి ప్రమోషన్‌లు ఇవ్వడం చెల్లదంటూ టెట్ అర్హత ఉన్న తాటి గంగాస్ సహా మరో 52 మంది ఉపాధ్యాయులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. తమ వాదన వినకుండానే సింగిల్ జడ్జి టెట్ అర్హత లేని వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చారని.. ఆ ఆదేశాలను కొట్టేయాలని కోరారు. టెట్ అర్హత లేనివారికి అనుకూలంగా సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణల ధర్మాసనం ఈనెల 14న కొట్టేసింది. డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలుసుకోకుండా పలు జిల్లాల్లో ప్రమోషన్‌లు ఇవ్వడంతో టెట్ అర్హత కలిగిన ఉపాధ్యాయులు మరోసారి హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేశారు. మంగళవారం ఈ అప్పీల్‌పై మంగళవారం మరోసారి జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం విచారణ చేపట్టింది. సింగిల్ జడ్జి ఆదేశాలను తాము (డివిజన్ బెంచ్) కొట్టేసిన తర్వాత ప్రభుత్వం ప్రమోషన్ల విషయంలో ముందు ఎలా వెళ్తుందని కోర్టుకు హాజరైన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కం కమిషనర్ దేవసేనను ధర్మాసనం ప్రశ్నించింది. డివిజన్ బెంచ్ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలియదని.. దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు తెలుసుకుని వివరణ ఇస్తామని వారు విన్నవించారు. దాంతో టెట్ అర్హత కలిగిన, టెట్ అర్హత లేని రెండు వర్గాల ఉపాధ్యాయుల వాదనలు విని తీర్పు ఇవ్వాలని పేర్కొంటూ.. మళ్లీ మొత్తం వ్యవహారాన్ని సింగిల్ జడ్జికి రిమాండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఇచ్చిన ప్రమోషన్ల మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేసింది. సింగిల్ జడ్జి వద్ద వివాదం తేలే వరకు ఉపాధ్యాయుల ప్రమోషన్లు నిలిచిపోనున్నాయి.

శ్రీశైలంకు స్వల్పంగా వరద

హైదరాబాద్/నల్లగొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్టుకు వరద పెరుగుతుండటంతో అక్కడి జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభించారు. ఈ నీటి సంవత్సరం (2024 మే 1 నుంచి) ప్రారంభమయ్యాకా అక్కడ తొలిసారిగా సోమవారం 0.01 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ఇక కర్నూలు జిల్లాలోని సుంకేసుల బ్యారేజీ నిండటంతో వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. మంగళవారం బ్యారేజీకి 4,717 క్యూసెక్కుల వరద రాగా దిగువకు 4,077 క్యూసెక్కులు వదిలారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 4,277 క్యూసెక్కుల వరద వచ్చిచేరింది. జూరాలకు 3,807 క్యూసెక్కులు రాగా దిగువకు 2,881 క్యూసెక్కులు వదిలారు. కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 11,587 క్యూసెక్కులు వచ్చింది. తుంగభద్ర జలాశయానికి 801 క్యూసెక్కులు వచ్చింది. గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ (పోచంపాడు) ప్రాజెక్టుకు 1273 క్యూసెక్కులు, సుందిళ్లకు 98, అన్నారంనకు 250, మేడిగడ్డ 1270, తుపాకులగూడెం (సమ్మక్క సాగర్)కు 1400 క్యూసెక్కుల వరద వచ్చిచేరింది. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 504.50 అడుగులు ఉంది. జంట నగరాల తాగునీటి అవసరాలకు ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి నీరు రావడం లేదు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

రాష్ట్రంలో బుధ, గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

'హైదరాబాద్' దూసుకెళ్తోంది!

స్థిరాస్తి, నిర్మాణ రంగంలో ఆరేళ్లలో గణనీయ వృద్ధి.. సీఎంతో 'కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్' ప్రతినిధులు..

ప్రపంచ నగరాలతో పోటీ పడతాం..హైదరాబాద్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం: ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ నగరం శరవేగంగా వృద్ధి చెందుతోందని ప్రముఖ అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థ కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం తెలిపింది. గడిచిన ఆరు నెలల్లో స్థిరాస్తి రంగంతోపాటు లీజింగ్, ఆఫీస్ స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ హైదరాబాద్ గణనీయమైన వృద్ధిని నమోదు చేసిందని పేర్కొంది. అమెరికా కేంద్రంగా భారత్‌తోపాటు 60 దేశాల్లో విస్తరించి ఉన్న ఈ సంస్థ గ్రేటర్ హైదరాబాద్‌లో గత ఆరు నెలల్లో జరిగిన వృద్ధిపై అధ్యయనం చేసింది. సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ. ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తమ అధ్యయనం వివరాలను వారు ముఖ్యమంత్రికి వెల్లడించారు. ప్రపంచ నగరంగా హైదరాబాద్ వృద్ధి చెందుతున్న తీరును ఈ భేటీలో చర్చించారు. భారత్‌లోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో గణనీయమైన వృద్ధి నమోదవుతోందని తమ అధ్యయనంలో తేలిందన్నారు. హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ఆరు నెలలకోసారి వెల్లడించే తమ నివేదిక జూలై నెలాఖరులో వెలువడుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారవుతుందని చెప్పారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడడం లేదని, ప్రపంచంతో పోటీ పడుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమని అన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన 'కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్' ప్రతినిధులు

ఐటీఐ ఇక ఏటీసీ

(మొదటిపేజీ తరువాయిల)

సహకారంతో రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఐటీఐలను ఏటీసీలను అప్‌గ్రేడ్ చేసేందుకు టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో పదేళ్ల కాలానికి గాను ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐలో ఏటీసీలకు రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం విద్యార్హత తాలూకు ధ్రువీకరణ పత్రాలు చేతిలో ఉంటే సరిపోదని, సాంకేతిక నైపుణ్యమూ ఉండాలని చెప్పారు. తాను సొంతిల్లు నిర్మించుకున్న సమయంలో రూ.15వేలకే ఇంజనీర్లు అందుబాటులో ఉండేవారని, అనుభవం ఉన్నవారు మాత్రం రూ.50వేల దాకా తీసుకునేవారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగ సమస్య కీలక పాత్ర పోషించిందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులను కుటుంబసభ్యులుగానే తాను భావిస్తానని, ఆ ఆలోచనల్లోంచి పుట్టిందే ఏటీసీల ఏర్పాటు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది యువతీ యువకులు ఉపాధి లేక నియామక బోర్డుల చుట్టూ తిరుగుతున్నారని, గత పదేళ్లలో ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఎందరో ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీ రంగంలో మన తెలుగు వారు ప్రపంచదేశాలతో పోటీ పడుతున్నారని, మధ్య, దిగువ తరగతి కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇప్పించి, వారికి ఉపాధి కల్పించడమే తమ బాధ్యత అని చెప్పారు. ఏటీసీల ద్వారా నైపుణ్యాలను నేర్పించి, నిరుద్యోగుల్లో భరోసా కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులు ఏటీసీల్లో చేరాలని సూచించారు. దీనికి సంబంధించిన శాఖ తన దగ్గరే ఉంటుందని, తానే ఏటీసీలను ప్రతి నెలా పర్యవేక్షిస్తానని చెప్పారు. విద్యార్థుల శిక్షణ కోసం ముందుకొచ్చిన టాటా యాజమాన్యానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.



హైదరాబాద్ మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టాటా టెక్నాలజీ ప్రతినిధి

టీటీఎల్ ద్వారా శిక్షణకు 130మంది నిపుణులు

ఐటీఐ సర్కిల్ డెవలప్‌మెంట్ అప్‌గ్రేడేషన్ ప్రాజెక్టుల్లో భాగంగా రాష్ట్రంలో 65 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతారు. ఆధునిక పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో యువతకు శిక్షణ ఇస్తారు. ఇందుకోసం ఏటీసీల్లో అధునాతన సామగ్రి, సాంకేతికత ఏర్పాటు చేస్తారు. శిక్షణ ఇచ్చేందుకు 130 మంది నిపుణులను టీటీఎల్ నియమించనుంది. ఏటీసీల్లో ఏటా ఆరు రకాల దీర్ఘకాలిక కోర్సుల్లో 15,860 మందికి, 23 రకాల స్వల్పకాలిక కోర్సుల్లో 31,200 మందికి శిక్షణనిస్తారు. పదేళ్లలో రాష్ట్రంలోని ఐటీఐల్లో కేవలం 1.5 లక్షల మంది శిక్షణ పొందారు. ఈ ఏటీసీలతో రానున్న పదేళ్లలో నాలుగు లక్షల మంది శిక్షణ పొందుతారని అంచనా. ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రాజెక్టు వ్యయం రూ.2,324.21 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.307.96 కోట్లు (13.26 శాతం) కాగా, టీటీఎల్ వాటా రూ.2016.25 కోట్లు (86.74 శాతం)గా ఉంటుంది. ఏటీసీలు వివిధ కోర్సుల్లో శిక్షణకే పరిమితం కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పని చేస్తాయి. ఏటీసీల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి టీటీఎల్ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఏటీసీలు భవిష్యత్తులో తమ సేవలను పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందజేస్తాయి.

21న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం!

- 'రుణ మాఫీ' విధివిధానాలపై చర్చ
- అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తేదీ ఖరారు

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని సచివాలయంలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రధానంగా అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు, ఆగస్టు 15 నాటికి అమలు చేయబోయే పంట రుణాల మాఫీ పథకంపై చర్చించనున్నారు. రుణ మాఫీ పథకం అమలుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అవసరమైన నిధులను సేకరణపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, విధి విధానాలను కూడా ఖరారు చేయబోతోంది. పథకానికి ఎప్పటి నుంచి కట్ ఆఫ్ డేట్‌ను నిర్ణయించాలి, ఇంకా ఎలాంటి నిబంధనలు విధించాలన్నదానిపై కసరత్తు చేస్తోంది. దీనిపై క్యాబినెట్ భేటీలో కూలంకషంగా చర్చించి, మంత్రుల అభిప్రాయాలను కూడా తెలుసుకోనుంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నందున ప్రారంభ తేదీని ఖరారు చేయనుంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరిలో జరిగాయి. వీటితో పాటు ఇతర అంశాలు చర్చకు రానున్నాయి.

హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టండి

- లాక్‌హీడ్ మార్టిన్ ఏరోనాటిక్స్ ఇండియా డైరెక్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏరోనాటిక్స్ రంగంలో హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ప్రతినిధులను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఇప్పటికే హైదరాబాద్‌లో కొనసాగుతున్న సంస్థ పెట్టుబడులను మరింతగా విస్తరించాలన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ఏరోనాటిక్స్ ఇండియా డైరెక్టర్ మైఖేల్ ఫెర్నాండెజ్ మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వారికి వివరించారు. ఇప్పటికే ఈ సంస్థ టాటా గ్రూప్‌తో కలిసి సంయుక్తంగా పెట్టుబడులు పెట్టింది. వీటిని మరింత విస్తరించాలని సీఎం కోరారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానం అమలు చేస్తోందన్నారు. ఇక్కడి పారిశ్రామిక అనుకూల విధానాలను ఉపయోగించుకోవాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు.

రూ. 191 కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వివరించింది. గత ప్రభుత్వం అడ్డూఅదుపూ లేకుండా అప్పులు చేసిందని, ఇప్పుడది తమకు తలకు మించిన భారమైందని ఆక్షేపించింది. ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిధిలో తీసుకున్న బడ్జెట్ అప్పులు, వివిధ కార్పొరేషన్లకు గ్యారెంటీల పేర తీసుకున్న అప్పులు కలిపి మొత్తం రూ.6,71,757 కోట్లు పేరుకుపోయాయని వివరించింది. ఇందులో ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోని అప్పులు రూ.3,89,673 కోట్లు, కార్పొరేషన్లకు గ్యారెంటీల పేర తీసుకుని, ప్రభుత్వం చెల్లించాల్సిన అప్పులు రూ.1,27,208 కోట్లు, కార్పొరేషన్లు స్వయంగా తీసుకుని, చెల్లించాల్సిన గ్యారెంటీ అప్పులు రూ.95,462 కోట్లు, గ్యారెంటీలు లేకుండా సంస్థలు స్వయంగా తీసుకున్న అప్పులు రూ.59,414 కోట్లు కలిపి.. మొత్తం రూ.6,71,757 కోట్లుగా ఉన్నాయని తెలిపింది. 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ నెల 17 వరకు అప్పుల అసలు, వడ్డీల కింద ప్రభుత్వం రూ.38,040 కోట్లను చెల్లించింది. కానీ, ఇదే సమయంలో ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.25,118 కోట్లు. రోజుకు రూ.191 కోట్ల చొప్పున అసలు, వడ్డీల సొమ్మును చెల్లించక తప్పడం లేదు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తీసుకున్న అప్పు, తిరిగి చెల్లించిన సొమ్ము (రూ.కోట్లలో)

నెల	తీసుకున్న అప్పు	అప్పుల అసలు, వడ్డీ జమ చేసిన సొమ్ము
డిసెంబరు 2023	1400	4754
జనవరి 2024	3000	6459
ఫిబ్రవరి 2024	3000	4648
మార్చి 2024	7718	8458
ఏప్రిల్ 2024	4000	4450
మే 2024	4000	7487
జూన్ 2024	2000	1785
మొత్తం	25,118	38,040

నకిలీ బంగారంతో మాయ!



(మొదటిపేజీ తరువాయి)

సృష్టిస్తుంది. ఫలితంగా మోసపోయిన అమాయకుల కాళ్లకు బంధనాలు పడి.. ఇంట్లో నాలుగ్గోడల మధ్య భోరున ఏడ్వడం తప్ప ఏమీ చేయలేని దుస్థితి ఏర్పడుతుంది! మరి.. ఎందరు అమాయకులను ముంచారో గానీ ఎట్టకేలకు నలుగురు సభ్యుల ముఠా గుట్టును రాచకొండ పోలీసులు రట్టు చేశారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో సీపీ తరుణ్‌జోషి వెల్లడించిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన దిలీప్ బర్మాకు తన స్నేహితుడు సింగిరెడ్డి సురేశ్ ద్వారా కస్టమ్స్ వారు సీజ్ చేసిన బంగారం బెంగళూరులో అతి తక్కువకే పెద్ద మొత్తంలో లభిస్తోందని తెలిసింది. గత నెల 19న రూ.6 లక్షలతో దిలీప్, సురేశ్ ఇద్దరూ బెంగళూరుకు వెళ్లారు. అక్కడ బంగారం విక్రయించే ముఠా నాయకుడు కర్రెద్దుల విజయ్ కుమార్ అలియాస్ కృష్ణమోహన్ చౌదరి, అతడి స్నేహితుడు హరీశ్‌ను కలిశారు. దిలీప్, సురేశ్ నుంచి రూ.6 లక్షలు తీసుకొని.. తొలుత 81 గ్రాములు, నాలుగు రోజుల తర్వాత హైదరాబాద్‌లో 20 గ్రాముల బంగారాన్ని ఇచ్చారు. అంతా ఒరిజినల్ బంగారం కావడంతో వారిని దిలీప్, సురేశ్ పూర్తిగా నమ్మారు. అయితే డీల్‌లో భాగంగా 20గ్రాముల బంగారాన్ని ఇచ్చేందుకు హైదరాబాద్‌కొచ్చిన హరీశ్, తమ వద్ద కిలోల కొద్దీ బంగారం ఉందని, తక్కువ ధరకే విక్రయిస్తామని, బెంగళూరుకొచ్చి తెచ్చుకోవచ్చునని చెప్పాడు. అప్పటికే నమ్మకం ఏర్పడటంతో హరీశ్ మాటలను దిలీప్, సురేశ్ గానీ అనుమానించలేదు. పైగా తమకు 2కిలోల బంగారం కావాలని చెప్పి రూ.1.10 కోట్లకు బేరం కుదుర్చుకున్నారు. అక్కడికక్కడే అడ్వాన్స్‌గా రూ.20లక్షలు హరీశ్ చేతుల్లో పెట్టారు. మే-29న బెంగళూరొచ్చి బంగారం తెచ్చుకోవాలని చెప్పి, అడ్వాన్స్ తాలూకు డబ్బుతో హరీశ్ వెళ్లిపోయాడు.

మాయచేసి 1.10 కోట్లు కొల్లగొట్టి..

మే-29న దిలీప్, సురేశ్ కలిసి రూ.90 లక్షలు తీసుకొని బెంగళూరు వెళ్లారు. అక్కడ విజయ్, హరీశ్ పటాటోపాన్ని చూసి పూర్తిగా వారి మాయలో పడిపోయారు. సోఫాలో ఆసీనులైన ఆ ఇద్దరి పక్కన కోట్లలో కట్టలకొద్దీ పెద్ద మొత్తంలో డబ్బు పేర్చి ఉండటం.. కస్టమర్ల రూపంలో కొందరు అక్కడికొచ్చి కోట్లలో డబ్బిచ్చి బంగారాన్ని తీసుకెళుతుండటం చూసి దిలీప్, సురేశ్ నోరెళ్లబెట్టారు. తమవంతు రాగానే ఇద్దరూ రూ.90 లక్షల నగదు వారి చేతిలో పెట్టారు. ఒప్పందం ప్రకారం రెండు కిలోల బంగారం ఇవ్వాలని అడిగారు. డబ్బు తీసుకున్న విజయ్.. బంగారం ఇప్పుడే అయిపోయిందని, రెండ్రోజుల్లో ఇచ్చేస్తానని చెప్పాడు. ఇందుకు దిలీప్, సురేశ్ ఒప్పుకోకపోవడంతో వారి ఎదుటే విజయ్, చెన్నైలో తమ మేనేజర్ నంబూరి డేవిడ్ లివింగ్ స్టోన్ అలియాస్ సెంథిల్ ఉన్నాడని, అతడి వద్ద నుంచి 2 కిలోల బంగారం తీసుకోవాలని చెప్పాడు. పైగా ఆ సెంథిల్‌కు దిలీప్, సురేశ్ ముందే ఫోన్ చేసి మాట్లాడాడు. సరేనన్న ఇద్దరూ మర్నాడు అంటే.. మే నెల 30న చెన్నై వెళ్లి ఓ బడా హోటల్లో సెంథిల్‌ను కలిశారు. అక్కడ కూడా బంగారం స్టాక్ లేదని చెప్పిన సెంథిల్.. "మీరు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోండి. రెండ్రోజుల్లో నేనే వచ్చి బంజారాహిల్స్ రోడ్డు నంబరు 35లో బంగారం అందచేస్తాను" అని చెప్పాడు. చెప్పిన రోజు గానీ, ఆ తర్వాత గానీ సెంథిల్ రాకపోవడం... ఫోన్ చేసినా విజయ్‌కుమార్, సెంథిల్, హరీశ్ స్పందించకపోవడంతో బాధితులు అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రాచకొండ పోలీసులు, ముఠా నాయకుడు విజయ్, అతడి అనుచరులు సెంథిల్, హరీశ్.. ఓంసాయి కిరీటి అనే మరో వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ నలుగురి నుంచి ఐదు కిలోల నకిలీ బంగారం, రూ. 51లక్షల నగదు, 3 కార్లు, రూ. 6.86కోట్ల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

ఆ నకిలీ బంగారాన్నీ దోచేస్తారు!

పోలీసుల విచారణలో విస్తుపరిచే అంశాలు వెలుగుచూశాయి. వాస్తవానికి సెంథిల్‌ను బంగారం ఇవ్వాల్సిందేనని చెన్నైలోనే దిలీప్, సురేశ్ పట్టుబట్టి ఉంటే వారికి రెండు కిలోల నకిలీ బంగారాన్ని అతడు అంటగట్టేవాడే! ఇదే జరిగి ఉంటే.. ఈ ముఠాకు చెందిన ఒకరో ఇద్దరో పోలీసు వేషాల్లో దారికాచి వాహనం తనిఖీ పేరుతో దిలీప్, సురేశ్ నుంచి ఆ నకిలీ బంగారాన్ని దోచుకునేవారే!! దిలీప్, సురేశ్ ఘటనలో ఇలా జరగలేదు కానీ మోసానికి పాల్పడే క్రమంలో ఈ ముఠా చేసే పనే ఇది!! పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలోని ఓంసాయి కిరీటి అనే వ్యక్తి పోలీసు వేషం వేస్తాడు. నకిలీ బంగారంతో వెళుతున్న కస్టమర్లను చెకింగ్ పేరుతో అడ్డుకొని వారి నుంచి ఆ సరుకును స్వాధీనం చేసుకుంటాడు. స్వయంగా పోలీసులే వచ్చి బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం, ఆ సొత్తుకు సంబంధించి సహజంగానే ఎలాంటి రసీదులూ ఉండకపోవడంతో బాధితులు గప్‌చుప్ అయిపోతారు. పోలీసులే వచ్చి తీసుకెళ్లడంతో ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయరు. పైగా సరుకు మళ్లీ చేరాల్సిన చోటుకు చేరడంతో అది నకిలీ బంగారం అనే విషయమూ బాధితులకు తెలిసే ప్రసక్తే లేదు. ఇదే ధీమాతో ఈ ముఠా ఇన్నాళ్లూ మోసాలకు పాల్పడింది. కాగా ప్రధాన నిందితుడు విజయ్‌కుమార్‌కు ఏపీలోని నెల్లూరు జిల్లా కావలిలో రౌడీషీట్‌గా పేరుందని, ఇప్పటికే అతడిపై 13 కేసులున్నట్లు సీపీ తెలిపారు. మరో 3 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్నట్లు పేర్కొన్నారు

రోడ్డు ప్రమాద బాధితులకు లక్ష చికిత్స ఫ్రీ

(మొదటిపేజీ తరువాయి)

హోటళ్లు, రెస్టారెంట్లపై నిరంతర తనిఖీలు నిర్వహించేందుకు మరో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ మూడు టాస్క్‌ఫోర్స్‌లు తన పర్యవేక్షణలో పని చేస్తాయని మంత్రి దామోదర తెలిపారు.



మెడికల్ కాలేజీల్లో త్వరలో బదిలీలు

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఒకేచోట ఐదేళ్లకు మించి పని చేస్తున్న ఆచార్యులు, అధ్యాపకులు, నర్సులందరినీ బదిలీ చేయాలని.. ఈ విషయంలో ఎవరికీ వెసులుబాటు కల్పించకూడదని సర్కారు భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్పౌజ్ కేసులో విద్యాశాఖలో అమలవుతున్న నిబంధనను వైద్యశాఖలో పాటించాలన్న యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. టీచర్ల బదిలీల్లో 8 ఏళ్లలో ఒక్కసారి మాత్రమే స్పౌజ్ (భార్య/భర్త) అంశాన్ని వినియోగించుకోవాలన్న నిబంధన ఉంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల నియామకాలకు గరిష్ఠ వయోపరిమితిని 64 ఏళ్లుగా తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి దాకా వైద్య ఆరోగ్యశాఖలో.. ప్రజారోగ్య సంచాలకులు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ వంటి కీలకమైన పోస్టులను మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలో, ఈ రెండు పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయనుందని, జీవో వారం, పది రోజుల్లో వస్తుందని దామోదర వెల్లడించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను (టీవీవీపీ) సెకండరీ హెల్త్ కేర్ కిందికి తీసుకురావాలని సర్కారు నిర్ణయించిందని, ఇక టీవీవీపీ సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా మారనుందని తెలిపారు. టీవీవీపీకి కూడా డైరెక్టర్ రానున్నారని, దాని పరిధిలోని ఉద్యోగులందరికీ ట్రెజరీ ద్వారా వేతనాలు అందనున్నాయని చెప్పారు. ఈ మూడు డైరెక్టర్ పోస్టులతో పాటు తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ పోస్టును కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

కార్పొరేషన్ ద్వారా గత సర్కారు రూ.9 వేల కోట్ల రుణం

తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కార్పొరేషన్ పేరుతో గత బీఆర్ఎస్ సర్కారు వివిధ బ్యాంకుల నుంచి రూ.9 వేల కోట్ల అప్పు తీసుకుందని, ఆ డబ్బును ఏం చేశారో తెలియదన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల భవనాలను నిబంధనలకు విరుద్ధంగా 20కిపైగా అంతస్తులు కట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించిందని, వరంగల్‌లో ఇప్పటికే 20కి పైగా అంతస్తులు కట్టారన్నారు. ఎల్బీనగర్ టిమ్స్‌కు కూడా అలాంటి ప్రణాళికే ఉండగా...దాన్ని తమ ప్రభుత్వం 13 అంతస్తులకు తగ్గించిందని, ఇతర టిమ్స్‌ను కూడా 13 అంతస్తులకే పరిమితం చేస్తామన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించిన మరిన్ని నిర్ణయాలు..

- వైద్య విద్య ఆచార్యులకు, అధ్యాపకులకు మూల వేతనం పెంపు. గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న వారికి బేసిక్‌పే మీద 50 శాతం, కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లో పని చేస్తున్న వారికి 30 శాతం పెంపుదల.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఇచ్చే ఆహార నాణ్యతపై తనిఖీలు. నాణ్యత లేని ఆహారం అందించినట్లు గుర్తిస్తే డైట్ కాంట్రాక్టర్లపై చర్యలతో పాటు కేసులు నమోదు.
- ప్రతీ మండల కేంద్రంలో ఒక పాలియేటివ్ కేర్ ఏర్పాటు. జాతీయ రహదారుల వెంట ప్రతి 35 కి.మీ.లకు ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు.
- వైద్యఆరోగ్యశాఖలో పనిజేస్తున్న సిబ్బంది అందరికీ ఠంచన్‌గా వేతనం అందేలా గ్రీన్ చానెల్ ఏర్పాటు. దీర్ఘకాలంగా ఒకేచోట పని చేస్తున్న జిల్లా వైద్యాధికారుల బదిలీ. వైద్యులు, ఇతర సిబ్బంది పనితీరుపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు.



అంజనీకుమార్ (సీఎస్ఈ టాపర్)



దివ్య (ఈసీఈ టాపర్)



పవన్ (ఈఈఈ టాపర్)

పీజీఈసెట్‌లో 91.28 % ఉత్తీర్ణత

- పరీక్ష నిర్వహించిన తర్వాత ఐదు రోజులకే ఫలితాల వెల్లడి
- సీఎస్ఈ విభాగంలో టాప్-3 స్థానాలు హైదరాబాదీలకే
- మెటలర్జీ, ఫార్మసీ టాపర్లు ఏపీ విద్యార్థులు



షేక్ అస్మా (మెటలర్జీ టాపర్)



బసవరాజు వెంకట ప్రశస్తి (ఫార్మసీ టాపర్)

హైదరాబాద్ సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టీజీ పీజీఈసెట్-2024 ఫలితాలు మంగళవారం సాయంత్రం వెలువడ్డాయి. 91.28 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 20,626 మంది పరీక్షకు హాజరవ్వగా వారిలో 18,829 మంది ఉత్తీర్ణులు అయ్యారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన కార్యక్రమలో రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది పీజీఈసెట్‌కు 22,712 మంది దరఖాస్తు చేసుకోగా జూన్ 10-13 తేదీల్లో మొత్తం 19 సబ్జెక్టులకు పరీక్షలు జరిగాయి. చివరి పరీక్ష ముగిసిన తర్వాత ఐదు రోజులకే ఫలితాలు ప్రకటించడం విశేషం. కాగా, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెటలర్జీ, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ సబ్జెక్టుల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కంప్యూటర్ సైన్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన మాజేటి అంజనీకుమార్, అన్నవరపు గౌరవ్ అవినాష్, జంగా మౌనిక వరుసగా తొలి మూడు ర్యాంకులు సాధించారు. ఈసీఈలో అకోజ్ దివ్య(జనగాం), ఈఈఈలో రమావత్ పవన్(నల్లగొండ) టాప్ ర్యాంకులు సాధించారు. మెటలర్జికల్ ఇంజనీరింగ్, ఫార్మసీ సబ్జెక్టుల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచారు. మెటలర్జీలో ఏలూరుకు చెందిన షేక్ అస్మా, ఫార్మసీలో కడపకు చెందిన బసవరాజు వెంకట ప్రశస్తి టాపర్లుగా నిలిచారు. ఇతర ముఖ్యమైన సబ్జెక్టుల్లో రాష్ట్ర విద్యార్థులే సత్తా చాటారు.

8 నూతన వంగడాల విడుదల

రాజేంద్రనగర్, జూన్18(ఆంధ్రజ్యోతి): ఆయా పంటలకు సంబంధించి 8 నూతన వంగడాలను ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసింది. వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్న పంటలకు సంబంధించి మొత్తం 8 రకాలను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఎం.రఘునందన్‌రావు, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి వెల్లడించారు. అందులో నాలుగు వరి వంగడాలున్నాయని తెలిపారు. అగ్గితెగులు, సుడి దోమ, ఉల్లికోడులను తట్టుకునే రకాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వీటిని అందుబాటులో తెచ్చిందన్నారు. రాజేంద్రనగర్ వరి పేరిట ఆర్ఎన్ఆర్ - 28361 అనే దొడ్డు గింజల రకాన్ని, కెఎన్ఎం-7037 పేరిట సన్నని పొడవైన గింజ, తక్కువ నూక శాతం తదితర లక్షణాలు కలిగిన మరో రకాన్ని, అలాగే సుడిదోమ, అగ్గి తెగులు, తెగులును తట్టుకునే తెలంగాణ వరి -1289(డబ్ల్యుజీఎల్-1289)ని విడుదల చేశామన్నారు. ఉల్లికోడు బయోటైప్‌లను తట్టుకునే వరంగల్ వరి-119ను కూడా విడుదల చేశామన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణం

యాదగిరిగుట్టలో పోటెత్తిన భక్తులు

భువనగిరి అర్బన్, జూన్ 18: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆనవాయితీగా వస్తున్న గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. ఉద్ఘాటన అనంతరం మంగళవారం గిరి ప్రదక్షిణను ప్రారంభించగా.. భక్తులు 'నమో నారసింహ' అంటూ ఆద్యంతం ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏకశిఖరవాసుని పట్ల తమ భక్తిని చాటుకున్నారు. యాదగిరిపై కొలువైన లక్ష్మీసమేతుడి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున సుమారు 10 వేల మందికిపైగా భక్తులు గిరి ప్రదక్షిణలో భాగస్వాములైనట్లు అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావుతో కలిసి ప్రదక్షిణలో స్వామివారి భక్తులతో పాటు వారు పాల్గొన్నారు. ఉదయం 5.30 గంటలకు వైకుంఠ ద్వారం వద్దకు చేరిన సుమారు 2 వేల మంది భక్తజనులతో ప్రారంభమై కొండచుట్టూ సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాలపాటు సాగిన ప్రదక్షిణ పూర్తయ్యేటప్పటికి భక్తుల సంఖ్య 10 వేలు దాటింది. ప్రదక్షిణ చేసిన భక్తులు మెట్ల దారిలో కొండపైకి చేరుకుని క్యూ లైన్ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. విప్, ఈవో, ఆలయ అధికారులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తెలంగాణలో గిరిప్రదక్షిణ కలిగిన ఏకైక ఆలయంగా యాదగిరిగుట్ట పేరొందింది. ఇక యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో మంగళవారం స్వాతి నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. స్వామివారి భక్తులకు నిత్యాన్నదానం కోసం హైదరాబాద్ అజ్రా హోమ్స్‌కు చెందిన నిమ్మగడ్డ రామకృష్ణారావు, జ్యోతి దంపతులు మంగళవారం రూ.18 లక్షల చెక్కును అందజేశారు.



యాదగిరిగుట్ట ఆలయ గిరిప్రదక్షిణ రోడ్డు మార్గంలో భక్తజన సందోహం

భద్రాద్రి గుదిబండ

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, అందువల్ల జరిగిన నష్టాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కె.రఘు తమ సమావేశంలో చర్చించిన అంశాలను విలేకరులకు చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్ఈఎల్‌ను కాపాడే పేరుతో మరో ప్రభుత్వరంగ సంస్థను బలి చేయడం సరికాదని రఘు అన్నారు. పోటీ బిడ్డింగ్‌తో తక్కువ ధరకు ప్లాంట్ల నిర్మాణం జరిగే అవకాశాలుండగా, బీహెచ్ఈఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. యాదాద్రిని మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పిన బీహెచ్ఈఎల్ తొమ్మిదేళ్లయినా పూర్తి చేయలేక పోయిందన్నారు. భద్రాద్రిని రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పినా ఏడేళ్లు పట్టిందని చెప్పారు. 2013-14లో బీహెచ్ఈఎల్ పోటీ బిడ్డింగ్‌లో పాల్గొని టెండర్లు దక్కించుకునే సమర్థత 88% కలిగి ఉండగా... 2015-16 నాటికి శూన్యస్థాయికి చేరిందని 2017లో స్వయంగా కాగ్ పేర్కొందని గుర్తు చేశారు. ఎల్1 కన్నా 88 శాతం అధికంగా ఛార్జీలు కోట్ చేయడమే బీహెచ్ఈఎల్ పోటీ బిడ్డింగ్‌లలో నెగ్గలేని పరిస్థితికి కారణమని కాగ్ పేర్కొందని ప్రస్తావించారు.

ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో రూ.3,385 కోట్ల నష్టం

తెలంగాణ సర్కారు ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం చేసుకోవడం వల్ల అన్నిరకాలుగా రూ.3,385 కోట్ల నష్టం జరిగిందని కె.రఘు అన్నారు. అదే సమయంలో పోటీ బిడ్డింగ్‌కు వెళ్లడం వల్ల కేరళ రాష్ట్రానికి యూనిట్ కరెంట్ రూ.3.60కే వచ్చిందని గుర్తు చేశారు. 1000 మెగావాట్ల కరెంట్‌ను తీసుకోవడానికి ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్నప్పటికీ ఆ మేరకు ఆ రాష్ట్రం కరెంట్ ఇవ్వక పోవడంతో ఆ స్థానంలో బహిరంగ విపణిలో కొన్న విద్యుత్ వల్ల రూ.2 వేల కోట్ల అదనపు భారం ప్రజలపై పడిందన్నారు. కరెంట్ కొనుగోళ్లు చేసినా ఛత్తీస్‌గఢ్‌కు సకాలంలో చెల్లింపులు చేయని కారణంగా వడ్డీలు/పెనాల్టీల రూపంలో లేట్ పేమెంట్ సర్‌చార్జీ కింద రూ.750 కోట్లు చెల్లింపులు చేస్తున్నారని చెప్పారు. 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్ కారిడార్ బుక్ చేసుకున్నప్పటికీ కరెంట్‌ను ఆ మేరకు కారిడార్ నుంచి తరలించక పోవడం వల్ల రూ.635 కోట్ల చార్జీలు కలుపుకొని ఛత్తీస్‌గఢ్ కరెంట్‌తో రూ.3385 కోట్ల భారం తెలంగాణపై పడిందని వెల్లడించారు. మరో 1000 మెగావాట్ల కారిడార్‌ను రద్దు చేసుకున్నందుకు నష్టపరిహారం కింద రూ.261 కోట్ల పరిహారం చెల్లించాలని పవర్‌గ్రిడ్ నోటీసు ఇచ్చిందని ప్రస్తావించారు. ఈ కేసు అప్పిలేట్ ట్రైబ్యునల్‌లో ఉందని గుర్తు చేశారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి నుంచి అనుమతే లేదని, ఒప్పందంలో పలు మార్పులు చేయాలని, 2017 ఏప్రిల్‌లో ఇచ్చిన తీర్పులో నియంత్రణ మండలి చెప్పిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా గత ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోలేదని, ఏడేళ్లు అవుతున్నా ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి(పీపీఏ)కు ఈఆర్‌సీ అనుమతే తీసుకోలేదని స్పష్టం చేశారు.

భద్రాద్రితో రూ.9 వేల కోట్ల భారం

దేశవ్యాప్తంగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో విద్యుత్ ప్లాంట్లు నిర్మిస్తున్న తరుణంలో ఎప్పుడో 2010లో 2010లో ఇండియా బుల్ సంస్థ కోసం సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో తయారుచేసిన జనరేటర్లు, టర్బయిన్లు వినియోగంలో లేకుండా ఉన్నాయని, వాటిని వినియోగించి, రెండేళ్లలో ప్లాంట్‌ను పూర్తి చేస్తామని చెప్పి కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి పూనుకున్నారని కె.రఘు తెలిపారు. దీనివల్ల సూపర్ క్రిటికల్‌తో పోల్చుకుంటే ఏడాదికి రూ.350 కోట్ల అదనపు భారం పడుతోందని, ప్లాంటు జీవితకాలంలో 25 ఏళ్లకు నష్టం రూ.9 వేల కోట్లకు చేరుతుందని వివరించారు. 15 ఏళ్లు దాటిన తర్వాత ప్లాంటులో ఉత్పన్నమయ్యే సమస్యలు భద్రాద్రి ప్లాంటులో ఇప్పటికే వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ నిర్మాణానికి ఎంచుకున్న ప్రదేశం కూడా సరైనది కాదన్నారు. పోలవరం నిర్మాణం పూర్తయి, పూర్తి స్థాయిలో నీటిని నింపితే వరద వచ్చినపుడు భద్రాద్రి పవర్ ప్లాంట్ మునుగుతుందని స్వయంగా గత ప్రభుత్వమే పోలవరం అథారిటీ దృష్టికి తీసుకొచ్చిందని కె.రఘు గుర్తు చేశారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ పూర్తయినా ఈ ప్లాంట్ కోసం వేసిన లైన్లు మునుగుతాయని చెప్పారు. గతంలో గోదావరి వరదలతో పలు సందర్భాల్లో నిర్మాణ పనులు నిలిచి పోయాయని కె.రఘు ప్రస్తావించారు.

యాదాద్రితో ఏటా 1600 కోట్ల రవాణాభారం

తెలంగాణ ఉద్యమం జరుగుతున్న సమయంలో బొగ్గు/నీటి నిల్వలు ఉన్నచోటే ప్లాంట్‌లు కట్టాలని పోరాటాలు జరిగాయని కె.రఘు గుర్తు చేశారు. బొగ్గు గనులు, నీళ్ల అందుబాటులో ఉన్న గోదావరి తీరంలో ప్లాంట్‌లు కట్టాలని స్వయంగా కేంద్ర విద్యుత్ అథారిటీ(సీఈఏ) పలు దఫాలుగా గుర్తు చేసినా గనులకు 280 కిలోమీటర్ల సగటు దూరంలో యాదాద్రి ప్లాంట్ కడుతున్నారని చెప్పారు యాదాద్రికి ఏటా బొగ్గు రవాణా చేయడానికి అయ్యే భారం ఏటా 1600 కోట్లుగా ఉంటుందని తెలిపారు. కాగా, జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌తో బుధవారం విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్, తిమ్మారెడ్డి భేటీ కానున్నారు.

నిందలేసి తప్పించుకుంటారా: కోదండ

ఇతరులపై నిందలు వేసి, జరిగిన తప్పుల్లో తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నాల్లో మాజీ సీఎం కేసీఆర్ ఉన్నారని టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డిని కలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో విద్యుత్ సంస్థలు రూ.81 వేల కోట్ల అప్పులపాలు అయ్యాయన్నారు. కేసీఆర్ నిర్ణయాల ఫలితంగా విద్యుత్ రంగం కుప్పకూలిందని, దీనిపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని కోరారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌కు అన్ని ఖర్చులు కలుపుకొని యూనిట్‌కు రూ.7 దాకా అయ్యిందన్నారు. పోటీ బిడ్డింగ్‌ను అనుసరించి ఉంటే యూనిట్ అప్పట్లో రూ.4.15కే లభించేదని చెప్పారు. విద్యుత్ ఒప్పందాల విషయంలో కేసీఆర్ చట్ట, న్యాయసమ్మతంగా వ్యవహరించారో లేదో చూసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విభజన చట్టం కింద పైసా భారం లేకుండా 4 వేల మెగావాట్ల ప్లాంట్‌ను నిర్మించడానికి ఎన్‌టీపీసీ సిద్ధపడగా దానికి కేసీఆర్ సమ్మతించలేదన్నారు. తొలిదశ 1600 మెగావాట్లకే అంగీకారం తెలిపి, విద్యుత్‌సంస్థలపై భారం పడే నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

వానమ్మా.. రావమ్మా!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఉత్తర తెలంగాణలోని జిల్లాలు అధిక ఉష్ణోగ్రతలతో ఉడికిపోతున్నాయి. నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందు పడిన 'ప్రీ మాన్‌సూన్ షవర్స్' ప్రభావంతో అడపా దడపా వర్షాలు కురిశాయి. వెంటనే నైరుతి రుతుపవనాలు కూడా రాష్ట్రంలోకి ప్రవేశించటంతో.. కొనసాగింపుగా వానలు పడతాయని అంతా భావించారు. కానీ సీన్ రివర్స్ అయ్యింది. దాదాపు వారం- పది రోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. 35 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత వాతావరణం నెలకొంది. తొలుత పడ్డ వర్షాల నేపథ్యంలో.. కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటారు. ఇప్పుడు వానలు సరిగ్గా కురవకపోవడంతోపాటు నీళ్ల అందుబాటులో లేకపోవటంతో అవి ఎండిపోతున్నాయి. చాలామంది రైతులు వరి నార్లు ఇంకా పోయలేదు. విత్తనాలు తెచ్చి పెట్టుకున్నారుగానీ.. వేద్దామంటే వాతావరణం అనుకూలించట్లేదు. మొక్కజొన్న విత్తనాలు కూడా వేయలేని పరిస్థితి ఉంది. మొక్కజొన్న ఆరుతడి పంట అయినప్పటికీ.. గట్టి వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు వేద్దామనే ఆలోచనతో రైతులు ఎదురుచూస్తున్నారు. పంట చేలలో ఉన్న గడ్డిని తొలగించటానికి... రైతులు రోటోవేటర్లతో చదును చేశారు. ఇప్పుడా చేలల్లో మళ్లీ గడ్డి పెరుగుతోంది. సీజన్ ప్రారంభదశలో ఇలా వర్షాలు సహకరించక పోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈసారి సకాలంలో వచ్చిన నైరుతి రుతుపవనాలు బలంగా విస్తరించి ఉంటే.. ఇప్పటికే రెండు, మూడు భారీ వర్షాలు పడేవి. కాని ఆరంభం లోనే రుతుపవనాలు బలహీనపడ్డాయి. తేలికపాటి వర్షాలే అక్కడక్కడా పడుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి, మూడు, నాలుగు రోజులు ముసురుతో కూడిన భారీ వర్షాలు కురిస్తే.. పరిస్థితి చక్కబడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. కానీ, జూన్‌లో ఆ పరిస్థితి నెలకొనే అవకాశం కనిపించట్లేదని.. జూలైలో నైరుతి బలపడి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వారు చెబుతున్నారు. అయితే.. జూన్ నెలాఖరులోగా వానలు పడకపోతే పంటల సాగు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. పంటల సాగు ఆలస్యమైతే మళ్లీ ప్రకృతి విపత్తులను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందనే ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

డిప్లొమాలు కొన్ని ఎంప్లాయిమెంట్ కల్పించడంలో కల్పతరువులు అని చెప్పొచ్చు. అలాంటి వాటిలో ఒకటి ప్రింటింగ్ టెక్నాలజీ. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో మాత్రమే ఈ కోర్సు ఉంది. దీనిలో చేరడానికి పదో తరగతి పాసై తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే పాలిసెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. హైదరాబాద్‌లో జూ పార్క్‌కి సమీపంలోని కులి కుతుబ్‌షా (క్యూ.క్యూ) గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే ఈ కోర్సును అందిస్తున్నారు.

వంద శాతం ఎంప్లాయిమెంట్ కల్పించే ప్రింటింగ్ టెక్నాలజీ



కోర్సు తీరు తెన్నులు

ఆధునిక ప్రపంచంలో ముద్రణ మాధ్యమానికి ఉన్న విస్తృత అవసరాల దృష్ట్యా ప్రింటింగ్ టెక్నాలజీ డిప్లొమాను మూడు సంవత్సరాల కోర్సుగా రూపొందించారు. అత్యాధునిక ముద్రణ సాంకేతిక విధానాలైన offset, gravure, flexography, screen, digital ప్రింటింగ్ గురించి బోధిస్తారు. ఈ కోర్సులో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి మూడు సంవత్సరాల్లో ఆరు సెమిస్టర్లు చదవాల్సి ఉంటుంది. మొదటి రెండు సెమిస్టర్లలో రెండు ప్రింటింగ్ సబ్జెక్టులు మినహాయిస్తే మిగిలిన సబ్జెక్టులన్నీ తతిమా అన్ని డిప్లొమాలతో సమానంగా ఉంటాయి. 3, 4, 5వ సెమిస్టర్లలో పూర్తిగా ప్రింటింగ్‌కు సంబంధించిన సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.

క్షేత్రస్థాయి అవగాహన

ఈ కోర్సు ద్వారా థియరీతోపాటు ప్రాక్టికల్స్‌లో కూడా మంచి పట్టు సాధించాల్సి ఉంటుంది. ప్రింటింగ్ టెక్నాలజీ చదువుతున్న విద్యార్థులను హైదరాబాద్‌లోని ప్రముఖ ముద్రణ సంస్థల్లో ఇండస్ట్రియల్ విజిట్‌కి తీసుకుని వెళతారు. తద్వారా పారిశ్రామిక స్థితిగతులను అవగాహన చేసుకునే అవకాశం కల్పిస్తారు. చివరి సెమిస్టర్‌లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఉంటుంది. ఈ ఆరు నెలల్లో విద్యార్థి ముద్రణ రంగంలోని అన్ని విభాగాలలో పనిచేసి సంబంధిత నైపుణ్యాన్ని అలవర్చుకోవాలి. తద్వారా యంత్రాలు నడపగలిగే స్థాయికి విద్యార్థి చేరుకుంటాడు. అంతే కాకుండా నిర్వహణ సామర్థ్యానికి సంబంధించిన నైపుణ్యాలు(మేనేజ్‌మెంట్ స్కిల్స్), ఆధునిక సాంకేతికత(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్), మార్కెటింగ్ నైపుణ్యాలు(మార్కెటింగ్ స్కిల్స్)లో తర్ఫీదు పొందుతాడు.

అభిరుచికి అనుగుణంగా....

ఈ కోర్సు చదివిన విద్యార్థి ముద్రణ పరిశ్రమలోని ముఖ్యమైన నాలుగు విభాగాలు ప్రి ప్రెస్, ప్రెస్ వర్క్, పోస్ట్ ప్రెస్, మార్కెటింగ్‌లలో వారి వారి ఆసక్తులను బట్టి ఎంచుకునేందుకు, సదరు విభాగాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

- ప్రి ప్రెస్ విభాగాన్ని డి.టి.పి & డిజైనింగ్‌లో ఆసక్తి, నైపుణ్యం ఉన్నవారు ఎంపిక చేసుకుంటారు. ప్రెస్-వర్క్ విభాగంలో యంత్ర నిర్వాహకుడిగా, పర్యవేక్షకుడిగా పెద్ద స్థాయుల్లో అవకాశాలుంటాయి. ప్రింట్ ఫినిషింగ్‌లో బైండింగ్, ప్యాకింగ్‌పై ఆసక్తి ఉన్నవారుంటారు. మార్కెటింగ్ విభాగంలో సరైన నిర్ణయాలు, అంచనా వేయగలిగిన వారు, వినియోగదారులతో వ్యాపార సంబంధాలను నెరపగలిగిన వారుంటారు.

ఉన్నత స్థానాల్లో పూర్వ విద్యార్థులు

రిజర్వ్‌బ్యాంక్ కరెన్సీ ప్రెస్‌లో ఉద్యోగం పొందాలంటే డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ తప్పనిసరి. ఈ కోర్సు చేసిన తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎంతో మంది ప్రభుత్వ రంగ సంస్థలు మింటింగ్, భారతీయ రిజర్వు బ్యాంకు, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయాలు అలాగే ప్రైవేటు రంగంలో వివిధ ముద్రణ సంస్థల్లోనూ, పత్రికారంగంలోనూ ఉన్నత స్థాయిలో ఉన్నారు. ప్రింటింగ్ టెక్నాలజీ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ప్రింటింగ్ పరిశ్రమలలో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అనుభవం గడించిన తరవాత కొందరు సొంతగా ప్రింటింగ్ ప్రెస్‌లు స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఏటా క్రమం తప్పకుండా జరుగుతుంది. అందరూ దాదాపుగా ఏదో ఒక దగ్గర ఉద్యోగం పొందుతారు. కొద్ది సంవత్సరాలుగా విద్యార్థినుల సంఖ్య పెరగుతోంది. ప్రింటింగ్ డిప్లొమా చేసే విద్యార్థినులు ఎక్కువగా డిజైన్, పోస్ట్ ప్రెస్, క్వాలిటీ కంట్రోల్ విభాగాలను ఎంచుకుంటుంటారు.

ఉన్నత విద్యావకాశాలు

ఈ డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈసెట్‌లో ఉత్తీర్ణత సాధించి లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రింటింగ్ టెక్నాలజీలో మాత్రమే కాకుండా మెకానికల్, కంప్యూటర్స్ ఐ.టి., ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లలో కూడా బీటెక్ చదివే అవకాశం ఉంది. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం ద్వారా 40 శాతం విద్యార్థులు ఉన్నత విద్యను పొందగలుగుతున్నారు.

డిగ్రీ అందిస్తున్న సంస్థలు

- మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(మణిపాల్, కర్ణాటక)
- జాదవపూర్ యూనివర్సిటీ, కోల్‌కతా(పశ్చిమ బెంగాల్)
- కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, గిండీ(చెన్నై, తమిళనాడు)
- గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(హిస్సార్, హరియాణ)
- సింఘానియా యూనివర్సిటీ, ఝునుఝును(రసూల్‌పూర్, రాజస్థాన్)
- పుణె విద్యార్థి గృహ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(పుణె, మహారాష్ట్ర)
- కాలికట్ యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మల్లప్పురం(కేరళ)
- అవినాశలింగమ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హోమ్‌సైన్స్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ ఉమన్, కోయంబత్తూరు(తమిళనాడు)

కొండా లక్ష్మణ్ వర్సిటీలో హార్టికల్చర్ డిప్లొమా



ములుగు(సిద్దిపేట)లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- 'డిప్లొమా ఇన్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో కళాశాలలో 40 చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 40 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించారు. తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్/పదోతరగతి మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

- ఆదిలాబాద్ హార్టికల్చర్ పాలిటెక్నిక్
- రామగిరిఖిల్లా హార్టికల్చర్ పాలిటెక్నిక్
- కొల్లాపూర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్

అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలు

- గంట గోపాల్ రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్-గడ్డిపల్లి, సూర్యాపేట్ జిల్లా
- విశ్వధరణి హార్టికల్చర్ పాలిటెక్నిక్-తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా

అర్హత: అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ పాలిసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్ నుంచి సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా పదోతరగతి పూర్తిచేసిన వారు, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/హయ్యర్ డిగ్రీ కోర్సులు పూర్తిచేసిన వారు దరఖాస్తుకు అనర్హులు. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 15
- **చిరునామా:** రిజిస్ట్రార్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, ములుగు, సిద్దిపేట్ జిల్లా-502279
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఎల్ఎల్‌బీ



విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(డీఎస్ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. దేశవ్యాప్తంగా వర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(డీఈటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: మొత్తం 138 సీట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కేటగిరీ కింద 66 సీట్లు, ఆలిండియా కేటగిరీ కింద 54 సీట్లు, విదేశీయులు/ఎన్ఆర్ఐలు/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ అభ్యర్థుల కేటగిరీ కింద 12 సీట్లు, కశ్మీరీ పండిట్స్/కశ్మీరీ మైగ్రెంట్స్/కశ్మీరీ హిందూ కుటుంబాలకు చెందిన పిల్లల కేటగిరీ కింద 6 సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ అభ్యర్థులకు 42 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఈ పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్, లీగల్ ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; బీసీ, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- ఎంట్రెన్స్ టెస్ట్ తేదీని త్వరలో ప్రకటిస్తారు.
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు టెస్ట్ సెంటర్లు:** విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు, హైదరాబాద్
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **ఈ-మెయిల్:** admissions@dsnlu.ac.in
- **వెబ్‌సైట్:** https://dsnlu.ac.in

SCHOLARSHIP ALERT

Legrand Empowering Scholarship Program

Description: Legrand invites applications from meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans pursuing B.Tech., B.E., B.Arch., or other undergraduate degrees in Finance or Science (such as B.Sc., B.Com., B.B.A., etc.) across India. The scholarship is meant to support meritorious students to pursue a career in Engineering, Architecture, Finance and Sciences.

Eligibility: The scholarship is open to meritorious girls, differently-abled girls, LGBTQ+ students, Covid-affected students and students with single parents or orphans across India.

- Applicants must have secured admission in B.Tech., B.E., B.Arch., B.B.A., B.Com., or B.Sc. degrees in India.
- Applicants must have passed Class 12 in the year 2023–24.
- Girl students must have secured a minimum of 70% and above marks in Classes 10 and 12 examinations.
- Special category* students must have secured 60% marks in Classes 10 and 12 examinations. Exceptions may be considered on a case-by-case basis.
- The annual family income of the applicant from all sources must be less than INR 5,00,000.
- Preference will be given to special category* students.

Prizes & Rewards: Girl students are awarded 60% course fees up to INR 60,000 per year till the completion of course based on academic performance.

- Students in the special category* will be awarded 80% fees up to INR 1,00,000 per year till the completion of the course based on academic performance.


Last Date to Apply: 15-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LFLS9

Aadhar Kaushal Scholarship Program for Youth with Disabilities

Description: An initiative of Aadhar Housing Finance Limited (AHFL) to ensure equal educational opportunities for all physically disabled students, irrespective of their geographical location, gender, or socio-economic condition.

Eligibility: Students with physical disabilities pursuing general or professional undergraduate courses across India. Pan-India students can apply. Students must have achieved a minimum of 60% marks in the preceding academic year. Applicants with a gross annual family income of up to INR 2.5- 3 lakh are eligible to apply.

Prizes & Rewards: Scholarship between INR 10,000 - INR 50,000
Last Date to Apply: 23-07-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/AKSP1



Raman Kant Munjal Scholarships

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.

- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 02-08-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/RMKSP4

buddy4study.com

లిటిల్స్

మీకు తెలుసా?



పులుల మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ ఉంటుంది? ఒక దానితో మరొకటి ఎలా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటాయి? అనేది పెద్ద పజిల్. పులులపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు అవి- లో ఫ్రీక్వెన్సీ ఇన్‌ఫ్రాసౌండ్ అనే పద్ధతి ద్వారా సంకేతాలు ఇచ్చిపుచ్చుకుంటాయని పేర్కొంటున్నారు. వీటి తరంగదైర్ఘ్యం తక్కువగా ఉండటం వల్ల ఇవి మానవులకు వినబడవు.



ఫ్రాన్స్‌లో ఒక రోడ్డును రోజుకు రెండు సార్లు మాత్రమే తెరుస్తారు. మిగిలిన సమయాల్లో అలలు ఆ రోడ్డును నీటిలో ముంచెత్తుతాయి. అందువల్ల ఆ రోడ్డు మీదుగా వాహనాలు ప్రయాణించలేవు.

ఎన్ని పందులు ఉన్నాయి?



7 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 336

					3			
		8					7	6
	7			2		5	9	
	3	1	2		8			
6			1		7			5
			6		9	1	3	
	4	2		6			1	
9	8					2		
			4					

సుడోకు - 335 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.